DATE: 28-06-2022 RNI NO : TELTEL/2021/81092 prajamantalu, Jagitial

# ప్రజా మంటలు

తెలుగు జాతీయ దినపత్రిక

ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

సంపుటి(Volume) : 3 పేజీలు - 08

సంచిక(Issue) : 77 వెల: రూ 5/-

prajamantalu.com

మంగళవారం 28 జూన్, 2022

tPublished From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



అగ్నివీరుల రిటైర్మెంట్ వయస్సు 65 ఏళ్లకు పెంచండి
పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ

2లో



జులై 6నుంచి పాఠ్యపుస్తకాల పంపిణీ
పదో తరగతి వరకు అన్ని సబ్జెక్టులకు అందుబాటులోకి

2లో



# తిరుగుబాటు తప్పదు

## మోడీపై తెలంగాణ నుంచే తిరుగుబాటు

దేశంలో నడుస్తోంది మోడీ రాజ్యాంగమే

- రాష్ట్రాల హక్కులను హరిస్తున్న మోడీ
- తెలంగాణకు రూపాయి ఎక్కువిచ్చినా రాజీనామా చేస్తా
- ప్రశ్నించిన విపక్షాలపై దర్యాప్తు సంస్థల ఉసిగొలుపు
- మీడియా సమావేశంలో కేటీఆర్ ఘాటు విమర్శలు

**న్యూఢిల్లీ,జూన్27:** ప్రధాని నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ నుంచే తిరుగుబాటు వస్తుందేమోనని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై ప్రజలు తిరగబడే రోజులు తప్పకుండా వస్తాయన్నారు. దేశంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదు.. మోదీ రాజ్యాంగం అమలవుతుందని నిప్పులు చెరిగారు. విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణకు, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పని చేస్తారనే సంపూర్ణ విశ్వాసంతో యశ్వంత్ సిన్హా అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపామని కేటీఆర్ తెలిపారు. టీఆర్ఎస్ పార్టీ తరపున సంపూర్ణగా మద్దతు ప్రకటించామని అన్నారు. యశ్వంత్ సిన్హాను హైదరాబాద్ రావాలని ఆహ్వానించాం. హైదరాబాద్‌లో తమ ఎంపీలు, శాసనసభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయనకు మద్దతు తెలుపుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఒక నియంతలా వ్యవహరిస్తోందని, నిరంకుశ విధానాలతో, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ.. గత 8 ఏండ్ల నుంచి ఆయా రాష్ట్రాలకు అన్యాయం చేస్తున్నారని - మిగతా 2లో

విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థిగా

# యశ్వంత్ నామినేషన్

రాజ్యసభ సెక్రటరీకి నామినేషన్ పత్రాలు అందచేత

హాజరైన రాహుల్, కేటీఆర్, పవార్, సీతారామ్ ఏచూరి తదితరులు

యశ్వంత్ సిన్హాకు ఉమ్మడిగా మేమంతా మద్దతు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,జూన్27:** విపక్షపార్టీల రాష్ట్రపతి అభ్యర్థిగా మాజీ కేంద్రమంత్రి యశ్వంత్ సిన్హా నామినేషన్ వేశారు. ఆయన వెంట కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తదితరులు వెంటరాగా ఆయనతన నామినేష్ వేశారు. రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీకి నామినేషన్ పత్రాలు - మిగతా 2లో

# రైతుకు సాయం

## నేటినుంచే రైతుల ఖాతాల్లోకి రైతుబంధు నిధులు

పంపిణీకి సిద్ధంగా రూ.7521.80 కోట్ల నిధులు

68.10 లక్షల మంది అన్నదాతలకు అందనున్న సాయం



**హైదరాబాద్,జూన్27:** నేటినుంచి నుంచి తెలంగాణ రైతులు ఖాతాల్లో వానాకాలం రైతుబంధు నిధులు జమ అవ్వనున్నాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కు రైతుల పక్షాన రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. 68.10 లక్షల మంది అన్నదాతలు రైతుబంధుకు అర్హులని మంత్రి తెలిపారు. కోటి 50 లక్షల 43 వేల 606 ఎకరాలకు సాయం అందనుందని వెల్లడించారు. పంపిణీకి రూ.7521.80 కోట్ల నిధులు సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. ఒక ఎకరా నుంచి మొదలుకుని ఆరోహణ క్రమం(చిన్న సంఖ్య నుండి పెద్ద సంఖ్య)లో రైతుల ఖాతాల్లో నిధులు జమవుతాయని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎకరాల వారీగా బిల్లుల జాబితా రూపొందించి ఆర్థికశాఖకు అందించింది వ్యవసాయ శాఖ. కాగా మొదటిసారి రైతుబంధు తీసుకునే రైతులు వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను కలిసి పట్టాదార్ పాసుబుక్కు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు అందించి నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. కేంద్రం ఎన్ని ఆర్థికపరమైన అడ్డంకులు సృష్టించినా రైతుల మీద అభిమానంతో రైతుబంధు నిధుల విడుదలకు సీఎం ఆదేశాలు ఇచ్చారని మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పత్తి, కంది, ఇతర అపరాలు, నూనెగింజల పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని - మిగతా 5లో

## రెబల్స్‌పై ఉద్ధవ్ థాక్రే చర్యలు

- 9మంది మంత్రులు శాఖలు తొలగింపు
- ఏక్‌నాథ్ షిండే వర్గానికి సుప్రీంకోర్టులో ఊరట
- వేటు వేయకుండా ఆదేశాలు ఇచ్చిన కోర్టు
- జూలై11కు విచారణ వాయిదా



**ముంబై,జూన్27:** మహారాష్ట్రలో రాజకీయ ప్రతిష్ఠంభన కొనసాగుతున్నది. శివసేన చీఫ్, సీఎం ఉద్ధవ్ ఠాక్రే సోమవారం కీలక నిర్ణయం తీసుకున్నారు. 9 మంది రెబల్స్ మంత్రుల శాఖలను తొలగించారు. ఆయా మంత్రిత్వ శాఖలను మిగతా మంత్రులకు కేటాయించారు. శివసేన తిరుగుబాటు గ్రూపు నేత ఏక్‌నాథ్ షిండే చూస్తున్న పట్టణాభివృద్ధి, పబ్లిక్ వర్క్స్ మంత్రిత్వ శాఖలను మంత్రి సుభాష్ దేశాయ్‌కు - మిగతా 2లో

# నిలదీద్దాం

## మోడీకి నిరసనలు తెలుపుదాం

అగ్నిపథ్‌పై హైదరాబాద్‌లో నిలదీద్దాం

కాంగ్రెస్ శ్రేణులకు రేవంత్ పిలుపు

మల్కాజిగిరిలో సత్యాగ్రహ దీక్షలో రేవంత్



**హైదరాబాద్,జూన్27:** బిజెపి జాతీయ సమావేశాల సందర్భంగా ప్రధాన మంత్రినరేంద్ర మోదీహైదరాబాద్ వచ్చినప్పుడు నిరసనలు తెలియజేయాలని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ యువతకు మోదీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే మోదీ పర్యటనలో నిరసనలు వ్యక్తం చేస్తామన్నారు. మోదీకి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా యువతన నిరసన తెలపాలని అన్నారు. కేంద్రం వెంటనే అగ్నిపథ్‌ను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు. రైల్వే ఆస్తుల ధ్వంసం కేసులో అరెస్ట్ అయిన వారిని విడుదల చేయాలని కోరారు. శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే జవానులను అవమానించేలా మోదీ సర్కారు వ్యవహరిస్తోందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. అగ్నిపథ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మల్కాజ్‌గిరి కూడలి వద్ద చేపట్టిన సత్యాగ్రహ దీక్షలో రేవంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులను, సైనికులను సమాజాన్ని నిర్మించే శక్తులుగా వారిని కాంగ్రెస్ గుర్తించిందన్నారు. అంబాని, ఆదాని కంపెనీల రక్షణకు అగ్నిపథ్ పథకాన్ని తెచ్చారని ఆరోపించారు. నాలుగేళ్లు సైన్యంలో ఆ తరువాత జీవిత కాలం బడా పారిశ్రామిక వేత్తలకు కాపలా కాయలా? అని ప్రశ్నించారు. అగ్నిపథ్‌తో ఉద్యోగ భద్రత లేదని, మాజీ సైనికుల హోదా లేదని, ఫించన్ కూడా లేదని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. అగ్నిపథ్ పథకంతో యువత భవిష్యత్తును - మిగతా 2లో

## నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

ఫలితాలు ప్రకటించనున్న మంత్రి సబిత



**హైదరాబాద్, జూన్ 27:** ఇంటర్మీడియట్ ఫలితాలను 28వ తేదీ మంగళవారం విడుదల చేయాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఉదయం 11 గంటలకు రాష్ట్ర విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను - మిగతా 2లో

## హైకోర్టు సీజేగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్

నేడు ప్రమాణం చేయించనున్న గవర్నర్

**హైదరాబాద్,జూన్27:** రాష్ట్ర హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా ఉజ్జల్ భూయాన్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గవర్నర్ తమిళిసై ఆయనతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. రాజ్‌భవన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరవుతారా లేదా అనేది సస్పెన్స్ గా మారింది. ఇకపోతే... ఇప్పటివరకు తెలంగాణ హైకోర్టు సీజేగా ఉన్న సతీష్ చంద్రను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేశారు. ఐదు రాష్ట్రాల హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తుల నియామకానికి సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ విపిన్ సంఘీని ఉత్తరాఖండ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ గా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది. బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ అమ్జద్ ఎ. సయీద్ ను హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు సీజేగా, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ రష్మిన్ ఎం.ఛాయను గువాహటి హైకోర్టు సీజేగా, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎస్.షిండేను రాజస్థాన్ హైకోర్టు సీజేగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది.



## ప్రజానాడి






## గజ్వేల్‌కు చేరుకున్న తొలి గూడ్స్‌రైలు

స్వాగతం పలికిన మంత్రులు హరీష్, నిరంజన్ రెడ్డి

గజ్వేల్ రైల్వే స్టేషన్‌లో రేక్ పాయింట్

దశాబ్దాల పోరాట ఫలితం అన్న మంత్రి హరీష్

రేక పాయింట్‌తో ఈ ప్రాంతానికి మేలన్న మంత్రి నిరంజన్

5లో

# తిరుగుబాటు తప్పదు

మొదటిపేజీ తరువాయి..

కేటీఆర్ మండిపడ్డారు. 8 రాష్ట్రాల్లో వారికి మెజార్టీ లేకపోయినా ఆయా ప్రభుత్వాలను తలకిందులు చేసి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా బరితెగింపు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. ాజ్యాంగ సంస్థలను తమ గుప్పిట్లో ఉంచుకొని విపక్షాల మీద వేటకుక్కల్లాగా వాటిని ఉసిగొల్పి రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నారని ప్రధాని మోదీపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దాన్ని తిరస్కరించాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యంపై నమ్మకమున్న అన్ని పార్టీలకు ఉంటుందన్నారు. బీజేపీ ప్రతిపాదించిన అభ్యర్థిని నిర్ద్వందంగా తిరస్కరిస్తున్నామని తేల్చిచెప్పారు. బీజేపీ నిర్ణయానికి వ్యతిరేకంగా, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న వైఖరికి వ్యతిరేకంగా, అత్యున్నతమైన రాష్ట్రపతి పదవికి విపక్షాలు బలపరిచిన యశ్వంత్ సిన్హాకు మద్దతు ఇస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. యశ్వంత్ సిన్హాకు మద్దతివ్వాలని ఇతర పార్టీలకు కూడా విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. యశ్వంత్ సిన్హా గెలువాలని, రాష్ట్రపతి పదవీ బాధ్యతలు స్వీకరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ము పట్ల వ్యక్తిగతంగా మాకు ఇబ్బంది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆవిడ మంచి వ్యక్తే కావొచ్చు. గిరిజన, మహిళా అభ్యర్థిని చెప్పడం సరికాదు. జనవరి 2, 2006లో ఒడిశాలో కళింగనగర్‌లో స్టీల్ ప్లాంట్ వద్ద ఆందోళన చేస్తున్న 13 మంది గిరిజనులను కాల్చి చంపారు. అప్పటి ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామి. ద్రౌపది నాడు మంత్రి కూడా. నాడు ఆమె ఎలాంటి సానుభూతి తెలుపలేదు. గిరిజనులకు అన్యాయం జరిగిందని ఒక్క మాట కూడా మాట్లాడలేదు. నిజంగానే గిరిజనులపై ప్రేమ ఉంటే.. తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి పంపిన షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్లను పెంచాలని కోరుతున్నాం. ఒక వేళ నిజంగానే గిరిజనులపై ప్రేమ ఉంటే ఇప్పటి వరకు చేసి ఉండాలి. కానీ ఉలుకు పలుకు లేదు. ట్రైబల్ యూనివర్సిటీ పెడుతామని పునర్విభజన చట్టంలో చెప్పారు. ఈ రోజు వరకు అతీగతీ లేదు. తెలంగాణలోని ఏడు మండలాలను



ఏపీలో కలిపారు. బీజేపీ వ్యవహారం దేశంలోని గిరిజనులకు, తెలంగాణలోని గిరిజనులకు బాగా తెలుసు. చిత్తశుద్ధి ఉంటే ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. రిజర్వేషన్లను పెంచాలి. ఏడు మండలాలను తిరిగి వెనక్కి ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు టీఆర్ఎస్ మద్దతు ఉంటుందని మంత్రి కేటీఆర్ అన్నారు. బీజేపీకి గిరిజనుల మీద ప్రేమ లేదన్నారు. రాష్ట్రపతి అభ్యర్థి పేరుతో బీజేపీ నేతలు రాజకీయం చేయాలని చూస్తున్నారన్నారు. తాము ప్రతిపక్షాల కూటమిలో ఉన్నామని ఎవరు చెప్పారని ప్రశ్నించారు. బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాల అభ్యర్థికి తాము మద్దతిచ్చామన్నారు. గిరిజనుల రిజర్వేషన్లు పెంచాలని చాలా సార్లు కేంద్రాన్ని కోరామని చెప్పారు. గిరిజన రిజర్వేషన్ల మీద తెలంగాణ అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని ఆమోదించాలన్నారు. గిరిజన వర్శిటీ ఇప్పటి వరకు లేదన్నారు. బీజేపీకి కేసీఆర్ బొమ్మ తప్ప వేరే దిక్కులేదన్నారు. మోడీ ఫోటోకు చెప్పులేసి గాడిద మీద ఊరేగించగలం కానీ అలా చేయబోమన్నారు. మోడీ మూడు సార్లు సీఎం అయినా గుజరాత్‌లో ఇంతవరకు కరెంట్ లేదన్నారు. ద్రౌపది ముర్ము సొంత గ్రామానికే ఇప్పుడు కరెంట్ ఇస్తున్నారన్నారు. అందరికి విద్యుత్ సౌకర్యం ఇచ్చామన్న మోడీ మాటలు అబద్ధమన్నారు. రాజ్యాంగాన్ని కాలరాసి మెజారిటీ లేకపోయినా ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అయితే జుమ్లా..లేకుంటే హమ్లా మోడీ ఫార్ములా అని అన్నారు. తెలంగాణ నుంచే ధిక్కార స్వరం వినిపించి దేశాన్ని చైతన్యం చేయొచ్చొన్నారు. మోడీ 8 ఏళ్లలో తెలంగాణకు ఇచ్చింది ఏం లేదన్నారు. బీజేపీ కంటే గట్టిగా సమాధానం చెప్పే సత్తా టీఆర్ఎస్ కు ఉందన్నారు. తెలంగాణ ఇచ్చిన దాని కంటే కేంద్ర ఒక్క పైసా ఎక్కువ ఇచ్చినా రాజీనామా చేస్తానన్నారు. రామ్ నాథ్ కోవింద్ రాష్ట్రపతి అయ్యాక దళితుల బతుకులు ఏమైనా మారిపోయాయా అని ప్రశ్నించారు. విషం చిమ్ముడు తప్ప బీజేపీ నాయకుల దగ్గర విషయం లేదన్నారు. మీడియా సమావేశంలో ఎంపిలు నామా నాగేశ్వరరావు, కొత్త ప్రభాకర్ రెడ్డి,రంజిత్ రెడ్డి, బిబి పాటిల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

### విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థిగా

# యశ్వంత్ నామినేషన్

మొదటిపేజీ తరువాయి..

సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ, డీఎంకే ఎంపీలు తదితరులు పాల్గొన్నారు. నామినేషన్‌కు ముందు.. సిన్హాను



బలపరుస్తున్న పార్టీల నేతలంతా రాజ్యసభ సెక్రటరీ జనరల్ కార్యాలయం వద్ద సమావేశమయ్యారు. రాష్ట్రపతి ఎన్నిక.. ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీ కాదని, రెండు సిద్ధాంతాల మధ్య జరిగే పోరు అని పలువురు ప్రతిపక్ష పార్టీ నాయకులు అన్నారు. ఓవైపు ఆర్ఎస్ఎస్‌పై ద్వేషం, మరోవైపు అన్ని విపక్షాల కరుణ అనే రెండు సిద్ధాంతాల మధ్యే అసలైన పోరాటం జరుగుతుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. యశ్వంత్ సిన్హాను ఉత్తమ అభ్యర్థిగా తాము భావిస్తున్నామని, అందుకే టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ మద్దతు పలుకుతున్నారని ఆ పార్టీ ఎంపీ సౌగతా రాయ్ తెలిపారు. అత్యున్నత విలువలతో ఉన్న కూటమి తమదని ఆయన చెప్పారు. తాము ఎన్డీఏ అభ్యర్థి ద్రౌపదీ ముర్ముకు గౌరవిస్తా మని, కానీ ఎన్నికల్లో మాత్రం యశ్వంత్ సిన్హాకు మద్దతిస్తామని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థిగా నామినేషన్ వేసిన యశ్వంత్ సిన్హాకు పలు పార్టీలు మద్దతు తెలిపాయి. కాంగ్రెస్, తెరాస, సీపీఐ, సీపీఎం, ఎన్సీపీ, ఎస్పీ, డీఎంకే, ఆర్జేడీ, ఆర్?ఎల్డీ, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలు సిన్హాకు అండగా నిలిచాయి. యశ్వంత్ సిన్హా బిహార్ పట్నాలో 1937 నవంబర్ 6న జన్మించారు. 1958లో యూనివర్సిటీ ఆఫ్ పట్నాలో పొలిటికల్ సైన్స్?లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. అక్కడే 1962 వరకు ప్రొఫెసర్?గా పనిచేశారు. 1960లోనే సిన్హా ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. 24 ఏళ్ల పాటు సేవలందించారు. పలు కీలక పదవులు చేపట్టారు. అనంతరం 1984లో జనత పార్టీ ద్వారా రాజకీయ ప్రవేశం చేశారు. 1986లో పార్టీ ఆల్ ఇండియా జనరల్ సెక్రెటరీగా నియమితులయ్యారు. 1988లోనే రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1989లో జనతాదళ్ ఏర్పాటయ్యాక ఆ పార్టీకి జనరల్ సెక్రెటరీగా నియమితులయ్యారు. అప్పటి ప్రధాని చంద్రశేఖర్ కేబినెట్?లో 1990 నవంబర్ 1 నుంచి 1991 జూన్ వరకు ఆర్థిక మంత్రిగా పనిచేశారు. భాజపా ఏర్పాటయ్యాక 1996లో పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా యశ్వంత్ సిన్హా నియమితు లయ్యారు. 1998, 1999, 2009లో హజారీబాగ్ లోక్ సభ నియోజకవర్గం నుంచి భాజపా తరఫున పోటీ చేసి గెలుపొందారు. 1998-2022 మధ్య కాలలో అటల్‌బిహారీ వాజ్‌పేయీ హయాంలో ఆర్థిక మంత్రిగా సేవలందించారు. 2002-2004 మధ్య విదేశీ వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అభ్యర్థిగా భాజపాలో ఉంటూనే సొంతపార్టీపై గళమెత్తిన అతికొద్దిమంది నేతల్లో యశ్వంత్ సిన్హా ఒకరు. పలుమార్లు ప్రధాని నరేంద్ర మోదీపై బహిరంగంగా విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో 2018లో పార్టీ ఉపాధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి బయటకు వచ్చారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని మోదీ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు.ఆ తర్వాత బంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2021 మార్చి 13న మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీలో యశ్వంత్ సిన్హా చేరారు. మార్చి 15న పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఇప్పుడు రాష్ట్రపతి రేసులో ఉంటున్నందున పార్టీకి రాజీనామా చేసి బయటకు వచ్చారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న యశ్వంత్ సిన్హాకు అన్ని పార్టీలతోనూ సత్సంబంధాలు ఉన్నాయి. దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు ఐఏఎస్ అధికారిగా సేవలందించిన అనుభవం ఉంది. అందుకే ఆయనే రాష్ట్రపతి అభ్యర్థికి సరైన వ్యక్తి అని భావించి విపక్షాలు ఏకాభిప్రాయంతో ఆయన పేరును ఖరారు చేశాయి. రాష్ట్రపతి పదవికి జరుగుతోన్న ఈ ఎన్నికల్లో నెలకొన్న ఈ పోటీ ఇద్దరు వ్యక్తుల మధ్య కాదని..కేవలం రెండు సిద్ధాంతాల మధ్యేనని విపక్షపార్టీలు పేర్కొన్నాయి. విపక్షాల అభ్యర్థిగా రాష్ట్రపతి రేసులో ఉన్న యశ్వంత్ సిన్హా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం విపక్ష నేతలు ఈ విషయాన్ని స్పష్టం చేశారు.'యశ్వంత్ సిన్హాకు ఉమ్మడిగా మేమంతా మద్దతు ఇస్తున్నాం. వ్యక్తిగతంగా మద్దతు ఇస్తున్నప్పటికీ పోటీ మాత్రం రెండు సిద్ధాంతాల మధ్యే. ద్వేషపూరిత ఆర్ఎస్ఎస్ ఓవైపు.. దయాభావం కలిగిన ప్రతిపక్ష పార్టీలు మరోవైపు' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఇక టీఎంసీ నేత మమతా బెనర్జీ కూడా సిన్హాకు తన మద్దతు ప్రకటించారని ఆ పార్టీ నేత సౌగతా రాయ్ వెల్లడించారు. ఇది కేవలం మతతత్వం-లౌకికతత్వం, నిరంకుశత్వం-ప్రజాస్వామ్యం మధ్య జరుగుతోన్న పోరు అన్నారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల్లో రాష్ట్రపతిగా యశ్వంత్ సిన్హానే ఉత్తమమైన అభ్యర్థి అని టీఎంసీ నేత స్పష్టం చేశారు. రాష్ట్రపతి పదవికి జరుగుతోన్న ఈ పోటీ గుర్తింపు రాజకీయాలకు సంబంధించినది కాదని సీపీఐ-ఎం నేత సీతారాం ఏచూరి పేర్కొన్నారు. ద్రౌపది ముర్ము అంటే గౌరవం ఉన్నప్పటికీ.. సిద్ధాంతాల నడుమే అసలైన పోటీ అని స్పష్టం చేశారు.

# రెబల్స్‌పై ఉద్ధవ్ థాక్రే చర్యలు

మొదటిపేజీ తరువాయి..

అప్పగించారు. మరో రెబల్ మంత్రి గులాబ్రావ్ పాటిల్ వద్ద ఉన్న నీటి సరఫరా, పారిశుద్ధ్యం శాఖల బాధ్యతలను మంత్రి అనిల్ పరబ్‌కు అప్పగించారు. మరో రెబల్ మంత్రి దాదాజీ భూసే వద్ద ఉన్న వ్యవసాయం, మాజీ సైనికుల సంక్షేమ శాఖలు, రెబల్ మంత్రి సందీపన్ భూమారే వద్ద ఉన్న ఉపాధి హామీ, ఉద్యానవన శాఖలను మంత్రి శంకర్ గడఖ్‌కు కేటాయించారు. తాజాగా రెబల్ గ్రూప్‌లో చేరిన మంత్రి ఉదయ్ సావంత్ వద్ద ఉన్న ఉన్నత విద్య, సాంకేతిక విద్యా శాఖలను మంత్రి ఆదిత్య ఠాక్రేకు అప్పగించారు. అలాగే రెబల్ మంత్రి శంభురాజ్ దేశాయ్ వద్ద ఉన్న మూడు పోర్ట్‌ఫోలియోలను మంత్రులు సంజయ్ బన్సోడే, సతేజ్ పాటిల్, విశ్వజిత్ కదమ్‌లకు పంచారు. మరో రెబల్ మంత్రి రాజేంద్ర పాటిల్ (యాద్రవ్‌కర్) వద్ద ఉన్న నాలుగు మంత్రిత్వ శాఖలను మంత్రులు విశ్వజీత్ కదమ్, ప్రజక్త్ తాన్‌పురే, సతేజ్ పాటిల్, అదితి తత్కరేలకు పంపిణీ చేశారు. రెబల్ మంత్రి అబ్దుల్ సత్తార్ వద్ద ఉన్న మూడు శాఖలను మంత్రులు ప్రజక్త్ తాన్‌పురే, సతేజ్ పాటిల్, అదితి తత్కరే కేటాయించారు. రెబల్ మంత్రి ఓంప్రకాష్ కుడు వద్ద ఉన్న నాలుగు పోర్ట్‌ఫోలియోలను మంత్రులు అదితి తత్కరే, సతేజ్ పాటిల్, సంజయ్ బన్సోడే, దత్తాత్రయ్ భర్నేలకు పంపిణీ చేశారు. పరిపాలనా పరంగా ఎలాంటి ఆటంకాలు లేకుండా, ఆయా శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులు ఆగకుండా ఉండేందుకు అందుబాటులో లేని మంత్రుల వద్ద ఉన్న శాఖలను ఇతర మంత్రులకు కేటాయించినట్లు సీఎం ఉద్ధవ్ ఠాక్రే కార్యాలయం సోమవారం ప్రకటించింది. శివసేన రెబల్ ఎమ్మెల్యే ఏక్‌నాథ్ షిండే వర్గానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. శిందే వర్గంలోని ఎమ్మెల్యేలపై జులై 11 వరకు అనర్హత వేటుపై ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని డిప్యూటీ స్పీకర్‌కు అత్యున్నత ధర్మాసనం సూచించింది. మహారాష్ట్ర డిప్యూటీ



స్పీకర్ అనర్హత వేటు నోటీస్ పంపడాన్ని సవాల్ చేస్తూ ఏక్‌నాథ్ షిండే వర్గం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. దీనిపై స్పందన తెలపాలని శివసేన నాయకులు, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, కార్యదర్శి, కేంద్రానికి నోటీసులు పంపింది. అలాగే స్పీకర్ నోటీసులకు సమాధానం చెప్పాలని రెబల్ ఎమ్మెల్యేలకు సూచించింది. జులై 11 సాయంత్రం ఐదున్నర వరకు రెబల్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రెబల్ ఎమ్మెల్యేల వర్గంలోని మొత్తం 39 మందితో పాటు వారి కుటుంబసభ్యులు, ఇళ్లు, ఆస్తులకు రక్షణ కల్పించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే డిప్యూటీ స్పీకర్ పంపిన నోటీసులకు జులై 11 సాయంత్రం ఐదున్నరలోగా సమాధానం చెప్పాలని రెబల్ ఎమ్మెల్యేలకు సూచించింది. తదుపరి విచారణను జులై 11కు వాయిదా వేసింది. విశ్వాస పరీక్షపై.. మహారాష్ట్ర అసెంబ్లీలో ఎలాంటి విశ్వాస పరీక్షలకు జరగకుండా ఆదేశాలు జారీ చేయాలనే రాష్ట్ర ప్రభుత్వం వినతిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దీనిపై తాము ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని స్పష్టం చేసింది. అయితే చట్టవిరుద్ధంగా ఏం జరిగినా న్యాయస్థానాన్ని వెంటనే ఆశ్రయించవచ్చని చెప్పింది. మొదట హైకోర్టును ఆశ్రయించకుండా.. నేరుగా సుప్రీంకోర్టుకు ఎందుకు వచ్చారని షిండే తరఫు లాయర్‌ను ప్రశ్నించింది. దీనికి ఆయన స్పందిస్తూ.. ప్రస్తుత శివసేన ప్రభుత్వం మైనారిటీలో ఉందని, తమ ఎమ్మెల్యేలకు బెదిరింపులు వస్తున్న కారణంగానే ముంబయిలో కాకుండా గువాహటిలో ఉన్నట్లు పేర్కొన్నారు. డిప్యూటీ స్పీకర్‌ను తొలగించాలనే పిటిషన్‌పై విచారణ జరుగుతుండగానే.. ఆయన ఎమ్మెల్యేకు అనర్హత వేటు నోటీసులు పంపడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. గతంలో అరుణాచల్ ప్రదేశ్ నాబం రేబియా కేసు విషయాన్ని ప్రస్తావించారు. వాదోపవాదనలు విన్న అత్యున్నత ధర్మాసనం.. దీనిపై స్పందన తెలియజేయాలని మహారాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, కార్యదర్శి, కేంద్రంతో పాటు శివసేన నాయకులు అజయ్ చౌదరి, సనీల్ ప్రభుకు నోటీసులు పంపింది. ఐదు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని అదేశించింది. షిండేతో పాటు మరో 15 మంది శివసేన రెబల్ ఎమ్మెల్యేలకు శనివారం మహారాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నరహరి జిర్వాల్ అనర్హత వేటు నోటీసులు జారీ చేశారు. 48 గంటల్లోగా స్పందన తెలపాలని కోరారు. దీన్ని సవాల్ చేస్తూ షిండేవర్గం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. తనకు 38మంది శివసేన ఎమ్మెల్యేల మద్దతు ఉందని తెలిపారు. ప్రస్తుతం మహావికాస్ అఘాడీ ప్రభుత్వం మైనారిటీలో ఉందని వాదించారు. మరోవైపు షిండేతో పాటు ఆయన వర్గంలోని 9 మంది మంత్రి పదవులను సీఎం ఠాక్రే తొలగించారు.

## జులై 6నుంచి పాఠ్యపుస్తకాల పంపిణీ

### పదో తరగతి వరకు అన్ని సబ్జెక్టులకు అందుబాటులోకి

### ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ప్రచురణల సంచాలకుదు శ్రీనివాసచారి వెల్లడి

హైదరాబాద్,జూన్27: తెలంగాణలో పాఠశాల విద్యార్థులకు జులై 6 నుంచి బహిరంగ మార్కెట్‌లో పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి రానున్నాయని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ప్రచురణల సంచాలకులు శ్రీనివాసచారి తెలిపారు. ఈ ఏడాది పాఠ్యపుస్తకాల్లో ఛాప్టర్ల వారీగా క్యూఆర్ కోడ్ ప్రచురించామని పేర్కొన్నారు. తద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆ పాఠాన్ని ఆడియో, వీడియో రూపంలో చదివేందుకు విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు అన్ని సబ్జెక్టుల పాఠ్య పుస్తకాలను విక్రయించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.కాగితం ధర, టెండర్లు ఖరారు చేయడంలో జాప్యం కావడంతో పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి రావడం ఆలస్యం అవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ, విక్రయాల కాంట్రాక్టును 13 ప్రైవేటు సంస్థలకు అప్పగించినట్లు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి అనుమతి పొందిన విక్రయ కేంద్రాల్లో జులై 6వ తేదీ నుంచి పాఠ్యపుస్తకాల అమ్మకాలు ప్రారంభం అవుతాయని వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకన్నా ఎక్కువ ధర వసూలు చేస్తే డీఈఓలకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం 1 నుంచి 8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో... వాటికి సంబంధించిన పాఠ్యపుస్తకాల ముద్రణ కూడా పూర్తి చేయనున్నట్లు శ్రీనివాసచారి స్పష్టం చేశారు.



# నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి..

మే 6వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 9.07 లక్షల మంది ఉన్నారు. ఈ ఫలితాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చని అధికారులు ప్రకటించారు. కాగా పదో తరగతి పరీక్ష ఫలితాలను 30న లేదంటే జూలై 1వ తేదీన విడుదల చేసే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇంటర్ ఫలితాలపై అధికారికంగా ఇంటర్ బోర్డు ఒక ప్రకటనను విడుదల చేసింది. ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులు గత కొన్నిరోజులుగా ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే పలు కారణాల వల్ల ఫలితాల తేదీ వాయిదా పడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో 28న ఉదయం 11గంటలకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల ఫలితాలు విడుదల చేస్తామని ఇంటర్మీడియట్ బోర్డు తెలిపింది. ఫలితాలు విడుదలైన వెంటనే అధికారిక వెబ్ సైట్ ద్వారా ఫలితాలను చెక్ చేసుకోవచ్చు.

## అగ్నివీరుల రిటైర్మెంట్ వయస్సు 65 ఏళ్లకు పెంచండి

### పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ

బుర్ద్వాన్,జూన్27: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'అగ్నిపథ్' పథకం కింద నియామకమయ్యే సైనికుల సర్వీసు నాలుగేళ్లయితే ఆ తర్వాత వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆందోళన వ్యక్తంచేశారు. ఆ సైనికుల రిటైర్మెంట్ వయస్సును 65ఏళ్లకు పెంచాలని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే భాజపా సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఈ కొత్త రిక్రూట్‌మెంట్ స్కీమ్‌ను తీసుకొచ్చిందని దీదీ ఆరోపించారు. భాజపాలా కాకుండా మరిన్ని ఎక్కువ ఉద్యోగాలు కల్పించడమే తన నినాదమని తెలిపారు. సోమవారం బుర్ద్వాన్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన దీదీ..కేంద్రం నాలుగు మాసాలు శిక్షణ ఇచ్చి.. నాలుగేళ్ల పాటు ఉద్యోగానికి తీసుకుంటే మరి ఆ తర్వాత సైనికులంతా ఏం చేయాలని ప్రశ్నించారు. వారి భవిష్యత్తు మాటేంటని ప్రశ్నించారు. నాలుగేళ్లకే సర్వీసు పూర్తయి బయటకు వచ్చాక వారి భవిష్యత్తులో అనిశ్చితి నెలకొంటుందన్నారు. అందువల్ల కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకంలో భాగంగా నియమించుకొనే అగ్నివీరుల ఉద్యోగ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు.



# నిలదీద్దాం

మొదటిపేజీ తరువాయి..

చీకటి మయం చేస్తున్నారని మండిపడ్డారు. యువకులు నాలుగేండ్లు ఆర్మీలో పనిచేసి నిరుద్యోగిగా బయటకు వస్తే వాళ్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని.. ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా చట్టాలు తీసుకొచ్చి యువత భవిష్యత్తు



ప్రశ్నార్థకంగా మార్చాయని ఆరోపించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో శాంతియుతంగా నిరసన తెలపడానికి వచ్చిన యువకులపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు.

# రాకేశ్ కుటుంబానికి 25లక్షల సాయం

### కుటుంబంలో ఒకరికి ఉద్యోగ భద్రత

### సంస్మరణ సభలో నియామక పత్రాలు అందించిన ఎర్రబెల్లి

వరంగల్,జూన్27: దేశం కోసం రాకేశ్ అంకితమయ్యాడని, రాకేశ్‌ఆత్మ బలిదానం వృథా కాదని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.సైనికులలో చేరాలనే కాంక్షతో దేశ భక్తికి స్ఫూర్తిగా నిలిచాడని కొనియాడారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం, దబ్బీర్ పేట గ్రామంలో రాకేశ్ సంస్మరణ సభ సోమవారం జరిగింది. ఈ సభలో రాకేశ్ కుటుంబానికి సీఎం కేసిఆర్ ప్రకటించిన 25 లక్షల ఎక్స్ గ్రేషియా, వారి



కుటుంబంలో ఒకరికి ఉద్యోగం నియామక పత్రాలను మంత్రి ఎర్రబెల్లి రాకేశ్ కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈసందర్భంగామంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ ఇంత జరిగినా రాకేశ్ కుటుంబాన్ని కేంద్రం ఆదు కోలేదని,సీఎం కేసిఆర్ మానవతా దృక్పథంతో ఆదుకున్నారని అన్నారు. వాళ్ళ ఇంటిలో ఒకరికి రెవెన్యూ విభాగంలో వారి విద్యార్హత ను బట్టి ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగం ఇచ్చారని చెప్పారు. మూలపోడు చేసుకుని బతికే గ్రామం నుంచి దేశ రక్షణకు వెళ్ళాలని అనుకున్న రాకేశ్ గొప్పతనం అందరికీ ఆదర్శమని అన్నారు.రాకేశ్ ఆత్మ శాంతించాలంటే వెంటనే అగ్నిపథ్ ను వెనక్కి తీసుకోవాలని మంత్రి ఎర్రబెల్లి డిమాండ్ చేశారు.తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని,మన సీఎం కేసిఆర్ తరహాలో దేశ వ్యాప్తంగా చనిపోయిన రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా దబ్బీర్ పేట గ్రామాన్ని నేను దత్తత తీసుకుంటున్నట్టు మంత్రి ఎర్రబెల్లి ప్రకటించారు. గ్రామ అభివృద్ధి నా బాధ్యత అని, దబ్బీర్ పేట లో వివిధ అభివృద్ధి పనులకు 50 లక్షలు మంజూరు చేస్తున్న తెలిపారు.కేవ్ లా తండాకు 20 లక్షలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు.దళిత బంధు, ఇండ్లు వంటి ఏ పథకాలు వచ్చినా దబ్బీర్ పేట కు అధిక ప్రాధాన్యం ఇస్తానని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే, వరంగల్ జిల్లా టీఆరెఎస్ అధ్యక్షుడు ఆరూరి రమేశ్, జిల్లా కలెక్టర్ గోపి, ఆర్డీఓ, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ సర్పంచ్, రాకేశ్ కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## సర్పంచ్ లైంగిక వేధింపుల నుండి రక్షించండి

### ప్రజావాణిలో మహిళ పిర్యాదు

**జనగామ జూన్ 25 (ప్రజామంటలు):** మానసికంగా, లైంగికంగా వేధిస్తున్న సర్పంచ్ తాటికొండ సురేష్ కుమార్, ఈ.ఓ. సత్యనారాయణ ఇరువురు కలిసి 2 లక్షలు డిమాండ్ చేశారని హెచ్.ఆర్.సి. లో స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రానికి చెందిన జంగిటి విజయలక్ష్మి ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ వేధింపులు ఆగడం లేదని, ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో 5 సంవత్సరాల క్రితం కట్టుకున్న ఇంటిని కూల్చేందుకు సర్పంచ్, ఈ.ఓ. కుట్ర చేస్తున్నారని, ఈ విషయం ప్రజావాణిలో సోమవారం కలెక్టర్ కు బాధితురాలు జంగిటి విజయలక్ష్మీ ఫిర్యాదు చేశారు.

## అధిక వడ్డీలు వసూలు చేసిన భార్యాభర్తల అరెస్ట్

**కథలాపూర్ జూన్ 25 (ప్రజామంటలు):** మండలం లోని తాండ్రియాల గ్రామానికి చెందిన మామిడిపల్లి తిరుపతి, భార్య రమ వీరిద్దరూ ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకుని 10 శాతం నుంచి 30 శాతం అధిక వడ్డీ లకు అప్పులు ఇచ్చి, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న భార్యా భర్తలను అరెస్టు చేసినట్లు కోరుట్ల సి.ఐ. రాజశేఖర్ రాజు తెలిపారు. సోమవారం కోరుట్ల సి.ఐ. కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.... అనుమతులు లేకుండా అధిక వడ్డీలకు ఇవ్వటం నేరమని అన్నారు. నిందితుల వద్ద నుండి 15 తులాల బంగారం, సుమారు 10 లక్షల రూపాయల నగదు, ప్రాంసరి నోట్లు, బాండ్ పేపర్లు, బ్యాంక్ చెక్కులు, పాసు బుక్కులు స్వాధీనం చేసుకున్నారు.



## మోడి బహిరంగ సభను జయప్రదం చేయాలి

**రఘునాథపల్లి జూన్ 27 (ప్రజామంటలు):** జూలై 3న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో భారత ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా పాల్గొననున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్, బిజెపి మహిళ మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె. గీత మూర్తి, జోనల్ ఇంఛార్జి శివరాజ్ యాదవ్, బిజెపి రాష్ట్ర నాయకులు మాదాసు వెంకటేష్ అన్నారు. సోమవారం రఘునాథపల్లి మండల కేంద్రంలోనీ ఆర్య వైశ్య భవనంలోమండల పార్టీ అధ్యక్షులు



వల్లాల వెంకటేష్ అధ్యక్షతన జరిగిన మండల పరిధిలోని బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంఛార్జిల సమావేశంలో పలు సలహాలు సూచనలు చేశారు.

## దళితుల సంక్షేమానికి దళిత బందు

**రఘునాథపల్లి 27 (ప్రజామంటలు):** దళితులు సంక్షేమానికి దళిత బందు పథకం టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. దళిత బంధు పథకం ద్వారా మండల తెరాస ప్రధాన కార్యదర్శి మున్సిపల్ విజయ్ ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్ ప్రారంభోత్సవం చేసి మాట్లాడారు.



## ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ మెట్‌పల్లి వారి ఆధ్వర్యంలో నోట్ బుక్‌ల పంపిణీ

**ఇబ్రహీంపట్నం జూన్ 27 (ప్రజా మంటలు):** మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వర్ష కొండ లో చదువుతున్న 25 పేద ,అనాథ విద్యార్థులకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ మెట్ పల్లి వారి ఆధ్వర్యం లో, ఈ విద్యా సంవత్సరం లో సరి పడే నోట్ బుక్ లు, పెన్నులను ఫౌండేషన్ చైర్మన్ సురిగి శ్రీనివాస్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.... చదువు మాత్రమే




మనిషిని చీకటి నుండి వెలుగు వైపు నడిపిస్తుంది అని నమ్మిన ట్రస్ట్ సభ్యులు ఈ విధంగా పేద విద్యార్థులకు ఆర్థిక భారం కాకుండా ఉండేందుకు ఉచితంగా నోట్ బుక్ లు ఇవ్వడం గొప్ప విషయం అని తెలుపుతూ ట్రస్ట్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు భగత్ తేజ, మణిదీప్, రామ్ ప్రసాద్, విక్కి లతో పాటు ఉపాధ్యాయులు రాజేందర్, కృష్ణ ప్రసాద్, మురళి, ఇమ్మను ఎల్. మమత, భాగ్యలక్ష్మి, ఇబ్రహీం లు పాల్గొన్నారు.

**రజక బంధు ప్రతి కుటుంబానికి ఇవ్వాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కొలిపాక నరసింహులు సోమవారం స్థానిక ఎమ్మార్వో వినతిపత్రాన్ని అందజేశారు. పాల్గొన్న ఉల్లెంగుల సత్యనారాయణ, యు. రాజు, యాదగిరి, సాంబరాజు శివయ్య, గాదె రాజు, పద్మ, కర్ణాకర్.**



**జనగామ జిల్లా రఘునాథ్ పల్లి మండలంలోని మేకలగట్టు పరిధి లోని సర్వే నెంబర్ 206 లో 70 ఎకరాల భూమి ఇటీవలే రియల్టర్ల చేతిలో కబ్జాకు గురై తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న 70 ఎకరాల భూమిలో పాలిటెక్నిక్ కళాశాల మరియు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్.ఎఫ్.ఐ. జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలక్టర్‌కు జిల్లాకు కార్యదర్శి ధర్మభిక్షం వినతిపత్రం అందజేత. పాల్గొన్న లవకుమార్, రమేష్.**




# పట్టణ అభివృద్దే ప్రధాన లక్ష్యం

### మునిసిపల్ చైర్ పర్సన్ డా. బోగ శ్రావణి ప్రవీణ్

**జగిత్యాల జూన్ 27 (ప్రజామంటలు):** జూన్-2022 మాసము సర్వసభ్య సమావేశము సోమవారము రోజున జగిత్యాల పురపాలక సంఘం కార్యాలయంలో పురపాలక అధ్యక్షురాలు డా. బోగ శ్రావణి ప్రవీణ్ అధ్యక్షతన జూన్-2022 మాసము కౌన్సిల్



సర్వ సభ్య సమావేశం నిర్వహించడం జరిగినది. సమావేశములో చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణములో చాలా అభివృద్ధి పనులు చేసుకున్నామని గతములో కంటే చాలా అభివృద్ధి పనులు చేసుకున్నామని, అందులో భాగముగా ప్రతి వార్డుకు నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని, అలాగే తెలంగాణా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని పట్టణ ప్రగతిలో భాగముగా పట్టణములో చాలా సమస్యలను గుర్తించి పరిష్కరించమని, సీజనల్ కాలము వచ్చిన దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామని మా పాలకవర్గం జగిత్యాల పట్టణం అభివృద్ధి మరియు సంక్షేమం దిశగా కృషి చేస్తున్నామని కావున ప్రజలందరూ సహకరించి పట్టణ అభివృద్ధికి తోడ్పడగలరని కోరినారు.

ఇట్టి సమావేశములో (26) ఎజెండా అంశములను ముఖ్యంగా ప్రతి వార్డుకు అభివృద్ధి పనులు కేటాయిస్తూ మొత్తం 2కోట్ల 49 లక్షలు కేటాయిస్తూ మంజూరు,, పారిశుద్ధ్య పనుల నిమిత్తం కొత్తగా 4 వాహనములు కొనుగోలు చేయుటకు, బక్రీద్ పండుగ ఏర్పాట్లకు, పారిశుద్ధ్య వాహనముల మరమ్మతులకు, కార్మికుల పారిశుద్ధ్య నిర్వహణ అంశములను కౌన్సిల్ యందు ప్రవేశ పెట్టగా సభ్యులు ఆమోదము తెలిపినారని తెలియచేసారు. ఈ సమావేశంలో కమిషనర్ స్వరూపరాణి, కౌన్సిల్ సభ్యులు, కొ-ఆప్షన్ సభ్యులు, డి.ఈ రాజేశ్వర్, జే.ఎ.ఒ. గణేష్, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమంలో తెలంగాణ అగ్రస్థానం : ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**జగిత్యాల జూన్ 27 (ప్రజామంటలు):** జిల్లా మహిళలు, శిశు, దివ్యంగుల మరియు వయో వృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఆర్థిక పునరావాస పథకం కింద ఎంపికైన జగిత్యాల నియోజకవర్గ లబ్దిదారులకు జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో



సబ్సిడీ చెక్కులను పంపిణీ చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఎమ్మెల్యే మాట్లాడుతూ.... రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత దివ్యంగుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగింది అని, మంత్రి కొప్పుల ఈశ్వర్ దివ్యాంగుల శాక మంత్రి గా ఉండడం వల్ల అనేక విధాలుగా జిల్లా ప్రజలు లబ్ది పొందుతున్నారు అని, మంత్రి కెటిఆర్, కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్సీ కవిత చొరవతో జిల్లా కు అధిక సంఖ్యలో, త్రీ వీలర్ స్కూటర్, కవితక్క సహకారంతో బ్యాటరీ ట్రై సైకిల్ మంజూరు చేశామని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరాలనే లక్ష్యంగా క్యాలండర్, పుస్తకాలు ముద్రణ చేపట్టడం జరిగింది అని, టిఆర్ నగర్ వృద్ధ ఆశ్రయం ఏర్పాటు, బాల సదన్ కూడా పూర్తి కావచ్చింది అని, సఖి కేంద్రం ఇలా మహిళల, వృద్ధుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగింది అని, జిల్లాగా ఏర్పడ్డ తర్వాత తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రం, రేడియాలజీ, నర్సింగ్ కాలేజీ, మెడికల్ కాలేజీ ఇలా వైద్య పరంగా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది అని, మహిళల, తల్లి, పిల్లల రక్షణకోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, దివ్యంగులను సకలంగులకు వివాహం చేసుకుంటే ప్రోత్సహకంగా లక్ష రూపాయలు అందజేస్తున్నమని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 500 పెన్షన్ ఉంటే రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ముఖ్యమంత్రి 3016/- చేశారని,బడ్జెట్ లో సైతం అధిక నిధులు కేటాయించిన ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా దివ్యాంగుల పక్షాన ధన్యవాదాలు అని, అభివృద్ధి, సంక్షేమం రాష్ట్రంలోనే అగ్ర భాగాన తెలంగాణ ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిస్ డబ్ల్యూ ఓ డా. నరేష్, ఎంపీపీ లు రాజేంద్ర ప్రసాద్, సంధ్యారాణి సురేందర్ నాయక్, రైతుబంధు మండల కన్వీనర్ నక్కల రవీందర్ రెడ్డి, జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు దొంతి నాగరాజు, సర్పంచులు సుధాకర్, సత్తమ్మ గంగారాం, సింగం అరుణ అంజన్న, స్వప్న వెంకటేశ్వర్ రెడ్డి, యేసు దాసు, కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డి, ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు బాలే శంకర్, రౌత్ గంగాధర్, చిర్ర నరేష్, అంజన్న,తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ భావజాల వ్యాప్తికి అలుపెరగని సైనికుడు

# యువ కవి కన్నారపు శివశంకర్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సౌదం బోధించు, సమీకరించు, పోరాడు అనే నినాదంతో భావజాల వ్యాప్తిని తమ భుజస్కందాలపై వేసుకుని అలుపెరగని సైనికుడిగా విస్తృతంగా ప్రచారం చేస్తూ ఒకవైపు, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధి, సారధి పత్రికలు. నిత్యం ప్రజా సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ప్రధాన భూమిక పోషిస్తూ, కత్తి మీద సాము లాంటి జర్నలిజం వృత్తిని కొనసాగిస్తూ అక్షర సైనికుడుగా మరో వైపు, కదిలేది కదిలించేది పెనునిద్దుర వదిలించే సాహిత్య సామ్రాజ్యంలో కవిత్వాన్ని ఒక ఆయుధంగా మలుచుకుని సమాజ చైతన్యం కోసం ఆరాటపడుతున్న కలం యోధుడు యువకవి, దళిత యువరత్న, అంబేద్కర్ సేవా పురస్కారం గ్రహీత కన్నారపు శివశంకర్. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోమల్ల గ్రామానికి చెందిన కీ.శే. కన్నారపు ఎల్లమ్మ ఎల్లయ్య దంపతుల చిన్నకుమారుడు శివశంకర్. అంబేద్కర్ నగర్, జనగామలో పుట్టి పెరిగిన శివశంకర్ బీఎస్సీ, బీఎడ్, ఎంఏ. విద్యాభ్యాసం పూర్తి చేశారు. గతంలో సాక్షి టీవీ రిపోర్టర్, వి6 న్యూస్ ట్రైనీ సబ్ ఎడిటర్, రిపోర్టర్ పని చేసిన శివశంకర్ ప్రస్తుతం తెలంగాణ ఆత్మగౌరవ పత్రిక 'నమస్తే తెలంగాణ' రిపోర్టర్ గా పత్రికారంగంలో కొనసాగుతున్నారు. ప్రవృత్తి గా సీనియర్ అంబేద్కరీయుడు జే బీ రాజు స్థాపించిన తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం జనగామ జిల్లా అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహిస్తూ 'అంబేద్కర్ ఆలోచన విధానాన్ని' ప్రచారం చేయడంలో ముందు వరుసలో ఉన్నారు. వ్యక్తిత్వ వికాసం, సమాజ చైతన్యంతో భావితరాలను మేల్కొలిపే పుస్తకాలు చదువుతూ మార్పు కొరకు సాహిత్యరంగంలో కవితలు రాస్తున్నారు. ఈ రంగంలో తనకంటూ ప్రత్యేకమైన ఒరవడి సృష్టించుకున్నారు. సంగీతంతో పాటు మనసుని తేలికపర్చే పాత తరం మధుర గీతాలు వినే చక్కని ఆసక్తి కలిగిన ఉన్న శివశంకర్ ఎన్నో అవార్డులు అందుకున్నారు. హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే 'దళిత యువ రత్న 2019' అవార్డును కన్నారపు శివశంకర్ కు సామాజిక తత్వవేత్త, బి.ఎస్. రాములు, రిటైర్డ్ ఐఏఎస్ రామ్ లక్మణ్ అందజేశారు. హైదరాబాద్ స్నేహ టీవీ కార్యాలయంలో ప్రతిష్ఠాత్మక 'అంబేద్కర్ సేవా 2020 పురస్కారం' కన్నారపు శివశంకర్ కు చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, స్నేహ గ్రూప్ ఆఫ్ చైర్మన్ డాక్టర్ కే. శివభాగ్యరావు అందజేశారు. 1వ వార్డు అంబేద్కర్ నగర్ అభివృద్ధి సంక్షేమ కమిటీ అధ్యక్షుడుగా వార్డు అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. వార్డు ప్రజలందర్నీ కుల, మతాలకు అతీతంగా ఏకం చేసిన శివశంకర్ అంబేద్కర్ యువజన సంఘంలో 1999 నుండి సాధారణ కార్యకర్త స్థాయి నుండి మొదలైన ప్రస్థానం జనగామ జిల్లా కో కన్వీనర్, జిల్లా అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టారు. సంఘంలో, సమాజంలో క్రమశిక్షణ గల కార్యకర్తగా, వ్యక్తిగా గుర్తింపు పొందడమే గొప్ప సంతృప్తినిస్తుందని శివశంకర్ భావిస్తారు. తప్పు చేసే వారు ఎంతటివారైనా వారిని ప్రశ్నించే తత్వం, నమ్ముకున్న తోటివారి ఎదుగుదలకు కష్టపడే తత్వం రెండూ ఇష్టమేనని శివశంకర్ అంటారు. శివశంకర్ 9వ తరగతి చదువుతున్న వేళలో తన శ్రద్ధాశక్తులు గమనించి తొలిసారి కవితలు రాయడంలో ఓనమాలు నేర్పిన గురువు ఒకప్పటి జనగామ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి. నర్సింహ్ 'గురుకుల బాల' అనే పాఠశాల ఎడిషన్ లో 'విద్యార్థి మేలుకో' అనే కవిత ద్వారా తొలిసారి శివశంకర్ కు సాహిత్య రంగంలో ప్రవేశం కల్పించారు. ఇంగ్లీష్ లెక్చరర్ డీ.పీ. కాళిదాస్, జి. కాళహస్తీ, తొడబుట్టిన అన్నలు కన్నారపు పరశురాములు, కన్నారపు ఉపేందర్, కృష్ణవాసు, ఇంటర్ లో ఏబీవీ జూనియర్ కళాశాల జువాలజి లెక్చరర్ నిమ్మ జయపాల్ రెడ్డి, బోటనీ లెక్చరర్ కనకరాజు, డిగ్రీలో విద్యాజ్యోతి కళాశాల సంస్కృతం అధ్యాపకుడు వేదాంతచారి, పన్నీరు రమేశ్, కళావతి దంపతులు, కోడం కుమారస్వామి, తిరుమల నర్సింహాచార్యులు, ఎర్రోజు శ్రీనివాస్, పానుగంటి రామమూర్తి, పీడీ వెన్నమల్ల జగదీశ్, డాక్టర్ సీహెచ్ రాజమౌళి, డాక్టర్ సుగుణాకర్ రాజు, చారబుడ్ల సురేందర్ రెడ్డి, రిటైర్డ్ డీఈ బొల్లపల్లి వెంకటస్వామి, ఎన్ హెచ్ డీఈ బొల్లపల్లి కుమారస్వామి, కొమ్ముల సురేందర్, సీహెచ్




అవిలయ్య, భట్టి చెన్నయ్య, మిద్దెపాక ఎల్లయ్య లాంటి కవులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, మేధావులు శివశంకర్ ఎదుగుదలకు ప్రోత్సాహం అందించిన వారిలో ఉన్నారు. అంబేద్కర్ ఆలోచన విధానం వ్యాప్తిలో భాగంగా అనేక ప్రాంతాల్లో జరిగిన పలు సెమినార్లలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగాలు చేశారు.

పలువురిని ఆలోచింపజేసే ప్రసంగాలతో శివశంకర్ మంచి వక్త కూడా గుర్తింపు పొందారు. భారత ప్రభుత్వ 'ఆజాదికా అమృత్ మహోత్సవం'లో భాగంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో శివశంకర్ చిరు సన్మానం పొందారు. స్టేషన్ ఘన్ పూర్ విద్యాజ్యోతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో కాలేజ్ డే సందర్భంగా నిర్వహించిన కవితల పోటీల్లో కళాశాల ప్రథమ బహుమతిని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సెలర్ వి. గోపాల్ రెడ్డి చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ కమ్ డైరెక్టర్ వై పాపిరెడ్డి సమక్షంలో అందుకున్నారు. మహనీయులు బాబు జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వరుస జయంతి ఉత్సవాల నేపథ్యంలో అంబేద్కర్ యువజన సంఘం జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'బొల్లపల్లి పెద్దొల్ల పర్షయ్య ఫౌండేషన్', 'సాధిక్ అలీ ఫౌండేషన్' సహకారంతో "బహుజన కవిత్వం" ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయకవి బృందంతో కలిసి సన్మానం పొందారు. అదే వేదికలా పాల్గొన్న కవులకు అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. జనగామ రచయితల సంఘం కార్యవర్గ సభ్యులుగా కూడా కొనసాగుతున్నారు. అంబేద్కర్ విధానం దేశానికి ప్రజలకు ఎంతో అవసరమని మహానుభావుడి ఆశయసాధన కోసం చేస్తున్న కృషి ఫలించాలని ఆశిద్దాం....

**గుడికందుల కృష్ణ**
**ప్రజామంటలు రిపోర్టర్,**
**జనగామ, 9440973305**



## ధర్మపురి అంబేద్కర్ చౌక్ వద్ద కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్ష

**ధర్మపురి జూన్ 27 (ప్రజా మంటలు):** ధర్మపురి అంబేద్కర్ చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీశాంతియుత సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. అగ్నిపత్ దీక్ష కోఆర్డినేటర్ ధర్మపురి నియోజకవర్గ పిసిసి రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ అగ్నిపత్ గురించి మాట్లాడుతూ, ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అగ్నిపథ్ పథకం, సాయుధ బలగాల పూర్వ సంప్రదాయాలు మరియు సైన్యంలో కాంట్రాక్ట్ పద్ధతిని నైతికతలను తారుమారు చేస్తూ, వారి మనోధైర్యాన్ని దెబ్బ తెస్తూ దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆగ్రహానికి మరియు నిరసనలకు దారితీసిందని, ఈ అనాలోచిత పథకం వల్ల సాయుధ దళాలలో చేరాలని కలలు కంటున యువకులకు తీవ్రమైన ఆగ్రహం తెప్పించిందని విమర్శించారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ధర్మపురి నియోజక వర్గ ఇంచార్జ్ అడ్లూరి లక్ష్మణ కుమార్ తో పాటు పలువురు నియోజక వర్గ, జిల్లా కాంగ్రెస్ నాయకులు,మండలంకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు పట్టణ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్య కర్తలు, అభిమానులు ఇట్టి సత్యాగ్రహదీక్ష పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆకుల పెంటయ్య ఆశయాలతో పోరాట పటిమను పెంచుకుందాం

### ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు సి.హెచ్. రాజారెడ్డి

**జనగామ జూన్ 27 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కార్మికోద్యమ నేత, షాప్స్ అండ్ గ్రెయిన్ మార్కెట్ హమాలి యూనియన్ వ్యవస్థాపకుడు ఆకుల పెంటయ్య ఆశయాలతో కార్మికులు పోరాట పటిమను పెంచుకోవాలని ఏఐటీయూసీ జనగామ జిల్లా గౌరవాధ్యక్షులు సి. హెచ్. రాజారెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం జనగామలోని ఆకుల పెంటయ్య



స్మారకభవన్ లో హమాలి యూనియన్ సీనియర్ నాయకులు కొర్నెపాక వెంకట నర్సయ్య అధ్యక్షతన జరిగిన ఆకులపెంటయ్య 10వ వర్ధంతి సభలో రాజారెడ్డి మాట్లాడుతూ జనగామలో హమాలి సంఘమును మొదటగా 1975 లో స్థాపించిన వ్యవస్థాపకులు, స్వాతంత్ర్య పోరాట యోధుడు, జనగామ మున్సిపల్ మాజీ వైఎస్ చైర్మన్, సీనియర్ కమ్యూనిస్టు నాయకులు ఆకుల పెంటయ్య నడిపిన కార్మికోద్యమాలు పోరాట తెగువ, నేటి కార్మికులకు మార్గ దర్శకమని అన్నారు. 1975లో జనగామలో స్థాపించిన షాప్స్ అండ్ గ్రెయిన్ మార్కెట్ హమాలి యూనియన్ నేటికి రాష్ట్రంలో ఒక మోడల్ గా నడుస్తున్నదని కొనియాడారు. దేశములో మోడీ కార్మికుల మెడపై కత్తి పెట్టారని, ఈ తరుణంలో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెంటయ్య కుమారులు జనగామ రచయితల సంఘం (జరసం) ప్రధాన కార్యదర్శి ఆకుల వేణుగోపాల్ రావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, మోటే శ్రీశైలం, చొప్పరి సోమయ్య, యాకుబ్,దాయ నగేష్, జాయ యాదగిరి, బుమల్ల ఐలయ్య, కె. చంద్రయ్య, తిప్పరబోయిన రాజు, సిద్ధులు పాల్గొన్నారు.

## ప్రదాని మోడీ పర్యటనలో హస్త కళాకృతుల ప్రదర్శనలో పెంబర్తి హస్త కళాకారుడు సోమనర్సింహాచారి కళాఖండం ఎంపిక

**జనగామ జూన్ 25 (ప్రజామంటలు):** ప్రధాన మంత్రి మోడీ హైదరాబాద్ రానున్న నేపథ్యంలో తెలంగాణలో తయారుచేసే అన్ని హస్త కళల చేతి వృత్తుల కళాకృతులను ఒక్కో కళ నుండి ఒక్కో కళాఖండాన్ని తిలకించే ప్రదర్శనలో జనగామ జిల్లా పెంబర్తి హస్తకళ విభాగం నుండి ప్రముఖ హస్తకళాకారుడు అయిలా సోమనర్సింహాచారి రాష్ట్ర అవార్డు పొందిన కళాకృతిని ఎంపికైంది. ఈ విషయం సోమనర్సింహచారి జనగామ సోమవారం తెలిపారు. ప్రముఖ చరిత్ర పరిశోధకులు అరవింద్ ఆర్య ఈ ప్రదర్శనను పర్యవేక్షిస్తూ కళాఖండాలను సేకరిస్తున్నారు. తమ కళాకృతిని ఎంపిక చేసిన నిర్వాహకులకు సోమనర్సింహచారి కృతజ్ఞతలు తెలిపారు.



## కారోబార్ నర్సింహులు కుటుంబానికి ఆదుకోవాలి

**జనగామ జూన్ 27 (ప్రజామంటలు):** సీతారాంపురం కారోబార్ నర్సింహులు కుటుంబానికి ప్రభుత్వం కుటుంబానికి ప్రభుత్వం 5 లక్షల ఎక్స్ గ్రేషియా అందజేసి ఆదుకోవాలని సిఐటియు జిల్లా



ప్రధానకార్యదర్శి రాపర్తి రాజు అన్నారు. సోమవారం జనగామ దేవరుప్పుల మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన కారోబార్ మాటూరి నరసింహులు చనిపోవడం బాధాకరమని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సమస్యల రీత్యానే మానసికంగా ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారని, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నియోజవర్గానికి చెందిన కారోబార్ నరసింహులు కుటుంబాన్ని ఆదుకునేందుకు మంత్రి ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్యాల సోమన్న, జిల్లా నాయకులు కొడెపాక యాకయ్య పాల్గొన్నారు.

# విపక్షాలు గుణపాఠం నేర్చుకోవాలి !

ఉపఎన్నికల ఫలితాల్లో భాజపా విజయఢంకా మోగించింది. రాష్ట్రపతి ఎన్నికలకు ముందు విపక్షాలకు ఇదో గట్టి దెబ్బగానే భావించాలి. ముఖ్యంగా యూపిలో సమాజ్‌వాదికి, పంజాబ్‌లో ఆప్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. ముఖ్యంగా యూపిలో రెండు ఎంపి సీట్లు గెల్చుకోవడం అన్నది పెద్ద విజయంగానే చూడాలి. ఈ రెండు సీట్లు కూడా సమాజ్‌వాదీకి చెందినవే. అంతులో ఒకటి మాజీ సిఎం అఖిలేశ్ రాజీనామా చేసిన ఆజంఘడ్ ఉంది. ఇదో రకంగా సమాజ్‌వాదీ పట్ల ఉన్న వ్యతిరేకత బయటపడిందినే చెప్పాలి. అలాగే ఆప్‌కు కూడా పంజాబ్‌లో అధికారం దక్కించుకున్న కొంతకాలనికే ఎదురుదెబ్బ తగిలింది. అక్కడ ప్రస్తు సిఎం మాన్ వదిలిన లోక్‌సభలో ఓటమిచవి చూసింది. ఇదంతా కూడా ప్రజల ఆలోచనా ధోరణిలో వస్తున్న మార్పులకు నిదర్శనంగా చూడాలి. ప్రజలు కూడా విపక్షాల తీరుపై అసంతృప్తిగా ఉన్నారని అనుకోవాలి.

రాష్ట్రపతి ఎన్నికల్లో ఐక్యత చాటలేక పోయిన విపక్షాలు తమ అభ్యర్థిగా మాజీ బిజెపి నేత, మాజీ కేంద్ర మంత్రి యశ్వంత్ సిన్హాను బరిలోకి దింపింది. ఎన్‌డిఎ ఓ గిరిజన మహిళ ద్రౌపది ముర్మును బరిలోకి దింపినా పోటీనుంచి తప్పుకోవడానికి విపక్షాలు సిద్ధంగా లేవని కూడా తేలిపోయింది. యశ్వంత్ సిన్హా సోమవారం తన నామినేషన్ సమర్పించడంతో ఇక పోటీ అనివార్యమని తేలిపోయింది. అయితే ఉప ఎన్నికల ఫలితాలతో విపక్షాల్లో కనువిప్పు కలగడం లేదని కూడా అర్థం అవుతోంది. మరోవైపు మహారాష్ట్ర లో శివసేన పుట్టి మునుగుతోంది. శివసేన ప్రభుత్వం కూలడం ఖాయంగా కనిపిస్తోంది. సిద్ధాంతాలను పక్కన పెట్టి కాంగ్రెస్, ఎన్సీపిలతో పొత్తు పెట్టుకోవడం దారుణం కాక మరోటికాదు. ఇదిఆ పార్టీ మూలసిద్ధాంతాలనే ప్రశ్నించేలా తయారయ్యింది. దీంతో తిరుగుబాటు తప్పలేదు. ఇకపోతే దేశవ్యాప్తంగా ఉపఎన్నికల ఫలితాల్లో భాజపా సత్తా చాటింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో విపక్ష సమాజ్‌వాదీ పార్టీ కంచుకోటలను బద్దలు కొట్టింది. ఎస్పీ సీనియర్ నేత ఆజంఖాన్‌కు అడ్డా అయిన రాంపుర్ పార్లమెంట్ స్థానంలో పాగా వేసింది. మరో పార్లమెంటు స్థానం ఆజంగఢ్‌లోనూ విజయబావుటా ఎగురవేసింది. మరోవైపు ఆప్.. దిల్లీలోని రాజిందర్ నగర్ స్థానాన్ని గెలుచుకోగా, పంజాబ్‌లో చతికిలపడింది. జూన్ 23న జరిగిన ఉపఎన్నికల ఫలితాలు తాజాగా వెలువడ్డాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న అధికార భాజపా... సమాజ్ వాదీ పార్టీని గట్టి దెబ్బ కొట్టింది. ఎస్పీ సిట్టింగ్ స్థానమైన రాంపుర్ లోక్‌సభ స్థానంలో భాజపా జయకేతనం ఎగురవేసింది. ఎస్పీ నేత ఆజంఖాన్ రాజీనామాతో రాంపుర్ స్థానం ఖాళీ కాగా ఉపఎన్నికలో భాజపా అభ్యర్థి ఘన్ శ్యామ్ లోధి సుమారు 42వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రామ్‌పుర్ పార్లమెంటు పరిధిలో మొత్తం 18.38 లక్షల మంది ఓటర్లు ఉండగా.. అందులో 60శాతం మంది ముస్లిం, మైనారిటీలే ఉన్నారు. దీంతో ఆ స్థానం ఆజంఖాన్‌కు కంచుకోటగా మారింది. అయితే ఆ కంచుకోటను బద్దలుకొట్టిన యోగి ఆదిత్యనాథ్ సర్కార్ ఆ ప్రాంతంలోనూ భాజపాను తిరుగులేని శక్తిగా నిలబెట్టింది. మరోవైపు, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ రాజీనామాతో ఖాళీ అయిన ఆజంగఢ్ లోక్‌సభ స్థానంలోనూ భాజపా విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి దినేశ్ లాల్ యాదవ్ 8679 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఇకపోతే తాజా ఉపఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పంజాబ్‌లో అధికార పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. సంగ్రూర్ లోక్‌సభ స్థానంలో శిరోమణి అకాలీదళ్ నేత సిమ్రన్ జీత్ మాన్ గెలుపొందారు. ఈ స్థానం నుంచి గెలుపొందిన ఆప్ నేత భగవంత్ మాన్.. పంజాబ్ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సంగ్రూర్ లోక్‌సభ స్థానానికి ఉపఎన్నికలు జరిగాయి.



మరోవైపు, దిల్లీలోని రాజిందర్ నగర్ అసెంబ్లీ స్థానాన్ని ఆప్ నిలబెట్టుకుంది. రాజ్యసభ ఎంపీగా గెలుపొందిన నేపథ్యంలో ఆ స్థానానికి ఆప్ నేత రాఘవ్ చద్దా రాజీనామా చేయగా.. ఎన్నికలు జరిగాయి. ఇందులో ఆప్ ఘన విజయం సాధించింది. అయితే ఇక్కడ బిజెపి పెద్దగా సత్తా చాటలేకపోయింది. త్రిపురలోనూ భాజపా హవా చాటింది. దేశవ్యాప్తంగా ఏడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నిక జరగగా.. వాటిలో నాలుగు స్థానాలు త్రిపురలోనే ఉన్నాయి. తాజా ఫలితాల్లో భాజపా మూడు స్థానాల్లో గెలుపొందింది. మొత్తంగా ఫలితాలు విపక్షాలకు చెంపపెట్టులాంటివి. బిజెపిపై విమర్శలు గుప్పిస్తున్న ఆప్,సమాజ్‌వాదీలకు గట్టి షాక్ ఇచ్చాయి. ఈ క్రమంలో విపక్షాలు తమ ఐక్య చాటేందుకు మరింత ప్రణాళికతో ముందుకు సాగాలి. రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేయడం అన్న ఆలోచన విరమించాలి. పట్టుదలకు పోవడం వల్ల వచ్చే లాభం లేదు. అలాగే బిజెపి గెలుపును విమర్శించడం కూడా సరికాదు. నిజానికి దేశంలో గిరిజనులకు అవకాశాలు రావడం లేదు. వారిని జనజీవన స్రవంతికి దూరంగానే ఉంచుతున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ముర్ముకు మద్దతు తెలిపి ఏకగ్రీవం చేయడం ద్వారా విపక్షనేతలు ఔదార్యం చాటుకోవాలి. ఈ విషయంలో రాజకీయాలు పక్కన పెట్టాలి. ఇకపోతే అన్నివర్గాలకు భారత ప్రజాస్వామ్యంలో అవకాశం వస్తుందని ఆశించడానికి లేదు. ద్రౌపది ముర్ముకు అవకాశం రావడానికి 75 ఏళ్లు పట్టింది. ఈ క్రమంలో గిరిజనులు, ఎస్సీలకు ప్రధానమంత్రి లాంటి ఉన్నత పదవులు దక్కాల్సి ఉంది. ఇందుకోసం రాజకీయాల్లో ఇప్పుడున్న పరిస్థితులు, రాజ్యాంగం మేరకు అవకాశం రాదు. ఎలాగూ అధికార కూటమి నుంచి ఎస్టీ మహిళకు అవకాశం ఇచ్చారు కనుక విపక్షాలు గౌరవప్రదంగా ద్రౌపది ముర్మును రాష్ట్రపతి భవన్‌కు పంపించడానికి సహకరించాలి. అయితే, అత్యున్నత పదవికి అభ్యర్థిగా ఎంపికలో ఆమె సమర్థత కన్నా మహిళ గా, ఆదివాసీగానే గుర్తించి ఇచ్చారు. ఉత్తర, దక్షిణ భారతం నుంచే రాష్ట్రపతులు ఎన్నికవుతూ వస్తున్న క్రమంలో దేశంలో తూర్పు ప్రాంతం నుంచి గిరిజన మహిళను బరిలోకి దింపడం ద్వారా బీజేపీ ఓ మంచి పని చేసిందనే చెప్పాలి. ఈ క్రమంలో విపక్షాలు తాజా ఎన్నికల ఫలితాలతో గగుణపాఠంనేర్చుకుంటే మంచిది.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్.

# స్వార్థానికి పరాకాష్ట

ఆర్థ రాత్రి ఒంటి గంట అయ్యింది. న్యూయార్క్ నగరం హాయిగా మత్తులో నిదురిస్తోంది. ఎయిర్ కండిషనర్ చల్లదనం లో మెత్తటి ఫోం బెడ్ పై దట్టమైన రగ్గు కప్పుకొని భార్య కౌగిల్లో వెచ్చ గా ఆదమరిచి నిద్రిస్తున్నాడు వేణు. ఇంతలో అతని నిద్రకు భంగం కలిగిస్తూ ప్రక్కనే టేబుల్ పై వున్న సెల్ ఫోన్ మోగింది. సాధారణం గా ఈ సమయం లో అతనికి ఎవరూ ఫోన్ చెయ్యరు. అలాంటిది ఫోన్ వచ్చిందంటే ఏదో అర్జంట్ మెసేజ్ అయి వుంటుంది. ఏమై వుంటుందబ్బా అనుకుంటూ ఇంగ్లీషులో ఒక బూతు తిట్టి ఉదుటున లేచి సెల్ అందుకున్నాడు. ఆవతలి వైపు నుండి భాస్కర్ " బావా ! చాలా ఘోరం జరిగిపోయింది. నాన్న మనకు ఇక లేరు" వెక్కుతున్నట్లు స్పష్టం గా వినిపిస్తోంది.

వేణుకు వున్న కాస్త మత్తు కూడా దిగిపోయింది. " ఏమిటి భాస్కర్ నువ్వంటున్నది ?" ఆతృతగా అడిగాడు.

"నిన్న రాత్రి ఊపిరి సరిగ్గా అందక ఆయాసపడ్తుంటే శ్యామా నర్సింగ్ హెూం లో చేర్పించాం. ఆక్సిజన్ పెట్టారు. అయినా పొద్దునకు పరిస్థితి బాగా క్షీణించింది. డాక్టర్లు ఎంత ట్రై చేసినా ప్రాణాలు కాపాడలేకపోయారు. పావు గంట క్రితమే ఆయన వెళ్ళిపోయారు" ఏడుస్తున్నాడు భాస్కర్. వేణూకి దుఃఖం లో నోటి మాట రాలేదు.

" బావా ఇక్కడ నేనొక్కడినే అన్నీ చూసుకోవాలి, నాకు సాయం గా వుండడానికి వెంటనే బయలుదేరి రా!" అభ్యర్థించాడు భాస్కర్.

"ఒకే!, నువ్వేం వర్రీ అవకు. నేను వెంటనే బయలుదేరుతున్నాను. కాని రాజీకి మాత్రం రావడం కుదరదు. ఇప్పుడు ఎయిత్ మంత్ కదా! ఈ స్టేజిలో ట్రావెలింగ్ చాలా ప్రమాదకరం. ఆమెను ఏదో విధం గా మేనేజ్ చెస్తాను, అక్కడ అందరికీ ధైర్యం చెప్పు"అంటూ ఫోన్ పెట్టేసాడు వేణు. భార్యకు నిద్రా భంగం కలుగకుండా నెమ్మదిగా లేచి లివింగ్ రూం లోనికి వెళ్ళి లాప్ టాప్ ఆన్ చెసి ట్రావెలింగ్ సైట్లు వెదికాడు. ఆతని అదృష్టం, ఉదయం ఏడుగంతలకు న్యూయార్క్ %--% ముంబాయి ఫ్లైట్ లో టిక్కట్ దొరికింది. క్రెడిట్ కార్డ్ స్వాప్ చేసి టికెట్ కంఫర్మ్ చెసి ప్రింట్ కూడా తీసి రిలీఫ్ గా ఊపిరి పీల్చుకున్నాడు. ఆఫ్ సీజన్ కావడాన్న టికెట్ట్ సులభం గా దొరికింది లేకపోతే ఎంత ఇబ్బందులు పడాల్సి వచ్చేదొ ? ఆ తర్వాత వెళ్ళి రాజీని నిద్ర లెపిపి జరిగిన సంగతి చెప్పడు. నాన్న పోయారనగానే బావురుమంది రాజి. ఆమెను సముదాయించదం వేణుకి చాలా కష్టం అయ్యింది. కొంతసేపటికి ఆమె నార్మల్ అయ్యింది. ప్రెగ్నెన్సీ కారణం గా వేణూ ఒక్కడే వెళ్ళడానికి సమ్మతించింది. అప్పటికప్పుడే ఆమెకు తోడుగా వుండడానికి న్యూయార్క్ లో సౌత్ ఎవెన్యూ లొ వుండే తన స్నేహితుడు కిరణ్ భార్య కొన్ని రోజులు వుండే ఏర్పాటు కూడా చేసాడు వేణు.

ఫద్దెనిమిది గంటల తర్వాత హైదరాబాద్ చేరుకున్నాడు వేణు. ఆసుపత్రి లో మార్చురీ నుండి అప్పుడే రాఘవరావు గారి పార్థివ శరీరాన్ని తిసుకు వచ్చి వారి స్వంత ఇంటిలో వుంచారు. ఆయన భార్య యశోద శోకదేవతలా వుంది. భాస్కర్ సంగతి చెప్పనవసరం లేదు. చేష్టలుడిగిన వానిలా కూర్చోని వున్నాడు. భాస్కర్ భార్య గీత కాస్త అటూ ఇటూ తిరుగుతూ కావల్సిన ఏర్పాట్లను చూస్తోంది. వేణు పరిస్థితిని గమనించి వెంతనే రంగం లోకి దిగాడు. ఆ ఊళ్ళొ వున్న స్నేహితులను సంప్రదించి గంట లోపే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసాడు. పంతులు గారి నుండి అంబులెన్స్ వరకు అన్నీ సరిగ్గా సమకూరాయి. భాస్కర్ ఆర్థిక పరిస్తితి దృష్ట్యా ఇరవై వేల రూపాయలను చకా చకా ఖర్చు పెట్టేసాడు వేణు.



రాఘవ రావు గారి అంత్య క్రియలు అతి ఘనంగా జరిగాయి. రాఘవ రావు గారు పని చెసి రిటైర్ అయిన కాలేజి మొత్తం వచ్చారు. అందరితో కలుపుగోలుగా వుంటూ నోట్లో నాలుకలా మెలిగే రాఘవరావు గారు తన మొత్తం సర్వీస్ లో అజాత శత్రువు అనే బిరుదును సంపాదించారు. ఎవరినైనా నొప్పించే విధం గా ఒక్క మాట కూడా మాట్లాడి వుండరు. అటువంటి మంచి మనిషికి అందరూ అశ్రు తర్పణాలతో వీడ్కోలు పలికారు. ఆ తర్వాత దశ దిన కార్యక్రమం కుడా ఘనం గా జరిగింది. వేణు స్నేహితుల సాయం తో ఆ కార్యక్రమం ఏ లోటూ రాకుండా జరిపించాడు.

ఆ ఇంట్లో అంతా సర్దుకున్నాక అత్తగారిని తనతో తిసుకువెళ్ళే ప్రపోజల్ పెట్టాడు వేణు. " బావా నాన్న లేరు, ఇంక అమ్మ తప్ప మాకు పెద్ద దిక్కు ఎవరున్నారు ? వున్న దాంట్లో సర్దుకొని అమ్మను మేము జాగ్రత్తగా చూసుకుంటాము, అమ్మను ఇక్కడే వుండనివ్వు" భాస్కర్ అన్నాడు.

'అది కాదు భాస్కర్, అత్తగారికి చేంజ్ ఆఫ్ ప్లేస్ చాలా అవసరం. ఇక్కడే వుంటే మావయ్య గారి స్మృతులు అనుక్షణం వెంటాడుతూ వుంటాయి. అందుకే అక్కడికి తీసుకు వెళ్తాను. వాతావరణం మార్పు వలన ఆవిడ త్వరగా కోలుకునే అవకాశం వుంది " అందరినీ కన్విన్స్ చేసాడు వేణు. రాజీ కూడా ఫోన్ చేసి అన్నయతో, అమ్మతో మాట్లాడి వారిని ఒప్పించింది.

వీసా ఫార్మాలిటీస్ పూర్తి చేయించి, వారం తర్వాత యశొదను తీసుకొని అమెరికాకు తిరిగి బయలుదేరాడు వేణు. రాజీ అమ్మను చూసి ఎంతో పొంగిపోయింది. అపార్ట్ మెంట్ లో అటాచ్డ్ బాత్రూం వున్న గది, ఫోను, టి వి, డివిడి ప్లేయర్ వగైరా సమకూర్చారు.

" నాకెందుకు తల్లీ ఈ హడావిడీ అం తా ?" అడిగింది యశోద.

" అదేమిటండీ అలా అంటారు ? ఇక్కడ వున్నంత కాలం ఫ్రీ గా వుండండి పైగా మీకు ఏ లోటు రానివనని భాస్కర్ వాళ్ళకి మాటిచ్చాను కూడా " వినయం గా అన్నాడు వేణు.

రాజీకి ఎంతో సంతోషంగా అనిపించింది. అమెరికా వచ్చిన నాలుగేళ్ళలో అమ్మను ఎంతో మిస్ అయ్యింది. ఇక కొన్నాళ్ళ పాటు అమ్మ దగ్గర హాయిగా వుండవచ్చు అనుకొని ఆనందించింది. అమ్మను తన స్వంత తల్లి కంటే ఎక్కువగా ప్రేమించే వేణు లాంటి భర్త దొరకడం నిజంగా తన అదృష్టం గా భావించింది.

ఇంతలో కిరణ్ నుండి ఫోన్ వచ్చింది. వేణు ఎత్తాడు. " ఏమిట్రా నువ్వు చేసిన ఈ వెధవ పని. ఆ ముసలిదానిని నీ దగ్గరకు తెచ్చుకున్నావు. అక్కడ మీ బావ దగ్గర వదిలేస్తే పోయేదిగా ?" అన్నాడు కిరణ్ చికాకుగా.

"ఒరేయ్ కిరణ్. నన్నెంత తక్కువగా అంచనా వేసావురా ? నేనేమైనా తెలివి తక్కువ వాడిననుకున్నావా ? ప్రతీ పనిలో లాభ నష్టాలు బేరీజు వేస్తే గాని ఏ పని చెయ్యను నేను. ఇప్పుడు రాజీకి ఎనిమిదో నెల. ఆరోగ్యం అంతంత మాత్రం గా వుంది. కంప్లీట్ బెడ్ రెస్ట్ కావాలని డాక్టర్లు చెప్పారు. డెలివరీ అయిన తర్వాత తల్లినీ, పిల్లనీ కొంత కాలం కంటికి రెప్పలా చూసుకోవాలి. నా వల్ల ఇదంతా జరిగే పనేనా ? ఇక్కడేమో రోజుకు ఇరవై డాలర్లు ఇస్తామన్నా కూడా నమ్మకమైన పని మనుషులు దొరకరు. అందుకే ఆవిడను వెంటబెట్టుకు వచ్చాను. ఈ ఆడాళ్ళందరూ సెంటిమెంటల్ ఫూల్స్. కాస్త ప్రేమ నటిస్తే తక్కున వలలో పడిపోతారు. ఒక రెండు సంవత్సరాలపాటు వేళ కింత అన్నం పడేస్తే చాలు ఇంట్లో పనం తా చేస్తూ కుక్కలా పడుంటుంది ఆ ముసలిది. ఇక నాకేం చీకూ చింతా లేదు. నౌ ఐకెన్ కాన్సంట్రేట్ ఆన్ మై కెరీర్" విజయగర్వంతో నవ్వుతూ చెప్పాడు వేణు.

" వేణూ ! యు ఆర్ రియల్లీ గ్రేట్. నీలాంటి ఇంటెలిజెంట్ ఫెలో నాకు ఫ్రెండ్ కావడం నాకెంతో అదృష్టం. నీ నుండి నేను నేర్చుకోవల్సింది చాలా వుంది" మెచ్చుకొలుగా అంటూ డిస్కనెక్ట్ చేసాడు కిరణ్. బెడ్రూంలో ఎక్స్టెన్షన్ నుండి ఇదంతా విన్న రాజీకి కళ్ళు తిరిగినంత పనయింది. భర్త కుత్సిత తత్వాన్ని, మనీ మైండెడ్ నెస్ అర్థం అయ్యాక నవ నాడులు కృంగి బెడ్ పై కుప్పకూలిపోయింది.

జరిగే తంతు తెలియక పాపం యశోదమ్మ తన గదిలో లవకుశ సినిమా ఒ టి టి లో చూస్తూ ఆనందిస్తోంది.

– సి హెచ్ ప్రతాప్,
హైదరాబాద్.

# "రాజకీయ దురంధరుడు పాములపర్తి"

పి.వి. జయంతి సందర్భంగా..

సమకాలీన రాజకీయ పరిస్థితులను అవగాహన చేసుకొని తదనుగుణంగా సానుకూల వాతావరణం ఏర్పరచుకుని పరిపాలన సాగించిన వాడే సమర్థుడైన నాయకుడు కాగలడు అనేది అర్థశాస్త్ర రచయిత అయిన కౌటిల్యుడిగా పేరున్న చాణక్యుని అభిప్రాయం. ఆ అభిప్రాయాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకొని, తదనుగుణంగా నడుచుకొని బలం, బలగం లేకున్నా, దేశ రాజకీయాలపై చెరగని ముద్ర వేయ గలిగారు పి.వి. నరసింహారావు. దక్షిణ భారతావని నుండి ప్రధానమంత్రి పదవిని అధిష్టించిన తొలి నేతగా, ఒకే ఒక తెలుగువానిగా, నరసింహారావు కార్యదీక్షత, దార్శనికత ద్వారా ఖ్యాతి గడించారు. "పి.వి"గా లబ్ద ప్రతిష్టులైన ఆయన బహు భాషావేత్త, రచయిత. స్నాతకోత్తర న్యాయశాస్త్ర కోవిదులు, "అపర చాణక్యుడిగా" పేరొందారు.

ఆంధ్ర ప్రదేశ్ లోని వరంగల్ జిల్లా, నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28 న రుక్మాబాయి, సీతారామారావు దంపతులకు పి.వి జన్మించారు. వరంగల్లు జిల్లాలోనే ప్రాథమిక విద్య మొదలు పెట్టారు. తరువాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మలు ఆయనను దత్తత తీసుకోవడంతో అప్పటినుండీ పాములపర్తి వెంకట నరసింహారావు అయ్యారు. 1938 లోనే హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు పార్టీలో చేరి నిజాము ప్రభుత్వ నిషేధాన్ని ధిక్కరిస్తూ "వందేమాతరం" గేయాన్ని పాడారు. తాను చదువుకుంటున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆయనను బహిష్కరించారు. దాంతో ఓ మిత్రుడి సాయంతో నాగపూరు విశ్వవిద్యాలయంలో చేరి నాగపూరులో ఆ మిత్రుని ఇంట్లోనే ఉంటూ, 1940 నుండి 1944 వరకు ఎల్.ఎల్.బి చదివారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావుల అనుయాయిగా స్వాతంత్ర్యోద్యమం లోను, హైదరాబాదు విముక్తి పోరాటంలోను పాల్గొన్నారు.

1957 లో శాసనసభ్యుడిగా రాజకీయ జీవితం ఆరంభించిన పివి, రాష్ట్ర మంత్రిగా, ముఖ్య మంత్రిగా కేంద్ర మంత్రిగా, చివరకు ప్రధానిగా తన మేధాశక్తితో, క్రమానుగతంగా ఉన్నత పదవులను, కైవసం చేసుకున్న రాజనీతిజ్ఞులు ఆయన. కాంగ్రెస్ హయాంలో, పూర్తి సంఖ్యాబలం లేని మైనారిటీ ప్రభుత్వాన్ని, తన చాకచక్యంతో చాణక్యనీతితో, పూర్తి కాలం నడిపించిన మేధావి. 1957 లో మంథని నుండి ఎమ్మెల్యేగా ఎన్నికై, వరుసగా నాలుగు సార్లు గెలిచారు. 1962 లో మొదటిసారి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొంది, 62 నుండి 64 వరకు న్యాయ సమాచార మంత్రిగా, 64 నుండి 67 వరకు దేవాదాయ, న్యాయబీ 67 లో వైద్య ఆరోగ్య 68 నుండి 71 వరకు న్యాయ, సమాచార శాఖలను నిర్వహించారు. 77లో లోకసభకు ఎన్నికైనారు. జనవరి 1980 – జూలై 1984 కేంద్ర విదేశ వ్యవహారాల మంత్రిబీ జూలై 1984 – డిసెంబర్ 1984 కేంద్ర హెూం శాఖమంత్రిబీ నవంబరు 1984 – ఫిబ్రవరి 1985 భారత ప్రణాళికా శాఖ మంత్రి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, జనవరి 1985 – సెప్టెంబరు 1985 కేంద్ర రక్షణ శాఖమంత్రి, సెప్టెంబరు 1985 – జూన్, 1988 కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిబీ జూలై 1986 – ఫిబ్రవరి 1988

కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖమంత్రిబీ జూన్ 1988 – డిసెంబర్ 1989 విదేశ వ్యవహారాల శాఖ మంత్రిబీ 1991 మే 29 – 1996 కాంగ్రెసు పార్టీ అధ్యక్షునిగాబీ జూన్ 1991 %--% 1996 మే 10 వరకు ప్రధానమంత్రిగా పని చేశారు. 71 సెప్టెంబర్ నుండి 73 జనవరి వరకు ముఖ్యమంత్రిగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు.

సీఎం పీఠం అధిష్టించగానే అసమ్మతి. ఈ విషయమై అధిష్టానంతో చర్చించేందుకు ఢిల్లీ – హైదరాబాదుల మధ్య తిరిగేందుకే ఆయనకు సమయం సరిపోయింది. పట్టణ




భూ గరిష్ట చట్టాన్ని తెచ్చింది ఆయనే. ఆ తర్వాత ఆయన కార్యక్షేత్రం ఢిల్లీకి మారింది. ఏఐసిసి ప్రధాన కార్యదర్శిగా, మొదటిసారి హనుమకొండ నుండి లోకసభకు ఎన్నికైనారు. నంద్యాల ద్వారా ఉప ఎన్నికలలో, టిడిపి పోటీ లేకుండా ఐదు లక్షల పైచిలుకు మెజారిటీతో గెలుపొంది, గిన్నిస్ రికార్డు సృష్టించి, పదవ లోకసభలో అడుగిడి, పలు శాఖల మంత్రిగా విధులు నిర్వర్తించారు. రాజీవ్ హత్య కారణంగా 1991 లో సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేయకుండానే, దేశ 10వ ప్రధాన మంత్రి పదవి చేపట్టారు.

భారత ఆర్థిక సంస్కరణలకు బీజం వేసి కుంటుతున్న వ్యవస్థను, తిరిగి పట్టాలెక్కించిన ఘనత సొంతం చేసుకుని, "భారత ఆర్థిక సంస్కరణల పితామహుడిగా" పేరొందిన మేధావి. ఆర్థిక



వ్యవస్థ పునరుజ్జీవనం కోసం చేపట్టిన సంస్కరణలు, రిజర్వు బ్యాంకు గవర్నర్ గా, ఆర్థిక శాస్త్రవేత్త గా ఉన్న మన్మోహన్ సింగ్ ను, ప్రత్యేకించి పిలిచి, దేశ ఆర్థిక మంత్రిని చేయడం ఆయనకే చెల్లింది. దేశాన్ని బంగారం తాకట్టు పెట్టాల్సిన స్థితి నుండి, సూపర్ పవర్ గా తేర్చి దిద్దడానికి పునాది వేశారు. ఆర్థిక సంస్కరణల ద్వారా మార్కెట్ సరళీకరణ ఆర్థిక విధానాన్ని రూపొందించారు. సంస్కరణల 1992 లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కంప్యూటర్ ఆధారిత వ్యాపార పద్ధతిని ప్రారంభించారు. పంజాబ్ తీవ్రవాదాన్ని అణచి వేసింది ఆయన ప్రభుత్వమే. కాశ్మీర్ తీవ్రవాదులు ప్రముఖులను అపహరించినప్పుడు, వారి డిమాండ్లను లెక్క పెట్టక బందీలను విడిపించిన ఘనత ఆయనదే. ఇజ్రాయెల్ తో దౌత్య సంబంధాలు, తీవ్రవాదానికి పాకిస్థాన్ ఇస్తున్న ప్రోత్సాహాన్ని బయటపెట్టి, ఆగ్నేయాసియా దేశాలతో సత్సంబంధాలు కలిగి ఉండడం, పివి ప్రభుత్వం సాధించిన విజయమే. 1998లో వాజపేయి ప్రభుత్వం జరిపిన అణుపరీక్షల కార్యక్రమాన్ని మొదలు పెట్టింది పీవీ ప్రభుత్వమే. ఆయన కాలంలోనే బాంబు తయారయింది. ఈ విషయాన్ని స్వయంగా వాజపేయే ప్రకటించారు. రాష్ట్ర విద్యా మంత్రిగా రెసిడెన్షియల్ పాఠశాలల వ్యవస్థ, కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా నవోదయ విద్యాలయాలకు రూపకర్త అయినారు. 1973లో సీఎంగా భూస్వామ్య వ్యవస్థ నిర్మూలనకు నడుం బిగించి, భూ గరిష్ట పరిమితి, పట్టణ పరిమితి చట్టాన్ని అమలు చేసిందీ పి.వి.నే. ప్రధానిగా ఆయన హయాంలో 1992 డిసెంబర్ 6 న అయోధ్యలో బాబరీ మసీదును కూలగొట్టిన సంఘటనలో పీవి వైఖరి వివాదాస్పదమైంది. ప్రధానిగా ఐదేళ్ళ పదవీకాలంలో అనేక అవినీతి ఆరోపణలను పివి ఎదుర్కొన్నారు. చివరి కేసులన్నీ వీగిపోయాయి.

బహుభాషా పండితులు, 17 భాషలలో అలవోకగా మాట్లాడ గలిగిన మేధావి. 1940 లో తన సోదరులతో కలిసి కాకతీయ పత్రికలో ఎన్నో వ్యాసాలు రాశారు. 1948 నుండి 51 వరకు కాకతీయ పత్రిక "సంపాదకునిగా" పని చేశారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ విరచిత వేయి పడగలను, "సహస్ర ఫణ్" పేరుతో, హిందీ అనువాదం చేసి జ్ఞానపీఠ అవార్డు పొందారు. 1968–74 మధ్య తెలుగు సాహిత్య అకాడమీ చైర్మన్ గా ఉన్నారు. ఆయన రచనల్లో ప్రఖ్యాతి చెందినది "ఇన్‌సైడర్" అనే ఆత్మకథ. లోపలి మనిషిగా ఇది తెలుగులోకి అనువాద మయింది. 1983 లో స్పానిష్ భాషలో ప్రసంగించి, అలీన దేశాల శిఖరాగ్ర సమావేశంలో, క్యూబా అధ్యక్షులు ఫిడేల్ ను అబ్బుర పరిచిన గొప్పతనం ఆయనది. నిరాడంబరుడు, తన పిల్లలను సైతం ప్రధాని కార్యాలయానికి దూరంగా ఉంచిన నిజాయతీ పరులు. చివరిదశలో కోర్టుల చుట్టూ తిరగడానికి సొంత ఆస్తులను అమ్ముకున్న వ్యక్తి.

నిజాం వ్యతిరేక పోరాట యుద్ధ తంత్ర నిపుణునిగా చివరకు స్వతంత్ర్య సముపార్జన దినం నాడు, 1947 ఆగస్టు 15 న కూడా అటవీ క్షేత్రంలో పోరాట క్రమంలోనే ఉన్న పోరాట యోధుడు. 2004 డిసెంబర్ 23 న తుది శ్వాస వదిలా రాయన. పి.వి. స్మృత్యర్థం హైదరాబాదులో భారత దేశంలోనే అతిపెద్ద ఫ్లై ఓవర్ కు పి.వి. నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే అని పేరుపెట్టారు. శంషాబాద్ విమానాశ్రయం ప్రయాణీకులను దృష్టిలో ఉంచుకొని దీనిని నిర్మించి, 19.10.2009 న ప్రారంభించారు. పివికి భారత రత్న అవార్డు ఇవ్వాలని సీఎం కేసిఆర్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తునే ఉన్నారు. శత జయంతి ఉత్సవాలను ఏడాదిపాటు నిర్వహించాలని కేసిఆర్ నిర్ణయించి, సీనియర్ నేత కేశవరావు అధ్యక్షతన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, అనురించడం ద్వారా కేసిఆర్, తెలుగు జాతి మహెూన్నత వ్యక్తికి తగిన గౌరవం ఇవ్వడం ముదావహం.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# అపర చాణిక్యుడు మన పివి

ఆయన ఓ చేయి తిరిగిన పాత్రికేయుడు. అపర భాషా కోవిదుడు, జ్ఞానపీఠ అవార్డు పొందిన సాహితీ సృజనకారుడు. రాజకీయ దురంధరుడు, గొప్ప రాజనీతిజ్ఞుడు, అచ్చ తెలుగుతనానికి మారుపేరు. పదవులకే వన్నె తెచ్చిన రాజకీయ కోవిదుడు. ఆయనే మన జాతి రత్నం పీవీ నరసింహారావు 1921 జూన్ 28న వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో సీతారామారావు రుకమాబాయి దంపతులకు జన్మించారు. పీవీ చిన్నతనం నుంచి కూడా అపారమైన తెలివితేటలతో ఉండి అన్ని విషయాల్లో కూడా ఎంతో చురుగ్గా ఉండేవారు. అందుకే 'బహుముఖ ప్రజ్ఞ' అన్న పదానికి అసలైన అర్థం చెప్పిన మేధావి. కరీంనగర్ జిల్లా వంగర వాసులకు దత్తత వెళ్లడం వలన పాములపర్తి వెంకట నరసింహారావుగా పేరు మారింది. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డిగ్రీ, నాగపూర్ యూనివర్సిటీ నుండి లా డిగ్రీ పూర్తి చేశారు.



పివి ఉస్మానియా య్ ు ూ ని వ ర ్ స ట ీ లో చదువుతున్నప్పుడే స్వాతంత్ర ఉద్యమంలో బాగా ఆ విధంగా ఆయన రాజకీయ జీవితం ప్రారంభమైంది. 1951 లో ఏఐసిసి మెంబర్ అయ్యారు. ఆ తర్వాత మంథని ఎమ్మెల్యేగా నాలుగు సార్లు ఎన్నికయ్యారు. తెలంగాణ ఉద్యమం తర్వాత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. కొందరు మ%శీ%త్రులు రాజీనామా చేయడంతో 1973లో అసెంబ్లీని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించారు. అదే సంవత్సరం ఇందిరాగాంధీ పీవిని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. 1957లో వరంగల్ జిల్లా హనుమకొండ,1984 మహారాష్ట్ర లోని రాంటెక్ నుంచి ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి పదవులు విజయవంతంగా నిర్వహించారు.

అలాగే అంతర్జాతీయ సమాజం పై ఆయనకున్న అవగాహన, 18 భాషలపై ఆయనకున్న పట్టు పీవీకి విదేశాంగమంత్రి పదవి వరించింది. విదేశీయులు సైతం అబ్బుర పడే విధంగా ఆ పదవికే వన్నె తెచ్చారు. ఆ తర్వాత రాజీవ్ గాంధీ మరణంతో ప్రధాని పదవి చేపట్టారు. దేశ ప్రధానిగా మైనార్టీ ప్రభుత్వాన్ని సమర్ధవంతంగా నడిపించడంలో కీలక పాత్ర పోషించారు. ప్రధానిగా ఆయన చేపట్టిన సంస్కరణలు దేశ భవిష్యత్తును మార్చి రాజనీతికి చాణిక్యానికి నిదర్శనంగా నిలిచి అపర చాణక్యుడిగా కీర్తింప బడ్డారు. ఇంకా ఆయన ఆర్థిక సంస్కరణల పితామహుడిగా కొనియాడబడ్డారు.

ప్రధాని పదవికి వన్నె తెచ్చిన ఈ తెలుగు జాతిరత్నం సాహితీ పూతోటలో కూడా తన రచనల్ని ఎంతో గొప్పగా విరబూయించారు. మహా గ్రంథాల అనువాదం, సొంత రచనలు, కవిత్వం ఇలా తనదైన బాణీలో ఆణిముత్యాలలాంటి రచనలు చేశారు. అలాగే విశ్వనాథ సత్యనారాయణ "వేయి పడగలు" నవలను "సహస్ర ఫన్" గా హిందీలోకి అనువదించారు, దీనికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. 'ఇన్సైడర్' పేరుతో ఆయన రాసిన ఆత్మకథ సూపర్ సక్సెస్ అయింది. ఇంకా కాకతీయ అనే పత్రికను ప్రారంభించి అందులో జయ అనే కలం పేరుతో అద్భుతమైన వ్యాసాలు రాశారు. గొప్ప రచయితగా ఇంకా స్వతంత్ర భారత రాజకీయాలలో తన ప్రత్యేకతను చాటిన మహా నేత, బహుముఖ ప్రజ్ఞాశాలి పాములపర్తి వెంకట నరసింహారావు గారు 2004 డిసెంబర్ 23 న పరమపదించారు.

పింగళి భాగ్యలక్ష్మి,
కాలమిస్టు రచయిత్రి (ఫ్రీలాన్స్ జర్నలిస్టు)

# బుల్‌ఫైట్ జరుగుతుండగా కూలిన స్టేడియం గ్యాలరీ

## గ్యాలరీ కుప్పకూలి నలుగురు మృతి
## కొలంబియాలోని ఎల్ ఎస్పినల్‌లో ఘటన

కొలంబియా,జూన్27: బుల్‌ఫైట్ జరుగుతుండగా స్టేడియంలోని ప్రేక్షకుల గ్యాలరీ కుప్పకూలి నలుగురు మృతి చెందిన ఘటన కొలంబియాలోని ఎల్ ఎస్పినల్‌లో చోటు చేసుకొంది. ఈ ప్రమాదంలో 300 మందికి గాయపడ్డారు. ఎల్ ఎస్పినల్‌లో సంప్రదాయ కొర్రలెజ క్రీడను నిర్వహించారు. దీనిలో పాల్గొనేవారు ఒక దున్నపోతును కవ్విస్తూ ఆడతారు. క్రీడ జరుగుతున్న సమయంలో ఒక్కసారి స్టేడియంలోని ప్రేక్షకుల గ్యాలరీ కుప్పకూలిపోయింది. ఓ పక్క శిథిలాల నుంచి ప్రజలు బయటకు వస్తుండగా.. స్టేడియంలో క్రీడను మాత్రం కొనసాగించారు. తాజాగా ఈ వీడియో వైరల్‌గా మారింది. సాన్ పెడ్రో అనే పండుగలో భాగంగా ఈ క్రీడను నిర్వహించారు. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు, ఒక చిన్నారి మృతి చెందినట్టు టొలిమా గవర్నర్ జోస్ రిచర్డ్ ఓర్జ్‌కో పేర్కొన్నారు. గాయాలతో 322 మంది చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. వీరిలో కూడా నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రీడ కారణంగా తరచూ మనుషులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నెల మొదట్లో కూడా దున్నపోతు దాడిచేయడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. మనుషులు, పశువులు ప్రాణాలు కోల్పోయే క్రీడలను అనుమతించ వద్దని కొత్తగా అధ్యక్షుడిగా ఎన్నికైన గుస్తోవ్ పెట్రో స్థానిక అధికారులను ఆదేశించారు.

# ఇటీవలి వర్షాలతో ప్రాజెక్టులకు జలకళ

మూసీ మూడు గేట్లు ఎత్తి నీటిని వదిలిన అధికారులు

నల్లగొండ,జూన్27: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మూసీ నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఫలితంగా మూసీ ప్రాజెక్టు నీటిమట్టం కూడా పెరుగుతోంది. ఇప్పటికే ప్రాజెక్టు గరిష్ట స్థాయికి చేరుకోవడంతో మూడు గేట్లు అడుగు మేర ఎత్తి దిగువకు నీటి విడుదల ప్రారంభించారు. మూసీ నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతుండడం.. మరో వైపు ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టానికి చేరుకోవడంతో మూడు గేట్లు అడుగు మేర ఎత్తి నీటి విడుదల ప్రారంభించడంతో ప్రాజెక్టు ఆయకట్టు.. కాల్వల కింద సాగు చేసే రైతులను అధికార యంత్రాంగం అప్రమత్తం చేసింది. ప్రస్తుతం మూసీ ప్రాజెక్టు వద్ద మూడు గేట్లు(3,7,10 నంబర్లు) అడుగు మేర ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. మూసీ నదిలో వరద ప్రవాహం (ఇన్ ఎ÷-లో) 1247.79 క్యూసెక్కులు ఉండగా.. మూడు గేట్ల ద్వారా 1992.74 క్యూసెక్కులు విడుదల ( అవుట్ ఎ÷-లో) చేస్తున్నారు. ÷ఔసీ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా.. ప్రస్తుతం నీటిమట్టం 644.61 అడుగులకు చేరుకుంది. అలాగే ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా.. 4.36 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నీటి నిల్వ గరిష్ట స్థాయికి చేరుకోవడంతో పైనుంచి వచ్చిన వరద ప్రవాహాన్ని వచ్చినట్ల దిగువకు విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో రిజర్వాయర్లు జలకళను సంతరించుకుంటున్నాయి. నల్గొండ జిల్లా కేతేపల్లి మండలం వద్ద మూసీ రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తోంది. ఎగువన గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో.. మూసీ ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరిగింది. మరోవైపు నిర్మల్ జిల్లా కడెం జలాశయంలోని ఉధృతంగా వరద నీరు చేరుతోంది. జలాశయ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులకు గానూ.. 679.300 అడుగుల మేరకు నీరు చేరింది. జలాశయంలోకి 1621 క్యూసెక్కుల వరద నీరు చేరుతోందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

# ధర్మపురితో పివి అనుబంధం

జూన్ 28... పి వి జయంతి సందర్భంగా

పాములపర్తి వెంకట నరసింహా రావుకు ధర్మపురి క్షేత్రంతో అవినాభావ సంబంధం ఉంది. బ్రాహ్మణ అగ్రహారమైన ధర్మపురి వాసులతో బంధుత్వం లేకున్నా, ఇక్కడి శ్రీ నృసింహ గురు పీఠం తో, అలాగే సమకాలీన రాజకీయాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉన్న నాయకులతో గల సన్నిహిత సంబంధాల దృష్ట్యా తరుచుగా పి.వి. క్షేత్రానికి వస్తూ పోతూ ఉండేవారు. అష్టాదశ పురాణముల ను ఔపోసనం పట్టి, నిత్య పురాన ప్రవచనాలతో భక్తులను ఆధ్యాత్మిక లోకాలలో విహరింప చేసిన, అపర వేదవ్యాసులుగా పేరుగాంచిన గుండి రాజర్షి వద్దకు వచ్చి, శ్రద్ధగా విని, సందేహ నివృత్తి చేసుకున్న నేపథ్యం, అపర ధన్వంతరి, నాటక సంస్థ స్థాపకులు, దర్శకులు, బహుముఖ ప్రజ్ఞాశాలి కాసర్ల వేంకట రాజయ్య, కొరిడే కిష్టయ్య, వొజ్జల కోటయ్య, పాత కాంతయ్య, పెండ్యాల లక్ష్మీ నరహరి తది.తరులతో, కొరిడే కిష్టయ్య ఇంటి అరుగుపై రోజుల కొద్దీ రాజకీయ చర్చలు చేసిన విషయాలు క్షేత్ర పాతతరం వారికి నిత్య జ్ఞాపకాలుగా ఉన్నాయి.

1967లో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిగా, లక్ష్మీ నరసింహ స్వామి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్న పి.వి. తర్వాత సీఎం బ్రహ్మానంద రెడ్డి, ఆర్థిక మంత్రి మర్రి చెన్నారెడ్డి లతో చర్చించి, స్థానికులు, స్వాతంత్ర్య సమరయోధుడు కే.వీ. కేశవులకు ఏక సభ్య దేవస్థాన పునరుద్ధరణ కమిటీ బాధ్యులుగా నియమింప చేసి, దేవాలయాల అభివృద్ధికి, శ్రీ వెంకటేశ్వర విగ్రహ ప్రతిష్టాపన అది కార్యక్రమాలకు పి.వి.చేయూత అందించారు.

ధర్మపురి క్షేత్రం లో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సహకారంతో నిర్వహించ బడిన శ్రీ రాజ రాజేశ్వర వెంకటేశ్వర సంస్కృత పాఠశాల కోసం శాశ్వత భవనం నిర్మించాలని, నాటి దేవస్థాన పాలక వర్గ కమిటీకి సూచించి, 1970 అక్టోబర్ 2న రాష్ట్ర విద్యా శాఖ మంత్రిగా, శంకు స్థాపన చేశారు. తర్వాత సదరు పాఠశాల భవనం 1976 ఆగస్టు 11న నాటి రాష్ట్ర వ్యవసాయ, రవాణా శాఖల మంత్రి జువ్వాడి చొక్కారావు, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి రాజా సాగి సూర్య నారాయణ రాజు చేతుల మీదుగా ప్రారంభం చేసుకోవడం జరిగింది.

1971 శాసనసభ సార్వత్రిక ఎన్నికల సమయంలో సీఎం హెూదాలో నాటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బి.రాములుకు మద్దతుగా ధర్మపురి లో ప్రచార సభలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా గోదావరి నుండి త్రాగు నీటి సరఫరా పథకం మంజూరీ ఇచ్చి, మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతి రావును నీటి సరఫరా పథకం పనులు చేయాలని కోరారు.

తమ సన్నిహితులు రొట్టె విశ్వనాథ శాస్త్రి కోరికపై, స్థానిక లక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర డిగ్రీ ప్రాచ్య కళాశాల శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలని నాటి కరీంనగర్ కలెక్టర్ కే. ఎస్. శర్మను ఆదేశించారు.






స్థానిక కాంట్రాక్టర్ సం కిష్టయ్య నిర్మాణం గావించారు. నాటి ఎమ్మెల్యే జువ్వాడి రత్నాకర్ రావు అభ్యర్థనపై పలు నిధులు మంజూరు చేశారు. 1945 నుండి పి.వి.కి ధర్మపురి నేతలతో సన్నిహిత సంబంధాలు ఉండేవని, ఆయన సమకాలిక నేత, పలువురు కాంగ్రెస్ అగ్ర నాయకు లతో సాన్నిహిత్యం కలిగి ఉన్న దాద గారి కిషన్ రావు చెప్పేవారు. క్షేత్రంలో గోదావరి రక్షిత మంచినీటి సరఫరా పథకం, తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మశాల, సంస్కృత పాఠశాల భవనం, ఓరియంటల్ డిగ్రీ కళాశాల భవనం పి.వి. చొరవ వల్లనే సాధ్య మైనాయని పి.వి. సన్నిహితులు, ప్రభుత్వ సన్మానితులు, నరసింహ పీఠ నిర్వాహక బాధ్యులు బ్రహ్మశ్రీ రొట్టె విశ్వనాథ శాస్త్రి చెపుతుండేవారు.

సాంప్రదాయ పద్య నాటకంలో తన ప్రదర్శన తిలకించి నట కిరీటి బిరుదుతో గౌరవించి, సన్మానించిన సంఘటనను, తమ ఇంటిలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యాలయంలో నెల రోజులు బిజీగా పార్టీ పటిష్టతకు అంకిత భావంతో పనిచేసిన, తనతో పాటే నిద్రించిన నేపథ్యాన్ని విశ్వనాథ శాస్త్రి పదే పదే గుర్తు చేసుకునే వారు.

# గజ్వేల్‌కు చేరుకున్న తొలి గూడ్స్‌రైలు

## స్వాగతం పలికిన మంత్రులు హరీష్, నిరంజన్ రెడ్డి
## గజ్వేల్ రైల్వే స్టేషన్‌లో రేక్ పాయింట్
## దశాబ్దాల పోరాట ఫలితం అన్న మంత్రి హరీష్
## రేక పాయింట్‌తో ఈ ప్రాంతానికి మేలన్న మంత్రి నిరంజన్

సిద్దిపేట,జూన్27: గజ్వేల్ కు తొలి గూడ్స రైలు చేరుకుంది. తొలి విడుతగా కాకినాడ నుంచి 13 బోగీలలో 1300 మెట్రిక్ టన్నుల ఎరువుల లోడ్‌ను తీసుకుని వచ్చింది. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ లో ఎరువుల రేక్ పాయింట్ ను మంత్రులు హరీష్ రావు, నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. తొలి విడతలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడలోని ఎన్ఎఫ్ సీఎల్ నుంచి గజ్వేల్ కు 12 బోగీల గూడ్సు రైలు 1300 మెట్రిక్ టన్నుల ఎరువుల లోడు తీసుకుని వచ్చింది. ఈ ఎరువుల రేక్ పాయింట్ కు అనుసంధానంగా సరకు రవాణా జరగనుంది. రువుల కోసం 4 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన రెండు గిడ్డంగులను నిర్మించారు. దీంతో ఇవాళ్టి నుంచి గజ్వేల్ కు గూడ్స్ రైలు రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఎరువుల రేక్ పాయింట్ ప్రారంభ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ లు ఫారూఖ్ హుస్సేన్, యాదవరెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్ రైల్వే స్టేషన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన రేక్ పాయింట్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లా దశాబ్దాల పోరాటం ఫలితంగా రేక్ పాయింట్ ఏర్పాటైందని పేర్కొన్నారు. ఈ రేక్ పాయింట్ జిల్లా ప్రజలకు వరం అని చెప్పారు. కేంద్రానిదే రైల్వే లైన్ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ రైల్వే లైన్ కోసం నాటి సీఎంలు కిరణ్ కుమార్ రెడ్డి, రోశయ్య నిధులు ఇచ్చేవారు కాదని గుర్తు చేశారు. కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మూడో వంతు నిధులను ఎప్పటికప్పుడు ఇచ్చిందని తెలిపారు. కొత్తపల్లి- మనోహరబాద్ రైల్వే లైన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 600 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఈ లైన్ కోసం 2,200 ఎకరాల భూసేకరణ చేశామని హరీశ్‌రావు తెలిపారు. ప్రజల ఊహలకు అందనిది, కలలో కూడా ఊహించని అభివృద్ధి టీఆర్ఎస్ హయాంలో జరుగుతున్నదని మంత్రి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ రైల్వే స్టేషన్లో ఎరువుల రేక్ పాయింట్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అనేక రకాల ఎగుమతుల సౌలభ్యం ఈ రేక్ పాయింట్ ద్వారా అందనుందన్నారు. రాబోయే వందల సంవత్సరాల వరకూ ప్రజల అవసరాలు తీర్చే పనులు జరుగుతున్నాయన్నారు. సీడ్ పాయింట్‌గా గజ్వేల్ అభివృద్ధి చెందుతున్నదని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో ఉన్న రెండు జాతీయ పార్టీలు దేశాన్ని ఎన్ని ఏళ్ళు ఏలినా తెలంగాణకు ఒరిగిందేమి లేదన్నారు. ఈ రోజు కేంద్రాన్ని ఏలుతున్న పార్టీ వరి సాగులో, వడ్ల కొనుగోలులో అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరించిందని విమర్శించారు. వరికి ప్రత్యామ్నాయంగా పత్తి, పప్పు దినుసులు, ఆయిల్ పామ్ సాగుకు రైతులు మొగ్గు చూపాలన్నారు. ల్గ÷తులకు, ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగించి రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శించారు.



# గ్యాంగ్ రేప్ కేసుల్లో దర్యాప్తు ముమ్మరం

## నిందితుల డీఎన్ఏ సేకరణకు కోర్టు అనుమతి

హైదరాబాద్,జూన్27: జూబ్లీహిల్స్ గ్యాంగ్‌రేప్ కేసు నిందితుల డీఎన్ఏ సేకరణను కోర్టు అనుమతి ఇచ్చింది. బాలికపై సామూహిక అత్యాచారం కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితుల డీఎన్ఏ సేకరించడానికి పోలీసులు కోర్టును అనుమతికోరగా న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నిందితుల నుంచి పోలీసులు డీఎన్ఏ సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్?కు పంపనున్నారు. ఇప్పటికే.. అత్యాచారం జరిగిన ఇన్నోవా కారులో ఆధారాలు సేకరించారు. డీఎన్ఏ సేకరించిన తర్వాత వాహనంలోని ఆధారాలతో పోల్చనున్నారు. నిందితులు ఇన్నోవా వాహనంలోనే ఉన్నట్లు శాస్త్రీయంగా నిరూపించడానికి డీఎన్ఏ టెస్ట్ ఉపయోగపడుతుందని పోలీసులు భావిస్తున్నారు. అవసరమైతే బాధితురాలి డీఎన్ఏను సేకరించే యోచనలో ఉన్నారు. మే 28న మైనర్ బాలికను సాదుద్దీన్ సహా మరో ఐదుగురు యువకులు అత్యాచారం చేశారు.ఈ కేసులో ఐదుగురు మైనర్లతో పాటు ప్రధాన నిందితుడు సాదుద్దీన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం అందర్ని కొన్ని రోజుల పాటు రిమాండ్‌లో ఉంచి విచారించారు. ప్రస్తుతం సాదుద్దీన్ చంచల్‌గూడ జైల్లో ఉండగా.. ఐదుగురు మైనర్లు జువైనల్ హోంలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. జూబ్లీహిల్స్ మైనర్ బాలిక కేసులో నిందితుల గుర్తింపు పక్రియ పూర్తి అయింది. న్యాయమూర్తి సమక్షంలో నిందితుల గుర్తింపు పక్రియను నిర్వహించారు పోలీసులు. బాధితురాలిని పోలీసులు చంచల్?గూడ జైలుకు తీసుకెళ్లగా..న్యాయమూర్తి సమక్షంలో బాధితురాలు నిందితుడు సాదుద్దీన్ ను గుర్తుపట్టింది. ఆ తర్వాత సైదాబాద్ లోని జువైనల్ హోంలో ఉన్న ఐదుగురు మైనర్లను బాధితురాలు గుర్తించింది. జైల్లో ఉన్న ఇతర ఖైదీల మధ్య అత్యాచార నిందితులను ఉంచగా..బాధితురాలు వారిని గుర్తించింది. బాధితురాలు చెప్పిన వివరాలను న్యాయమూర్తి నమోదు చేసుకున్నారు. మరోవైపు అత్యాచార నిందితులకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. వారి డీఎన్ఏ పరీక్షలకు అనుమతివ్వాలని పోలీసులు కోర్టును కోరగా..న్యాయస్థానం అనుమతిచ్చింది. దీంతో నిందితులకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించనున్నారు పోలీసులు.



# రైతుకు సాయం



మొదటిపేజీ తరువాయి..

కోరారు. జూలై 15వ తేదీ వరకు పత్తి విత్తుకునే అవకాశం ఉన్నందున రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వర్షాలు కొంత ఆలస్యమయినందున తేలిక నేలలలో 5 నుండి 6.5 సెంటిమీటర్లు, బరువు నేలలలో 6 నుండి 7.5 సెంటిమీటర్ల వర్షపాతం నమోదు అయిన తర్వాతనే రైతులు వర్షాధార పంటలను విత్తుకోవాలని మంత్రి సూచించారు.

# ఎడ్యుకేషనల్ హబ్‌గా గజ్వేల్

## 20 ఎకరాల్లో బాలికలకు,40 ఎకరాల్లో బాలురకు వసతులు
## హబ్‌కు రూ.146 కోట్ల28 లక్షలు మంజూరు
## గజ్వేల్ స్ఫూర్తితో మరిన్ని సంస్థల ఏర్పాటు యోచన

హైదరాబాద్,జూన్27:

రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రాతినిద్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న విద్యాహబ్ దేశానికే తలమానికంగా నిలువ బోతున్నది. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఒకే ఆవరణలో అతిపెద్ద భవనాలను నిర్మించారు. గజ్వేల్ ఎడ్యుకేషన్ హాబ్ కి ప్రభుత్వం రూ.146 కోట్ల 28 లక్షల నిధులు మంజూరు చేసింది. తెలంగాణ రాష్ట్ర విద్యా సంక్షేమ మౌళిక వసతి సదుపాయాల సంస్థ ఆధ్వర్యంలో పనులు జరిగాయి. కేజీ టు పీజీ ఉచిత విద్యావిధానంలో భాగంగా 6వ తరగతి నుంచి పీజీ వరకు ఒకే ఆవరణలో అన్నిరకాల విద్యాసంస్థలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలతోపాటు కేజీబీవీలు, మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ పీజీ కాలేజీలను ఒకే క్యాంపస్‌లో నిర్మించిన ఘనత దేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుంది. గజ్వేల్‌లో 20 ఎకరాల్లో బాలికల కోసం విద్యాహబ్‌ను నిర్మించారు. దానికి ఒక కిలోమిటర్ దూరంలో 40 ఎకరాల్లో బాలుర కోసం విద్యాహబ్‌ను ఏర్పాటు చేశారు. సువిశాలమైన తరగతి గదులు, భోజనశాలలు, గ్రంథాలయాలు, ప్రయోగశాలల్ని ఉత్తమ ప్రమాణాలతో రూపొందించారు. వివిధ భవనాల మొత్తం విస్తీర్ణం 4,58,902 చదరపు అడుగులు. ప్రపంచశ్రేణి ప్రమాణాలతో, ధారాళంగా గాలి వెలుతురు వచ్చేలా అక్కడ చదువుకునే విద్యార్థులకు, బోధకులకు ఆహ్లాదంతోపాటు మంచి వాతావరణం ఉండే విధంగా నిర్మాణాలను చేపట్టారు. విశాలమైన తరగతి గదుల్లో పగటివేళల్లో సహజసిద్ధ వెలుగు ప్రసరించే విధంగా భవనాలను నిర్మించారు. అన్ని తరగతుల వారు ఉపయోగించుకునే విధంగా ఉన్నతస్థాయి ప్రమాణాలతో సైన్స్ ల్యాబులు రూపొందించారు. ఉత్తమ బోధనతోపాటు పోటీ పరీక్షలకు కోచింగ్ ఏర్పాట్లు చేశారు. 1,200 మంది విద్యార్థుల సామర్థ్యంతో హైటెక్ ప్రమాణాలతో పెద్ద ఆడిటోరియాన్ని నిర్మిస్తున్నారు. ప్రతి క్యాంపస్‌లో 2,500 మంది విద్యార్థులు ఉండేలా వసతులు కల్పించారు. భవిష్యత్తులో మరో 1,000 మంది విద్యార్థులు కూడా ఈ క్యాంపస్‌లో చదుకోవడానికి అనుగుణంగా నిర్మాణాలు ఉన్నాయి. ప్రతి ఒక్క విద్యార్థి ప్రపంచస్థాయికి ఎదిగేలా విద్యాబోధన కొనసాగిస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ వరకు కావాల్సిన విధంగా టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించారు. ఇక్కడ పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలోనే బోధన జరుగుతుంది. రాష్ట్ర స్థాయి సిలబస్‌ను కొనసాగిస్తున్నారు. గజ్వేల్ స్ఫూర్తితో మరికొన్ని జిల్లాల్లో విద్యాహబ్‌ల నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తున్నది.

# బీజేపీ ఫ్లెక్సీలకు అవకాశం ఏదీ

## మెట్రో పిల్లర్లను ముందే రిజర్వ్ చేసిన టీఆర్ఎస్

హైదరాబాద్,జూన్27:

తెలంగాణలో టీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ పోరు అన్నట్లుగా ప్రస్తుత పరిస్థితి ఉందిన బిజెపి సభను అడ్డుకోవడానికి నానా ప్రయత్నాలను టిఆర్ఎస్ చేస్తోందని బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ ఇప్పటికే ఆరోపించారు. ఈ క్రమంలో అధికార టీఆర్ఎస్ తాజాగా బీజేపీకి ఊహించని ఝలక్ ఇచ్చింది. 3, 4 తేదీల్లో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు జరగనున్న విషయం తెలిసిందే. ఇక అలాంటి సమావేశాలు అంటే పార్టీలు ప్రచారం హోరెత్తిస్తాయి. ఎక్కడ చూసినా ఫ్లెక్సీలు బ్యానర్లతో ఊదరగొట్టేస్తాయి.

అయితే బీజేపీ ప్రచారంపై టీఆర్ఎస్ నీరు జల్లింది. ప్రకటనల కోసం ముందస్తుగా మెట్రో పిల్లర్లను టీఆర్ఎస్ పార్టీ బుక్ చేసుకుని బీజేపీకి అవకాశం లేకుండా చేసింది. ఇక సిటీలో బీజేపీకి ఎలాంటి అవకాశం లేకుండా చేయడంలో టీఆర్ఎస్ సక్సెస్ అయ్యింది. ప్రకటనల ఏజెన్సీలతో వారం రోజులు ప్రి ప్లాన్డ్‌గా ఒప్పందం కుదుర్చుకుంది. ఇక 2300లకు పైగా మెట్రో పిల్లర్లపై ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రచారం నిర్వహిస్తోంది. సిటీలోని వెయ్యి బస్టాప్‌లలో టీఆర్ఎస్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది. మొత్తానికి బీజేపీ తేరుకునే లోగా టీఆర్ఎస్ పని చక్కబెట్టేసింది. ఇప్పుడు బీజేపీ ఏం చేస్తుందో వేచి చూడాలి.

## జై జవాన్.. జై కిసాన్ అన్నదే కాంగ్రెస్ నినాదం :జగ్గారెడ్డి

సంగారెడ్డి,జూన్27: ఆర్మీని ఆదానీకి అప్పజెప్పే కుట్ర జరుగుతోంది కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆరోపించారు.ఇప్పటికే దేశంలోని ప్రభుత్వ ఆస్తులను అంబానీ, అదానీలకు కట్టబెడుతున్న మోదీ ఇప్పుడు ఆర్మీపై పడ్డారని విమర్శించారు. ఆర్మీలో నాలుగేళ్లు పనిచేసి వచ్చాక అడ్డుక్కుని తినాలా? అని ఆయన ప్రశ్నించారు. జై జవాన్.. జై కిసాన్ అన్నదే కాంగ్రెస్ నినాదం జగ్గారెడ్డి పేర్కొన్నారు.అగ్నిపథ్‌ను రద్దు చేసేవరకు పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.దేశంలోని యువత భవిష్యత్ తో చెలగాటమాడవద్దని ఎమ్మెల్యే జగ్గారెడ్డి హితవు చెప్పారు.



## వాసవి గెలాక్సీ క్లబ్ డాన్ టు డెస్క్ ప్రోగ్రాంలో
# నోట్ బుక్స్ పంపిణి

**జనగామ జూన్ 27 (ప్రజామంటలు):** వాసవి గెలాక్సీ క్లబ్ డాన్ టు డెస్క్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం జనగామలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. జనగామ ఎబివి హైస్కూల్ లో మొక్కలు నాటారు. విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణి, అలాగే రాజేశ్వరి వృద్ధ ఆశ్రమంలో పండ్లు పంపిణి, మలకపెట్ హైస్కూల్ లో ఉప్పుగళ్ళ శ్రీధర్ సహకారంతో మలకపెట్ హైస్కూల్‌లో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఐఇసి ఆఫీసర్ కటకం హరీష్, రీజియన్ చైర్మన్ రాయకంటి రాజేశ్వర్, క్లబ్ అధ్యక్షులు గందె వేణు, లైన్స్ క్లబ్ జనగామ డైమండ్స్ అధ్యక్షుడు గట్టు శ్రీనివాస్ ఐవిఎఫ్ జనగామ జిల్లా అధ్యక్షులు బిజాల నవీన్, మహంకాళి హరిశ్చంద్ర గుప్త స్కూల్ స్టాఫ్ పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాములు
### అమ్ముతున్న ప్రైవేటు పాఠశాలలు

**జనగామ జూన్ 27 (ప్రజామంటలు):** రాష్ట్ర విద్యాశాఖ నియమ, నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం అమ్ముతున్న ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఉల్లెంగుల రాజు అన్నారు. ఏబీవీపీ జనగామ శాఖ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఆయన మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల్లో ఏలాంటి పుస్తకాలు, యూనిఫాం



అమ్మకూడదని, జిఒ.ఎం.ఎస్.నం 91 చెపుతున్న జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు లాభాపేక్షతో పేద, నిరుపేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని అన్నారు. పాఠశాలలో మాత్రమే పుస్తకాలు కొనుగోలు చేయాలని విద్యార్థులను, తల్లిదండ్రులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని అన్నారు. వెంటనే ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు చేసి ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించని పాఠశాలలు, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనియెడల విద్యార్థులు, తల్లిదండ్రులతో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి హృతిక్, మనోజ్, నితిన్, కార్తిక్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన బొర్ర చంద్రమ్మ పోచయ్య కుమార్తె శృతి సంతోష్ కుమార్‌ల వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమీషన్ సభ్యులు వోరగంటి ఆనంద్.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



**ఎల్కతుర్తి జూన్ 27 (ప్రజామంటలు):** మండల కేంద్రము శివారులో తహశీల్దార్ కార్యాలయం దగ్గర కరీంనగర్ - హనుమకొండ ప్రధాన జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున నాలుగు గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి (35) మృతి చెందాడు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఎల్కతుర్తి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని చూడగా మృతి చెందిన వ్యక్తి ధరించిన నీలం రంగు చొక్కా, తెలుపు రంగు ప్యాంటు, కుడి చేతికి పచ్చబొట్టు ఉన్నట్లు గుర్తించారు. మృతుడి గూర్చి సమాచారం తెలిసినవారు శ్రీనివాస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎల్కతుర్తి సెల్ నెంబర్ 9440904686, పరమేశ్వర్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎల్కతుర్తి సెల్ 94407 95117 సమాచారం అందించాలని కోరారు.

## సికింద్రాబాద్‌లో శ్రీ జగన్నాథ యాత్ర

**సికింద్రాబాద్ జూన్ 27 (ప్రజామంటలు):** శుక్రవారం, 1 జూలై న శ్రీ జగన్నాథ స్వామి రాంగోపాల్ ట్రస్ట్ ప్రతి సంవత్సరం జగన్నాథ పూరిలో జరిగే రథ యాత్రతో పాటుగా జగన్నాథ భగవానుడు, బలభద్రుడు మరియు సుభద్ర దేవతల కోసం సికింద్రాబాద్ లో రథయాత్రను నిర్వహిస్తుంది. ట్రస్ట్ గత 130 ఏళ్లుగా సికింద్రాబాద్లోని జనరల్ బజార్లోని జగన్నాథ స్వామి ఆలయం నుంచి క్రమం తప్పకుండా ఈ రథయాత్రను జరిపిస్తుంది. దర్శనం కోసం ఆలయ ద్వారాలు ఉదయం 6:30 గంటలకు తెరవబడతాయి, మరియు మధ్యాహ్నం 1:00 గంటలకు మూసివేయబడతాయి. ఆ తర్వాత, రథయాత్ర ఊరేగింపు ఆలయం నుండి సాయంత్రం 4:00 గంటలకు ప్రారంభమై జనరల్ బజార్ లో తర్వాత 6:30 సాయంత్రం - 10:00 సాయంత్రం వరకు ఎంజి రోడ్లో జరిగేట్టుగా షెడ్యూల్ చేయబడింది. ఆ తర్వాత రథయాత్ర హిల్ స్ట్రీట్, రాణిగంజ్ గుండా కొనసాగుతూ, మరుసటి రోజు ఉదయం సుమారు 3:00 గంటలకు ఆలయానికి తిరిగి చేరుకుంటుంది. శ్రీ జగన్నాథ స్వామి రాంగోపాల్ ట్రస్ట్, ఇలా అన్నారు. 2 సంవత్సరాల విరామం తర్వాత భగవాన్ జగన్నాథుని వార్షిక రథోత్సవాన్ని పునః ప్రారంభిస్తున్నామని ప్రకటిస్తున్నందుకు మేము చాలా సంతోషిస్తున్నాము. సికింద్రాబాద్ %ఽ% హైదరాబాద్ నుండి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి ఆశీస్సులు పొందుతారని మేము ఆశిస్తున్నాము. పైన పేర్కొన్న సమయాలను గమనించి, తదనుగుణంగా దర్శనాన్ని ప్లాన్ చేసుకోవాలని భక్తులందరినీ ఆయన అభ్యర్థించారు.

## రాష్ట్ర ప్రభుత్వ వింత నిర్ణయాలు
### ఆందోళనలో విద్యార్థులు
### టెన్త్ ఫలితాలు వచ్చిన రోజే ఇంటర్ క్లాస్లు ప్రారంభం..?

**సికింద్రాబాద్, జూన్ 27 (ప్రజామంటలు):** తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వింతగా ఉంటున్నాయి. దీనివలన సామాన్య ప్రజలు ఇబ్బందులు పడే అవకాశాలు తలెత్తుతున్నాయి. తాజాగా విద్యాశాఖ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం పదవతరగతి విద్యార్థులను అయోమయంలో పడేసింది. జూనియర్ ఇంటర్మీడియట్ తరగతులు జులై మొదటి తేదిన ప్రారంభిస్తున్నట్లు ఇటీవల ప్రకటించారు. అలాగే పదవతరగతి ఫలితాలు జూన్ 30 లేదా జులై 1న అని అధికారులు వెల్లడించారు. మరి టెన్త్ ఫలితాలు ప్రకటించిన రోజు, లేదా మరుసటి రోజే జూనియర్ కాలేజీలో సీటు ఎలా సంపాదించడం, తరగతులకు ఎలా హాజరు కావడం అనే విషయంపై స్టూడెంట్స్ డైలామాలో పడ్డారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు నిర్ణయాలు తీసుకునే సమయంలో ఒకటికి రెండు సార్లు ఆలోచించాలని, లేనిపోని కన్ఫ్యూజ్లతో జనాలను పరేషాన్ చేయవద్దని సికింద్రాబాద్ స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ డా. వై. సంజీవ్ కుమార్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# నిరుద్యోగుల కడుపుకొట్టే అగ్నిపథ్ పథకం రద్దు చేయాలి

**జనగామ జూన్ 25 (ప్రజామంటలు):** ఏఐసిసి, టీపీసీసీ పిలుపు మేరకు టీపీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు సోమవారం జనగామ పట్టణ చౌరస్తాలో జనగామ పట్టణ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అగ్నిపథ్ ను రద్దు చేయాలని సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. దీక్ష శిబిరాన్ని టీపీసీసీ కార్యదర్శి కంచ రాములు, జనగామ



పట్టణ మున్సిపల్ మాజీ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణ రెడ్డి, జనగామ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసాన్ పల్లి లింగాజి ప్రారంభించగా టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి ధర్మ సంతోష్ రెడ్డి, జడ్పిటిసి మద్దూరు గిరికొండల్ రెడ్డి, జిల్లా నాయకులు ఉడత రవి యాదవ్ హాజరయ్యారు. మహిళ కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిరా, జనగామ పట్టణ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కల్యాణి జనగామ మండల మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని జయ, బచ్చన్నపేట మండల అధ్యక్షురాలు వేణు వందన, జనగామ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాజిద్, బచ్చన్నపేట మాజీ ఎంపిటిసి బుర్ర బలమణి, జయ మల్లేశ్ దీక్ష శిబిరంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు పలువురు మాట్లాడుతూ.... అగ్నిపథ్ పథకం తెచ్చి ఎంతోమంది యువకులు ఆగ్రహానికి గురై కొన్ని వేల కోట్ల రూపాయలు ప్రజా నష్టం కలిగే విధంగా కారణమైన బీజేపీ ప్రభుత్వం తెలివి తక్కువ తనానికి నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. భారత సైనిక దళాల్లో నియామకాలకు కేంద్రం తీసుకొచ్చిన కొత్త పథకం అగ్నిపథ్ రాజేసిన అగ్గి కార్చిచ్చుగా మారి దేశమంతటినీ కమ్మేసిందని, నాలుగేళ్లు సైనిక సర్వీసులో ఉంచి ఆ తరువాత ఇంటికి పంపిస్తే తమ భవిష్యత్తు ఏమవుతుందని? ఆర్మీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు దేశవ్యాప్తంగా ప్రశ్నిస్తూ నిరసనలు చేస్తున్నారని గుర్తు చేశారు. ఆర్మీలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగులను తీసుకోవడం మంచిది కాదని,ఇది దేశ భద్రతకు పెద్ద ప్రమాదమని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పించిన బీజేపీ ప్రభుత్వం ఒంటెత్తు పోకడలతో పనికిరాని పథకాలు ప్రవేశ పెడుతుందని అన్నారు. రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. అంతరం దీక్ష శిబిరాన్ని పిఎసిఎస్ వడ్లకొండ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి సందర్శించి దీక్షను విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో లోక్కుంట్ల ప్రవీణ్, వేమళ్ల రాజనర్సింహారెడ్డి, కొన్నే మహేందర్ రెడ్డి, వంచ వెంకట్ రెడ్డి, సిలువేరు సంపత్, సంపత్, చందన రెడ్డి,బడికె కృష్ణ స్వామి, కట్ట కృష్ణ, కాముని శ్రీనివాస్, యాట క్రాంతి కుమార్, పిట్టల సతీష్, కర్రె రాజశేఖర్, సలేంద్ర శ్రీనివాస్, పరుశురాములు ఆకుల లక్ష్మయ్య, నామాల రాజు,మహాత్మా చారి, ముకేర యాదగిరి, బాలమైసయ్య, బండారు శ్రీనివాస్, లింగాల శ్యామ్ సుందర్ రెడ్డి ఉదయ్ గౌడ్, శ్రావణ్ రెడ్డి, పలుచని రమేష్, ముడికే కుమార్, అర్జుల అరుణ్ రెడ్డి ,బుచ్చల మహేందర్, పులూరి రాజు, జాఫర్ షరీఫ్, యాసిన్ ఎదునూరి కృష్ణ, నిరతి కిశోర్, వేముల మల్లేశ్, సుల్తాన్ గోవిందరెడ్డి, భిక్షపతి, మహేశ్వరం శ్రీనివాస్, పిట్టల రాజు, కందుల రాజు, కొండ శ్రీనివాస్, చింతకింది నరేష్, ఫయాజ్, నంపెల్లి అశోక్, సొడ మహేష్, ఆజం, పిక్క బీరప్ప, బెజడి హరీష్, కసాని విజయ్, మేకల సమ్మయ్య, విజయ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

**కరీంనగర్ జూన్ 27 (ప్రజామంటలు):** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణి లో ఆర్డిఓకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి శనిగరపు రజినీకాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు ప్రారం



భమై 16 రోజులు ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లో పూర్తిగా విఫలమైంది విద్యార్థులు తీవ్ర సమస్యలతో విద్యను చదువుతున్నారు సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాల ఉన్నాయని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ సర్వేలో వెలికి వచ్చాయి. కనీసం విద్యార్థులకు చదువుకోడానికి పుస్తకాలు కూడా ఇప్పటివరకు రాలేదు.

ఈ విధంగా ఉంటే విద్యార్థులు ఏ విధంగా విద్యను అభ్యసిస్తారు అని మండిపడ్డారు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రతి విద్యార్థికి పూర్తిస్థాయిలో పుస్తకాలు అందించాలని అని అన్నారు. కరోన కారణంగా రెండు సంవత్సరాల నుండి విద్యార్థులకు యూనిఫామ్స్ సకాలంలో అందించడం లేదు. ఇప్పటివరకు కూడా విద్యార్థులకు అందని పరిస్థితి కనిపిస్తున్నది. కావున విద్యార్థుల కొలతలు తీసుకుని ఉచితంగా యూనిఫామ్స్ అందించాలని కోరుతున్నాను. కనీసం విద్యార్థులకు తాగడానికి మంచినీరు సౌకర్యం కూడా లేని పరిస్థితి ఉన్నది అదే విధంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా లేవు దీనివల్ల విద్యార్థులు కనీసం వాటర్ తాగుదామంటే భయపడుతున్న పరిస్థితి ఉన్నది రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి అధిక బడ్జెట్ కేటాయించి మూత్రశాలలు మరుగుదొడ్లు మంచినీటి సౌకర్యం కల్పించాలని అదేవిధంగా జోనల్ వ్యవస్థ ఏర్పడిన తర్వాత కొన్ని పాఠశాలల్లో కనీసం తరగతులు బోధించడానికి ఉపాధ్యాయులు లేని పరిస్థితి ఉన్నది తక్షణమే ఉపాధ్యాయులు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించలి 16 మండలాలు ఉంటే కేవలం ఐదుగురు ఎంఈఓలు మాత్రమే ఉన్నారు. ప్రతి మండలానికి రెగ్యులర్ ఎంఈఓ ను నియమించాలి. కనీసం పర్యవేక్షణ లేకుండా ప్రభుత్వ స్కూల్లో సమస్యలను ప్రభుత్వ దృష్టికి ఏ విధంగా తీసుకుపోతారు అని మండిపడ్డారు. కుల సమస్యలు పరిష్కరించకుంటే విద్యార్థులను కలుపుకొని కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నగర అధ్యక్షులు తిప్పారపు రోహిత్, ఉపాధ్యక్షులు రత్నం, సురేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# దేశ రక్షణ రంగాన్ని ప్రైవేటుపరం చేయాలని చూస్తున్న నరేంద్ర మోడీ : పొన్నం ప్రభాకర్

**కరీంనగర్ జూన్ 27 (ప్రజామంటలు):** ఇటీవల కేంద్ర ప్రభుత్వం, సాయుధ బలగాల పూర్వ సంప్రదాయాలు మరియు నైతికతలను తారుమారు చేస్తూ, వారి మనోధైర్యాన్ని దెబ్బ తీసే విధంగా ప్రకటించిన అగ్నిపథ్ పథకం పై దేశవ్యాప్తంగా పెద్దఎత్తున యువకులు సైనిక అభ్యర్థుల ఆగ్రహానికి మరియు నిరసనలకు దారితీసింది. ఈ



కేంద్ర ప్రభుత్వ అనాలోచిత పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, దేశ వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో సత్యాగ్రహ దీక్ష చేపట్టాలని ఏఐసీసీ ఇచ్చిన ఆదేశాల మేరకు కరీంనగర్ పట్టణంలోని ఇందిరా చౌక్ వద్ద శాంతియుత సత్యాగ్రహం చేపట్టారు.ఈ కార్యక్రమానికి మాజీ పార్లమెంట్ సభ్యులు పొన్నం ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ.... దేశంలో రెండు అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఉన్నది ఒకటి దేశంలో రైతుకు రెండవది జవాన్ కు కానీ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ రెండు అంశాలకు సంబంధించి పూర్తిగా అన్యాయం చేసే ఒక ప్రక్రియ కొనసాగిస్తున్నది, ముందుగా రైతులకు సంబంధించి మూడు బిల్లులను తీసుకువచ్చి దేశవ్యాప్తంగా రైతాంగాన్ని ఇబ్బంది పెట్టింది. దాని తర్వాత దేశ వ్యాప్త రైతుల ఆందోళనలతో ఆ బిల్లులను ఉపసంహరించుకోవడం జరిగింది.మళ్లీ ఇప్పుడు దేశ రక్షణలో ఉపయోగపడేటటు వంటి సైనికులకు సంబంధించిన అంశంలో కేవలం నాలుగు సంవత్సరాల కాలపరిమితితో దేశ సైన్యంలో నియామకాలు చేపట్టే విధంగా అగ్నిపథ్ అనే ఒక పథకాన్ని తీసుకు రావడం జరిగింది, దీని ద్వారా కూడా మొత్తం రక్షణ రంగాన్ని నిర్వీర్యం చేసే ప్రక్రియ జరుగుతున్నది. ఇది రాచరికం కాదు ఏదైనా ఒక విధానపరమైన నిర్ణయం తీసుకోవాలనుకుంటే పార్లమెంట్ ద్వారా గాని, ప్రజాస్వామ్యంలో ఉన్నటువంటి అన్ని రాజకీయ పార్టీలను సమీక్షించిన తర్వాత ఇటువంటి నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఉన్నది, కానీ ఒక నియంత లాగా ఈ దేశ సైనిక వ్యవస్థను మొత్తం ప్రైవేటుపరం చేయాలని, ఇప్పటికే దేశంలో అనేక కంపెనీలను, అనేక వ్యవస్థలను ప్రైవేటీకరణ చేస్తూ అదానీ, అంబానీలకు దారాదత్తం చేస్తూ వారికి అప్పజెప్పడం జరిగింది. ఇదే విధంగా నరేంద్ర మోడీ మొన్న వ్యవసాయ రంగాన్ని నేడు రక్షణ రంగాన్ని ప్రైవేటు పరం చేయాలని చూస్తున్నారు. దీనిని కాంగ్రెస్ పార్టీతో సహా దేశంలోని ప్రతి యువకుడు ఖండిస్తున్నారు. తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.కొన్ని ప్రాంతాలలో సైన్యంలో చేరాలనుకునే యువత హింసకు పాల్పడ్డారు.హైదరాబాదులో జరగనున్న బిజెపి జాతీయ స్థాయి సమావేశాలను ఉద్దేశించి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ తెలంగాణలో గద్దలు వేసిన తెలంగాణ ప్రజలు భారతీయ జనతా పార్టీని ఆదరించరు. యువత కూడా నరేంద్ర మోడీ పర్యటనను ఎక్కడికక్కడ అడ్డుకునే విధంగా స్వచ్చందంగా తరలి రావాలని కోరుతున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్రెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నాయకులు ఎండి తాజ్, శ్రావణ్ నాయక్, మొన్నేని రోహిత్ రావు, మడుపు మోహన్, రాచకొండ ప్రభాకర్, మల్యాల సుజిత్ కుమార్, అబ్దుల్ రెహమాన్, చెర్ల పద్మ, గుండాటి శ్రీనివాసరెడ్డి, గడ్డం విలాస్ రెడ్డి, ఎస్ఎస్ మోసిన్, నిహాల్ హైమద్, లింగంపల్లి బాబు, బోనాల శ్రీనివాస్, సయ్యద్ అఖిల్, కుర్ర పోచయ్య, బోనాల మురళి, సాయిల రాజు, సలీముద్దున్, రామిడి తిరుపతి, వెన్న రాజ మల్లయ్య, బొబ్బిలి విక్టర్, ఎం డి చాందు, మామిడి సత్యనారాయణ రెడ్డి, కొరివి అరుణ్ కుమార్, బాల బద్రి శంకర్, దండి రవీందర్, దన్న సింగ్, మేకల నరసయ్య, షహేన్నా, షబానా మహమ్మద్, యనమల మంజుల ,ఎర్ర శ్రీనివాస్, ఏఁజ్రా ,ముక్క భాస్కర్, జిడి రమేష్, కూస రవీందర్, నూనె గోపాల్ రెడ్డి, మొసళ్ల రామ్ రెడ్డి, పోరండ్ల రమేష్ ,కలీం, కామీడీ రామ్ రెడ్డి ,ఎస్ డి అజ్మత్, కాంతయ్య, సుంకరి గణపతి, ఫిరోజ్, నాగరాజు, కుంభాల రాజ్కుమార్, షాహిద్, పులి విజయ్, జీలకర్ర రమేష్, హనీఫ్, మన్నె ప్రసాద్ పాల్గొన్నారు.

# విగ్రహ ఆవిష్కరణ కొరకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే రసమయి

**తిమ్మాపూర్ జూన్ 27 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం ఇందిరానగర్ గ్రామంలో సర్పంచ్ కాటిక వినోద-రాజమౌళి అధ్వర్యంలో ఆదివారం భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డా.బీఆర్.అంబేద్కర్ గారి విగ్రాహ అవిష్కరణ కొరకై భూమిపూజ మహొత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దళిత బంధువు రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్మెన్ మరియు



మానకొండూర్ శాసనసభ్యులు డా.రసమయి బాలకిషన్ పాల్గొని గ్రామంలో కన్నుల పండుగగా నిర్వహించారు. ఎమ్మెల్యే రసమయిని ఇందిరానగర్ పాలకవర్గం, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నేతలు జైభీం అంటూ నినాదాలు చేస్తూ అంబేద్కర్ గారి విగ్రహ భూమిపూజ వద్దకు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే రసమయి. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కొరకు భూమిపూజ చేసి అంబేద్కర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక యంపిటిసి కొత్తతిరుపతిరెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు రావుల రమేష్, రాష్ట్ర ఇఫ్-కో-డైరెక్టర్ కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటిచైర్మన్ ఎలుకఅనిత-అంజనేయులు, వైస్ యంపిపి ల్యాగల వీరారెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవిందర్ రెడ్డి, సర్పంచ్లులు బోయిని కొంరయ్య, మీసాల అంజయ్య, మేడిఅంజయ్య, యంపిటిసి కవ్వంపల్లిపద్మ, మండలపరిషత్ కో-అప్షన్ సభ్యులు సయ్యద్ తాజొద్దీన్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు సంపత్ ఉప సర్పంచ్లు దామ అనురాధ కుమార్, బేతి శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షులు ఆవుదుర్తి రాంకిషన్ గ్రామపంచాయితి పాలకవర్గం, దళితసంఘాలు, మండల మరియు గ్రామ ప్రజా ప్రతినిధులు, తెరాసశ్రేణులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్ పట్టణం లో మల్లె చెట్టు చౌరస్తా కు చెందిన జన జాగృతి రిపోర్టర్ ఠాకూర్ నర్సింగ్ తల్లి రుక్మిణీ బాయి మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన సామాజిక సేవకురాలు మంజులా రెడ్డి.



జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ఛైర్మన్ పత్తిపాక వెంకటేష్ మరియు పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్. పాల్గొన్న డీసీఎంఎస్ ఛైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీటీసీ సుధారాణి, ఎంపీపీ లక్ష్మి, సర్పంచ్లు, ఎంపీటీసీలు, పాక్స్ చైర్మన్లు మరియు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

# అగ్నిపథ్‌ను వెంటనే రద్దు చేయండి
### సికింద్రాబాద్ లో సత్యాగ్రహ దీక్ష చేసిన మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి

**సికింద్రాబాద్ జూన్ 27 (ప్రజామంటలు):** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకాన్ని ఉపసంహరించుకోవాలని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద




సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు ఆయన నాయకత్వం వహించారు. భారత్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. భారత సైన్యం ప్రపంచంలోనే అత్యుత్తమ ఆర్మీగా పేరు తెచ్చుకుందని, అగ్నిపథ్ పథకం ద్వారా నియామకాలు దీర్ఘకాలంలో భారత సైన్యం నాణ్యతకు హానికరమని ఆయన అన్నారు. ఈ పథకానికి వ్యతిరేకంగా విస్తృత ప్రదర్శనలు జరిగాయని, ఇది 4 సంవత్సరాల తర్వాత పంపబడే 75% వ్యక్తులకు ఎటువంటి ఉద్యోగానికి హామీ గాని ఎటువంటి పెన్షన్‌ను గాని ఇవ్వకపోవడం దారుణమన్నారు. రిక్రూట్‌మెంట్ కోసం ఇప్పటివరకు అనుసరిస్తున్న విధానం చాలా విజయవంతమైందని, మోడీ ప్రభుత్వం తన పెన్షన్ భారాన్ని తగ్గించుకోవడానికి మాత్రమే దీనిని సంస్కరణగా ప్రవేశపెట్టిందని మర్రి శశిధర్ రెడ్డి దుయ్యబట్టారు. ఈ దీక్షలో సనత్ నగర్ కు చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్కై ఫౌండేషన్ 207వ అన్నదానం

**సికింద్రాబాద్ జూన్ 27 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ పద్మారావునగర్ కు చెందిన స్కై ఫౌండేషన్ నిర్వాహకులు ఆదివారం 207 వ అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిటీలోని పలు ప్రధాన



రహదారుల్లోని ఫుట్ పాత్ లపై దుర్భర జీవితం గడుపుతున్న అభాగ్యులకు ఫుడ్డు ప్యాకెట్లను అందచేశారు. ప్రభుత్వం సిటీలోని అనాధలు, అభాగ్యులపై దృష్టి సారించి వీరికి ఆశ్రయం కల్పించి, తగిన పని కల్పించాలని, ఇందుకు ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక రూపకల్పన చేయాలని స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ డా.వై.సంజీవ్ కుమార్ ముఖ్యమంత్రి కేసీఆర్ కు పంపిన లేఖలో కోరారు. ఫుడ్డు డ్రైవ్ లో ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కుమారి ఓ. పావని, మెంబర్స్ నిశాంత్, ఇర్ఫాన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



జులై 3 న, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరేడ్ గ్రౌండ్లో జరిగే భారీ బహిరంగ సభ విజయవంతం కావాలని సోమవారం కొత్తపల్లి షిరిడి సాయిబాబా టెంపుల్‌లో ప్రత్యేక పూజలు జరిపించిన భీమదేవరపల్లి మండల బీజేవైఎం అధ్యక్షులు బొల్లంపల్లి శ్యామ్

## విద్యార్థులకు నోట్ బుక్స్, ప్లేట్స్ పంపిణీ చేసిన మంజులా రెడ్డి

**హుస్నాబాద్ జూన్ 27 (ప్రజామంటలు):** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణం ఎల్ల బజార్ లోని ప్రాథమిక పాఠశాలలో సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజుల రెడ్డి విద్యార్థులకు నోట్ బుక్స్, ప్లేట్స్ ను అందించి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. పాఠశాలలో చదువుతున్న 55 మంది విద్యార్థులకు ప్లేట్లు, 150 నోటు పుస్తకాలు, 100 పెన్నులు, 55 ఎగ్జామ్స్ ప్యాడ్లను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి పంపిణీ చేశారు. విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్, ప్లేట్స్ అందించిన సామాజిక సేవకురాలు మంజులా రెడ్డికి ఉపాధ్యా యులు, తల్లి దండ్రులు ధన్యవాదాలు తెలిపారు. మంజుల రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, శిక్షణ



పొందిన ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నా రని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఇంకా మెరుగైన వసతులు కల్పించాల న్నారు. ఇంకా పాఠశాలలో టాయిలెట్స్ ల నిర్మాణానికి తనవంతు సహాయాన్ని అంది స్తానని, మంచినీటి సౌకర్యం ఏర్పాటుకి తోడ్పాటు అందిస్తానన్నారు .ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మనీల, ఉపాధ్యాయులు రమదేవి, శ్రీకాంత్, ఎస్ఎంసి చైర్మన్ లత, మంజులక్క యువసేన సభ్యులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



# కనిపించని కోవిడ్ నిబంధనలు

**హుస్నాబాద్ జూన్ 27 (ప్రజామంటలు):** హుస్నాబాద్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులు కోవిడ్ నిబంధనలను గాలికి వదిలేసిన పరిస్థితులు గోచరించాయి. ఒకవైపు తెలంగాణ రాష్ట్రంలో కోవిడ్ కేసులు అధికంగా పెరుగుతున్న తరుణంలో సర్వేసభ్య సమావేశానికి హాజరైన అధికారులు మరియు సర్పంచులు మాస్కులు ధరించకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధంగా కోవిడ్ నిబంధనలను అధికారులు ప్రజా ప్రతినిధులు గాలికి వదిలేస్తే కోవిడ్ మహమ్మారి విజృంభించే ఆస్కారం ఎక్కువగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.

# చారిత్రక కట్టడాలకు పూర్వ వైభవం

**ఆగస్ట్ 15 నాటికి మెట్లబావి పునరుద్ధరణ పనులు పూర్తి**

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

**సికింద్రాబాద్ జూన్ 27 (ప్రజామంటలు):** చారిత్రక కట్టడాలకు మరమ్మతు పనులు నిర్వహించి, వాటికి పూర్వ వైభవం తీసుకువస్తున్నట్లు మంత్రి తలసాని



శ్రీనివాసయాదవ్ పేర్కొన్నారు. సోమవారం బన్సీలాల్ పేట లోని పురాతన మెట్లబావిని ఆయన అధికారులతోకలసి సందర్శించి, అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో నగరంలోని మెట్టబావులన్నీ పునరుద్దరిస్తున్నామని, బన్సీలాల్ పేటలోని చారిత్రక మెట్లబావి పునరుద్దరణ పనులను ఆగస్ట్ 15 నాటికి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలిచిన పురాతన నిర్మాణాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్తుందన్నారు. మెట్లబావి ప్రాంతంలో అభివృద్ధి పనులకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను వేరొక చోటకు తరలించాలని ఆదేశించారు. రోడ్డు నిర్మాణం కు ముందే వాటర్, సీవరేజ్ లైన్ పనులు ఉంటే పూర్తి చేయాలని జీహెచ్ఎమ్సీ అధికారులను ఆదేశించారు. మెట్ల బావి పరిసరాలను ఎంతో సుందరంగా తీర్చిదిద్దుతామని, పర్యాటకులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేసి, ఓ మంచి టూరిజం స్పాట్ గా డెవలప్ చేస్తున్నామని వివరించారు. మంత్రి వెంట కార్పొరేటర్ హేమలత, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డీసీ ముకుంద రెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

తెలంగాణ రాష్ట్ర చలన చిత్రాభివృద్ధి సంస్థ అధ్యక్షులుగా నియామకమైన కూర్మాచలం అనిల్ ను పదవి చేపట్టిన సందర్భంగా కలిసి, అభినందనలు తెలిపిన చిన్ననాటి స్నేహితుడు, సహవిద్యార్థి, తెరాస పార్టీ టీఆర్ఎస్ తెలంగాణ ఉద్యమకారుడు మరియు తెలంగాణ ముస్లిం మైనార్టీ వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ఖియాసుద్దీన్ ఇజార్



# వర్గీకరణను విస్మరించి అధికారంలోకి రావడం పగటి కలే

**జనగామ జూన్ 27 (ప్రజామంటలు):** తెలంగాణలో మెజారిటీ జనాభా గలిగిన మాదిగ, మాదిగ ఉపకులాల ప్రధాన ఆకాంక్ష అయిన ఎస్.సి రిజర్వేషన్ల వర్గీకరణ సమస్యను పరిష్కరించకుండా అధికారంలోకి రావాలనుకోవడం పగటి కలే అవుతుందని, సంపూర్ణ అధికారం ఉండి కూడా 8 ఏళ్లుగా కాలయాపన



చేయడం చూస్తుంటే విలువలు, విశ్వసనీయత, ఇచ్చిన మాటకు కట్టుబడే నైజం బీజేపీకి లేదని ద్రోహం, వంచన,దగ, మోసం సహజ గుణాలుగా మార్చుకుందని వర్గీకరణ చేస్తారా..? మోసగాళ్లుగా చరిత్రకెక్కుతారా తేల్చాల్సిందేనని ఎం.ఎస్.ఎఫ్. జాతీయ ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ చేపట్టిన మాదిగల సంగ్రామ పాదయాత్ర సోమవారంతో 20వ రోజుకు చేరుకుంది. ధర్మకంచ, సంజయ్ నగర్, బుడగ జంగాల కాలనీ, అంబేద్కర్ నగర్, మిషన్ కాంపౌండ్ మీదుగా ప్రెస్టిన్ కాలనీకి చేరుకుంది. జనగామ టౌన్లో కుల పెద్దలు, మాదిగ ప్రజా ప్రతినిధులు, ఎం.ఎస్.పి నేతలు యాత్రకు ఘన స్వాగతం పలికారు. ఎం.ఎస్.పి.జనగామ జిల్లా ఇంచార్జి ఇనుముల నర్సయ్య మాదిగ, ధర్మకంచ ప్రజా ప్రతినిధులు మల్లిగారి రాజు, గాదెపాక రామచందర్, బొట్ల చిన్న శ్రీనివాస్, పెద్ద శ్రీనివాస్, ఊడుగుల యాదగిరి, కొండయ్య, సుధాకర్, ఎం.ఇ.ఎఫ్ జాతీయ నేత చెప్పాల ప్రసాద్ మాదిగ, యాత్రకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాటకు, పార్టీ తీర్మానాలకు, విలువ ఇవ్వని నైతికత లేని పార్టీగా బీజేపీ నిలబడ్డదని, ఇచ్చిన మాటకు కట్టుబడే తత్వం, నీతి, నిజాయితీ, నిబద్ధత ఉంటే ఏనాడో వర్గీకరణ సమస్య పరిష్కారం అయ్యేదని, అందరూ అనుకూలంగా ఉన్నా కూడా పరిష్కారం కాకపోవడానికి కారణం బిజెపి నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ ద్వారానే మాదిగ జాతికి, ఉప కులాలకు విముక్తి అని, ఇట్టి సమస్యపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న కేంద్రంపై సమర శంఖం పూరించేందుకు సమస్త మాదిగ, మాదిగ ఉపకులాల సమాజం సిద్ధంగా ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో పాదయాత్ర బృందం సభ్యులు ఎమ్మార్పీఎస్ జనగామ జిల్లా కన్వీనర్ పైసా రాజశేఖర్ మాదిగ, జిల్లా కోకన్వీనర్ ఇనుముల అనిల్ మాదిగ, ఎంఎస్ఎఫ్ ఎమ్మార్పీఎస్ నాయకులు పాలమాకుల శ్రావణ్ కుమార్ మాదిగ, పొట్టి రమేష్ మాదిగ, మూటకోరు వెంకటేష్ మాదిగ, అల్వాల శ్రీకాంత్ మాదిగ, బక్క వివేక్ మాదిగ, సాగర్ మాదిగ, ప్రవీణ్ మాదిగ, ఎం.ఎస్పీ నేతలు చంచు రాజు మాదిగ, నిర్మల భాస్కర్ మాదిగ, గువ్వల రవి మాదిగ, కన్నారపు పరశురాం మాదిగ, వి హెచ్ పి ఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బిర్రు నగేష్ మాదిగ, యాదగిరి మాదిగ, గుర్రం శ్యామసన్ మాదిగ, నరసింహ పాల్గొన్నారు.

# ఎట్టకేలకు గాంధీ డైట్ క్యాంటీన్ కొత్త బిల్డింగ్‌కు మోక్షం

**రూ.2.70 కోట్ల హెచ్డీఎస్ నిధుల కేటాయింపు**

**ఇక టీఎస్ఎమ్ఎస్ఐడీసీ టెండర్ల ప్రక్రియనే ఆలస్యం**

**సికింద్రాబాద్ జూన్ 27 (ప్రజామంటలు):** గాంధీ ఆసుపత్రిలో పేషంట్లు, డ్యూటీ డాక్టర్లకు ఆహారాన్ని అందించే డైట్ క్యాంటీన్ కష్టాలు తీరనున్నాయి. గాంధీ మెయిన్ బిల్డింగ్ సెల్లార్ లో ప్రమాదకరమైన స్థితిలో కొనసాగుతున్న డైట్ క్యాంటీన్ కు కొత్త భవనం రాబోతుంది. ఈమేరకు డైట్ కొత్త బిల్డింగ్ నిర్మాణానికి ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ (హెచ్డీఎస్) నిధులను ప్రభుత్వ ఆదేశాల మేరకు కేటాయించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొ.రాజారావు వెల్లడించారు. జీ ప్లస్ 2 అంతస్తులతో నిర్మించనున్న కొత్త డైట్ బిల్డింగ్ నిర్మాణానికిగాను రూ 2.70 కోట్ల అంచనాలతో తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎమ్ఎస్ ఐడీసీ)కి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. టీఎస్ఎమ్ఎస్ ఐడీసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ-ప్రొక్యూర్మెంట్ టెండర్ల ప్రక్రియ తర్వాత ఎమర్జెన్సీ బిల్డింగ్ వెనక వైపున నిర్దేశించిన స్థలంలో భవన నిర్మాణ పనులు మొదలవుతాయన్నారు. బిల్డింగ్ నిర్మాణ వ్యవహారం టీఎస్ఎమ్ఎస్ఐడీసీ పర్యవేక్షిస్తుందని, కేవలం నిధులు మాత్రం గాంధీ హెచ్డీఎస్ నుంచి ఇవ్వడం తమ పని అని అన్నారు.



**డైట్ క్యాంటీన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి హరీష్ రావు**

**దినదిన గండంగా డైట్ క్యాంటీన్:**

ప్రస్తుతం గాంధీ మెయిన్ బిల్డింగ్ సెల్లార్ లో నడుస్తున్న డైట్ క్యాంటీన్ వంటశాల దినదిన గండంగా మారింది. డైట్ క్యాంటీన్లో ప్రతి రోజు ఉదయం సాయంత్రం వంట చేయడానికి ఎల్పీజీ సిలండర్లు వినియోగిస్తారు. ఎప్పుడు దాదాపు 20 సిలండర్లు సెల్లార్ లోనే సిద్దంగా ఉంటాయి. ఏదేని అనుకోని ప్రమాదం జరిగితే భారీ విస్ఫోటనం సంబవించే అవకాశం ఉంది. అలాగే సెంట్రల్ డ్రేనేజీ వ్యవస్థ సెల్లార్ లోనే ఉండటంతో మురికినీరు సక్రమంగా బయటకు వెళ్లకపోవడంతో వంటశాల లోకి మురికి నీరు వస్తుంది. దాంతో పాటు ఎలకలు, బొద్దింకలు విపరీతంగా పెరిగాయి. దుర్వాసన మధ్య నిత్యం డైట్ క్యాంటీన్ లో వంటలు చేస్తున్నారు. వంట పొగతో అక్కడి సెల్లార్ లో ఉన్న మిగితా డిపార్ట్మెంట్ సిబ్బందికి సరిగా ఊపిరాడక శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయి. ఇటీవల టీఎస్ఎమ్ఎస్ ఐడీసీ ఆధ్వర్యంలో డైట్క్యాంటీన్ సెల్లార్ ఫ్లోరింగ్




**సెల్లార్‌లో ప్రమాదకర స్థితిలో కొనసాగుతున్న డైట్ క్యాంటీన్**

పనులు నిర్వహించారు. ఈ పనులు పూర్తిగా నాసిరకంగా ఉండి అప్పుడే ఫ్లోరింగ్ పైన ఇసుక తేలడంతో విచారణ జరిపిన పాలన యంత్రాంగం అధికారులు ఈ పనులకు సంబందించిన రూ 4 లక్షల బిల్లులను నిలిపివేశారు. తిరిగి ఫ్లోరింగ్ పనులను నాణ్యతతో చేస్తామన్న సంస్థ అధికారులు, కాంట్రాక్టర్ గాని జాడే లేకుండా పోయారు. ఫ్లోరింగ్ లోని ఇసుక వంటలపై పడి పేషంట్లకు అందించే ఫుడ్డు ప్రమాదకరంగా మారేప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే ఛీఫ్ డైటీషియన్ సంబందిత అధికారులకు ఈ సమస్యపై లేఖలు కూడ రాసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా ఉంది.

**భూమి పూజ చేసి నెల అయింది.. పత్తాలేని టెండర్లు...**

గత నెల 22 న హెల్త్ మినిస్టర్ హరీష్ రావు మరో మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ తో కలసి డైట్ క్యాంటీన్ కొత్త భవన నిర్మాణ ప్రతిపాదిత స్థలంలో భూమిపూజ కూడ నిర్వహించారు. అయితే నెల రోజులు గడిచినప్పటికీ ఇంతవరకు టీఎస్ఎమ్ఎస్ఐడీసీ అధికారులు టెండర్ ప్రక్రియ ప్రారంభించకపోవడం గమనార్హం. ఎలాగు గాంధీ హెచ్డీఎస్ నిధులతో పాటు నిర్మాణ స్థలం కూడ సిద్దంగా ఉన్నందున ఇక టీఎస్ఎమ్ఎస్ఐడీసీ అధికారులు తాత్సరం చేయకుండా వెంటనే డైట్ క్యాంటీన్ కొత్త బిల్డింగ్ నిర్మాణానికి టెండర్లు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. టెండర్ల ప్రక్రియ ముగిసిన వెంటనే పనులు వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది. దినదిన గండం..నూరేళ్ళ ఆయుశ్శు...లాగా ఏదేని ముప్పు వాటిల్లకముందే తొందరగా డైట్ క్యాంటీన్ కొత్త బిల్డింగ్ నిర్మించాలని అంతా కోరుతున్నారు.

# జనగామ జిల్లా అభివృద్ధిపై చర్చ

**జనగామ జూన్ 27 (ప్రజామంటలు):** జనగామ జిల్లా ఏర్పడి ఆరు సంవత్సరాలు పూర్తైన అభివృద్ధి లేదని తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ జనగామ జిల్లా జాక్ ఆధ్వర్యంలో జనగామ అభివృద్ధి పై చర్చ అనే అంశంపై విస్తృతమైన చర్చ నిర్వహించారు. ఎస్.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాల జనగామలో సోమవారం జరిగిన కార్యక్రమానికి జనగామ జిల్లా జాక్ కన్వీనర్ మంగళంపల్లి రాజు అధ్యక్షత వహించారు. ఉద్యమకారులు కవులు కళాకారులు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు తమ విలువైన అభిప్రాయాలను వెల్లడించారు. సాదిక్ పౌండేషన్ చైర్మన్, న్యాయ వాది సాదిక్ అలీ మాట్లాడుతూ ఎం.ఎల్.ఏ ముత్తిరెడ్డి చౌరస్తాకు రా అభివృద్ధి, 100 అంశాలపై చర్చిద్దామని సవాల్ విసిరారు. కవి హృదయం సాహిత్య వేదిక జనగామ జిల్లా అధ్యక్షులు సోమేశ్వరచారి మాట్లాడుతూ.... జిల్లా అభివృద్ధికి అడ్డుపడుతున్న మూలాలను గుర్తించి సబ్బండ వర్గాలను కలుపుకుని చైతన్యం చూపాలన్నారు. జనగామ రచయితల సంఘం (జరసం) అధ్యక్షులు అయిలా సోమ నర్సింహా చారి మాట్లాడుతూ.... జనగామ ఎమ్మెల్యే స్థానికుడైతే జనగామ అభివృద్ధి జారేదని అన్నారు. టిజివిపి రాష్ట్ర కార్యదర్శి పిట్టల సురేష్ మాట్లాడుతూ చదువుకున్న, స్థానిక ఎమ్మెల్యే ఉంటే జనగామ యువకులు పోరాడాల్సిన అవసరం ఉండేది కాదని తెలిపారు.కాంగ్రెస్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



దాసరి క్రాంతి మాట్లాడుతూ.... జనగామ స్థానికున్ని గెలిపించుకునే వరకు యూత్ కాంగ్రెస్ పోరాడుతుందని తెలిపారు. బిజెపి జిల్లా ప్రచార కార్యదర్శి పెద్దోజు జగదీశ్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి ఐక్య పోరాటం చేయడానికి పార్టీ కలిసి వస్తుందని తెలిపారు. టివివి రాష్ట్ర అధ్యక్షుడు మేకల సమ్మయ్య మాట్లాడుతూ వికలాంగులుగా మేము కూడా అబివృద్ది ఉద్యమంలో పాల్గొంటామని తెలిపారు. బి.ఎస్.పి జిల్లా కన్వీనర్ నిర్మలా రత్నం మాట్లాడుతూ అన్ని పనులకు ఉద్యమమే జనగామ ప్రజల వంతు అవుతుందని, స్థానిక ఎమ్మెల్యే ని గెలిపించుకోవడంతోనే జనగామ అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. తెలంగాణ సామాజిక చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు వీరస్వామి మాట్లాడుతూ బహుజన జనాభా ఎక్కువ ఉన్న జనగామలో అగ్రవర్ణాల ఆధిపత్యం వుండొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజివిపి జిల్లా అధ్యక్షుడు గన్ను కార్తీక్, బి.ఎస్.పి తుర్కపల్లి కుమార్, చందు, డిజివిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగ కౌశిక్, వెంపటి అజయ్, బింగి నర్సింహులు పాల్గొన్నారు.

# "అగ్నిపత్"ను వెనక్కి తీసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం

- **యువకులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించాలి**
- **రక్షణ మంత్రిపై కేసు నమోదు చేయాలి**
- **డిసిసి అధ్యక్షులు లక్ష్మణ్ కుమార్ డిమాండ్**

**ధర్మపురి జూన్ 27 (ప్రజామంటలు):** నిరుద్యోగ యువకుల జీవితాల్లో అగ్ని రాజేసిన సైనికనియామకం కోసం, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన "అగ్నిపత్ " ను వెంటనే వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు, ధర్మపురి నియోజకవర్గం ఇంచార్జి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు అగ్నిపత్ ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రాల్లో చేపట్టిన ధర్మపురి సత్యాగ్రహ దీక్షలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్, పిసిసి కార్యదర్శి వైద్యుల అంజనీకుమార్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, నియోజకవర్గం ఇంచార్జి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈసాందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ సికింద్రాబాద్ అల్లర్లలో నిరుద్యోగులపై పెట్టిన అక్రమకేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశం కోసం సైనికులు తమ ప్రాణాలనే పణంగా పెట్టి కాపాడుతుంటే వారి నియామకాల్లో చిచ్చుపెట్టారని ఆరోపించారు. దేశరక్షణ కోసం నియామకం చేసే సైనికుల విషయంలో కేంద్రం ముందే ప్రతిపక్షలతో చర్చించాల్సి ఉండేదాని అభిప్రాయపడ్డారు. వీరిని నాలుగేళ్ళ కోసం కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకురావడానికి ఉద్దేశించిన అగ్నిపత్ ను వెంటనే ఉపశ%శీ%హరించి, కేసులను ఎత్తివేయాలన్నారు. 50 మంది నిరుద్యోగులపై నాన్ బేయిలాబుల్ కేసులు పెట్టడంతో వారి జీవితాలు ప్రశ్నరతకంగా మారాయని చెబుతూ అగ్నిపత్ తీసుకొచ్చిన రక్షణ మంత్రిపై కేసు పెట్టాలని లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. అగ్నిపత్ విషయంలో జరిగిన అల్లర్లకు రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కారణమని అల్లర్లలో మృతి చెందిన రాకేష్ మరణ వాఙ్గమూలాన్ని పరిగణలోకి తీసుకొని ఆయనపై దేశద్రోహం కేసుపెట్టాలన్నారు. యువతకోసం, అన్నివర్గాల కోసం కాంగ్రెస్




పార్టీ అందగావుంటుందని చెప్పారు. జైల్లో ఉన్న యువకులను టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి పరామర్శించి న్యాయపోరాటానికి మేముంటామని భరోసా ఇచ్చారని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ లు ఎందుకువెళ్లలేదని లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్రమోది "మన్ కా బాత్ కాదు" యువత బాగోగులు చూడాలని హితవు పలికారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సంఘనబాట్ల దినేష్, వేముల సుభాష్, రాములు గౌడ్, శైలెందర్ రెడ్డి, ఆవుల శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి, కాంగ్రెస్ నాయకురాలు బతికేపల్లి సర్పంచ్ తాటిపర్తి శోభారాణి, సింహారాజు ప్రసాద్, కస్తూరి శ్రీనివాస్, కుంట సుధాకర్, ఇంద్రల మల్లేశం, చిలుముల లక్ష్మణ్, కట్ట భువనేశ్వర్, వేముల రాజేష్, జజాల రమేష్, తదితరులు పాల్గొన్నారు. సత్యాగ్రహ దీక్షల్లో సికింద్రాబాద్ అల్లర్లలో మృతి చెందిన రాకేష్ కు రెండు నిముషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు.

# పరోపకార తత్వం లయన్స్ జీవన విధానం: ముచ్చ రాజిరెడ్డి

**జనగామ జూన్ 27 (ప్రజామంటలు):** గత మూడు దశాబ్దాలుగా సమాజ సేవలో పురోగమిస్తున్న లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ 31వ అధ్యక్షుడు బచ్చు రమేశ్ ఆయన కార్యవర్గ సభ్యుల పదవీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. క్లబ్ ప్రస్తుత అధ్యక్షుడు ఫజ్జూరి లక్ష్మి నర్సయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా గవర్నర్ లయన్ ముచ్చ రాజిరెడ్డి మాట్లాడుతూ.... విశ్వవ్యాప్తంగా 210 దేశాలలో విస్తరించిన లయన్స్ సంస్థ సభ్యులు పరోపకార తత్వం తమ జీవన విధానంగా మలుచుకుని ముందుకు సాగుతారని అన్నారు. సేవా తత్పరత గల వ్యక్తులు ఉత్తమ పౌరులుగా రాణించుటకు లయన్స్ సంస్థ ఒక ఉత్తమ వేదికగా ఉపకరిస్తుందని అన్నారు. సంస్థ నినాదం "వి సర్వ్" కు తోడుగా 'వేర్ దేర్ ఈజ్ ఏ నీడ్ దేర్ ఈజ్ ఏ లయన్' నినాదం స్ఫూర్తితో రెండవ శతాబ్దిలో లయన్స్ సాలీనా ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మంది అవసరార్తులను ఆదుకునే లక్ష్యంతో ముందుకు సాగుతున్నమని అన్నారు. చార్టర్ నైట్ సందర్భం పురస్కరించుకొని క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్న పరశురాములు మొదలుకొని ఇప్పటివరక సేవ చేసిన పూర్వ అధ్యక్షులు, చార్టర్ సభ్యులను గవర్నర్ జ్ఞాపికలతో క్లబ్ పక్షాన సన్మానించారు. నూతన కార్యవర్గం అధ్యక్షునిగా బచ్చు రమేశ్, కార్యదర్శిగా గట్టు రాధాకృష్ణ, కోశాధికారిగా రేణుకుంట క్రిష్ణ వారి కార్యవర్గ సభ్యులచేత ఉప జిల్లా గవర్నర్ లయన్ ఎన్. వేంకటేశ్వర రావు పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన వారి విధులు, బాధ్యతల గురించి వివరించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ వేడుకలో పాల్గొన్న సే వైస్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్ రెడ్డి, పూర్వ జిల్లా గవర్నర్ డా. డి. లవకుమార్ రెడ్డి,



మెంబర్షిప్ జిల్లా కోఆర్డినేటర్ వి. ప్రసాదరావు, రీజియన్ చైర్మన్ లు దోర్నాల వేంకటేశ్వర్లు, జి. ప్రమోద్ కుమార్, జోన్ చైర్మన్ కె. రాజశేఖర్ రెడ్డి, జిల్లా క్యాబినేట్ కోశాధికారి అల్లాడి ప్రభాకర్, అడ్మిని స్ట్రేటర్ చంద్రగిరి ప్రసాద్, జిల్లా చీఫ్ ఎడిటర్ చిత్రా ఉపేందర్ రెడ్డి, గవర్నర్ లైజాన్ ఆఫీసరు క్రిష్ణ జీవన్ బజాజ్, జిల్లా చైర్మన్ లు ఏ. బిక్షపతి, డా. జి. సీతారాం, డెన్నేస్ రెడ్డి, తదితరులు నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. జనగామ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం అధ్యక్షులు బచ్చు రమేష్, ఉపాధ్యక్షులు శ్రీభాష్యం రఘు, డా. పోకల సతీశ్, కార్యదర్శి గట్టు రాధాకృష్ణ, సంయుక్త కార్యదర్శ పి. చందు, కోశాధికారిగా రేణుకుంట క్రిష్ణ, ఎల్ సిఐఎఫ్ చైర్మన్ ఫజ్జూరి లక్ష్మి నర్సయ్య, మెంబర్షిప్ చైర్మన్ పబ్బ చంద్రశేఖర్, సర్వీస్ చైర్మన్ అల్లాడి మహేశ్వర్, క్వెస్ట్ చైర్మన్ చిత్ర ఉపేందర్ రెడ్డి, పి.ఆర్. ఓ. ఏ. ప్రభాకర్, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ కన్న శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు డా.పి. నాగేశ్వర్ రావు, డా. జి. గోపాల్ రెడ్డి, టైల్విస్టర్ మహ్మద్ గౌస్ మోహినుద్దీన్, టామర్ సి. హెచ్ రఘుపతి రెడ్డి, నాగబండి రవీందర్, రామిని శ్రీనివాసులు, ఎల్ శంకర్ లింగం తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రేషన్ కార్డులపై వదంతులు నమ్మవద్దు

**- ఎమ్మార్వో మహేష్**

**హుస్నాబాద్ జూన్ 27 (ప్రజామంటలు):** ఇటీవల కాలంలో కొత్త రేషన్ కార్డుల నమోదు జరుగుతుందని వాట్సప్ లలో వస్తున్న వదంతులను నమ్మవద్దని హుస్నాబాద్ ఎమ్మార్వో మహేష్ తెలిపారు. కొత్త రేషన్ కార్డుల నమోదు మరియు పిల్లల పేర్లు రేషన్ కార్డులో నమోదు చేయడం గురించి వాట్సాప్ లో వచ్చిన వార్తలను నమ్మి హుస్నాబాద్ పట్టణం లోని మీ సేవా కేంద్రాలలో జనం పోటెత్తారు. దీనిపై హుస్నాబాద్ ఎమ్మార్వో ను వివరణ కోరగా వాట్సాప్లో వచ్చేటువంటి వదంతులను నమ్మవద్దని కొత్త రేషన్ కార్డులకు సంబంధించిన ఎలాంటి ప్రతిపాదనలను గాని అందలేదని తెలిపారు.



# సికింద్రాబాద్ రైల్వే కోర్టులో లోక్ అదాలత్

## 1408 కేసుల పరిష్కారం

**సికింద్రాబాద్ జూన్ 27 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ బోయిగూడ లోని రైల్వే కోర్టులో ఆదివారం నేషనల్ లోక్ అదాలత్ ను రైల్వే రెండవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సాయి కిరణ్ కసమాల నిర్వహించారు. గత




కొన్నేండ్లుగా కోర్టులో పెండింగ్ లో ఉన్న 1408 వివిద రకాల రైల్వే కేసులను ఈసందర్బంగా లోక్ అదాలత్ లో పరిష్కరించారు. రాష్ట్రంలోని హైదరాబాద్ తో పాటు రంగారెడ్డి, మహబూబ్ నగర్, వికారాబాద్, నిజామాబాద్, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల నుంచి వచ్చిన వందలాది మంది నిందితులు రైల్వే కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్ కు హజరయ్యారు. ఈసందర్బంగా మేజిస్ట్రేట్ సమక్షంలో ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో కేసులను పరిష్కారించి, నిందితులను కేసుల నుంచి విముక్తులను చేశారు. హైదరాబాద్ జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఛైర్మన్ బి.పాపిరెడ్డి, సెక్రటరీ రాధిక జైస్వాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయా జిల్లాల నుంచి వచ్చిన రైల్వే పోలీసులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ సమావేశంలో అన్నీ అరకొరగానే 35 వ వార్డ్ కౌన్సిలర్ జయశ్రీ

**జగిత్యాల జూన్ 27 (ప్రజామంటలు):** మున్సిపాల్టీకి సంబందించిన ఏవిశంలో ప్రశ్నలు అడిగినా, వివరాలు కోరినా అన్నీ అరకొరగానే జవాభిస్తూ, దాటవేస్తున్నారని బిమర్శిస్తూ, మున్సిపల్ కార్యాలయంలో అసెస్మెంట్ సర్టిఫికేట్ అధికారికంగా కాకుండా, అనధికారికంగా ఇవ్వడం ఎందుకని 35 వ వార్డ్ కౌన్సిలర్ హన్మండ్ల జయశ్రీ ప్రశ్నించారు. అలాగే హరితహారం, పట్టణ ప్రగతికి సంభందించిన పూర్తి వివరాలు కావాలని అడిగితే కాలాయాపన చేస్తున్నారు కానీ ఎందుకు ఇవ్వడం లేదని ఆమె మున్సిపల్ సాధారణ సమావేశంలో నిలదీయగా, కలెక్టర్ కూడా హరితహారం వివరాలు అడిగారు. వారికి ఇచ్చిన తరువాత ఇస్తామని, అసెస్మెంట్ సర్టిఫికేట్ ఇవ్వడంలో మిగతా మొదటి తరగతి మున్సిపాల్టీలు అనుసరిస్తున్న విధానం కనుక్కొని, అదే విధానం ఇక్కడా అనుసరిస్తామని తెలిపినట్లు జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు.



# ఘనంగా ముదిరాజ్ గోల్డెన్ జూబ్లీ సమావేశం

**సికింద్రాబాద్ జూన్ 27 (ప్రజామంటలు):** ముదిరాజ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ముదిరాజ్ గోల్డెన్ జూబ్లీ రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నగరంలోని నాంపెల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వనిత మహా విద్యాలయంలో ఘనంగా జరిగింది. ఈసందర్బంగా పలు అంశాలపై ముదిరాజ్ సంక్షేమ సమితి ప్రతినిధులు చర్చించి, పలు తీర్మానాలు చేశారు. ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన ముదిరాజ్ లను వెంటనే ప్రభుత్వం బీసీ డీ గ్రూప్ నుంచి బీసీ ఏ గ్రూప్ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో త్వరలో రాబోతున్న శాసన సభ ఎన్నికల్లో అన్ని పార్టీల వారు



అసెంబ్లీ టిక్కెట్లను జనాభా ధామాషా ప్రకారం రాష్ట్రంలో కులాల వారీగా అధిక జనాభా కలిగిన ముదిరాజ్ లకు సమానమైన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ నాయకులు మురళీధర్ ముదిరాజ్, భూపతి ముదిరాజ్, సంక్షేమ సంఘ స్టేట్ ప్రెసిడెంట్ అల్లాదుర్గం సురేశ్ ముదిరాజ్, నాయకులు వినయ్, పొట్లకాయల వెంకటేశ్వర్లు, ప్రభాకర్, రమాదేవి, విజయలక్ష్మీ, పృథ్వీరాజ్, శివ, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.




అగ్నిపథ్ పథకాన్ని వెనక్కి తీసుకోవాలని జగిత్యాల ఆర్‌డిఓ ఆఫీస్ ఎదురుగా సత్యాగ్రహ దీక్షలో పాల్గొని విజయవంతం చేసిన ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, జిల్లా ముఖ్య నాయకులు, జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు. దీక్షకు మద్దతు ఇస్తూ పాల్గొన్న గల్ఫ్ బాధితుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చాంద్ పాషా



కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంత్రి గంగుల కమలాకర్ అధ్యక్షతన డబుల్ బెడ్రూం, దళిత బంధు, మిషన్ కాకతీయ మరియు సుడా అభివృద్ధిపై అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్మెన్ మరియు మానకొండూర్ శాసనసభ్యులు డా. రసమయి బాలకిషన్.



# అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ నల్ల శ్యామ్

**గొల్లపల్లి జూన్ 27 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలం రాపెల్లి గ్రామంలో మండల పరషత్ పాఠశాల అక్షరాభ్యాస కార్యక్రమం స్థానిక సర్పంచ్ నల్ల శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అదేవిధంగా బడి ఈడు కలిగిన పిల్లలను పాఠశాలలో చేర్పించడం జరిగింది. తదనంతరం మాట్లాడుతూ.... ప్రభుత్వం పాఠశాలలో అన్ని వసతులు కల్పించి విద్యాభివృద్ధికి కృషి చేస్తుంది అని తెలియజేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నల్ల శ్యాం, ఎంపిటిసి సభ్యులు మంజుల రవీందర్ రావు, ప్రధానోపాధ్యాయులు గంగాధర్, శ్రీనివాస్, ఎస్ఎంసి చైర్మన్ నల్ల కిరణ్ మరియు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై జిల్లా పాలనాధికారితో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ చర్చలు

**జగిత్యాల జూన్ 27 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రం లోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్‌తో పలు అంశాలపై చర్చించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. జగిత్యాల జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ లో శానిటేషన్,ఇతర అవసరాల దృష్ట్యా లేబర్ నియామకం చేపట్టడం స్థానిక



అవసరాల కోసం ఇసుక, మట్టి నీ ఆయా గ్రామాలలో అందుబాటులో ఉంటే వాడుకునే విధంగా వెసులుబాటు కల్పించడం, ప్రైవేట్ భూమిలో నుండి సైతం మట్టి నీ తీసుకొని వాడుకోవడానికి అభ్యంతరం లేకుండా చూడాలని, గ్రామాల్లోనీ చెరువులు ఇంకా పూర్తిగా నీటితో నిండనందున ఆయా గ్రామ అవసరాలకు చెరువు మట్టి తీసుకునే వారికి అవకాశం కల్పించాలని, టిఆర్ నగర్ లో నిర్మించనున్న వేర్ హౌస్ కార్పొరేషన్ మరియు ఆగ్రో గోదాం కు స్థలం అప్పగించడం. తదితర అంశాలపై కలెక్టర్ జి రవి గారితో చర్చించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లత ఉన్నారు.

**జగిత్యాల పట్టణంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు, టిఆర్ నగర్, ఇస్లాం పుర లో బస్తీ దవాఖాన మంజూరు, పట్టణంలో మైనార్టీ కమ్యూనిటీ హాల్, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. సన్మానించిన ఎంఐఎం పట్టణ**



అధ్యక్షులు యునిస్ నదీమ్, జగిత్యాల సెంట్రల్ ముస్లిం కమిటీ అధ్యక్షులు బారి, ముస్లిం మైనార్టీ సంఘ అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, కౌన్సిలర్ లు రజీయుద్దిన్, షకీల్ పట్వారీ, మైనార్టీ నాయకులు, తదితరులు

# గిరిజన విద్యార్థులకు న్యాయం చేయాలి

**కరీంనగర్ జూన్ 27 (ప్రజామంటలు):** ప్రభుత్వము గిరిజన బెస్ట్ అవలేబుల్ విద్యార్థులకు గతంలో ఉన్న స్కూల్లోనే విద్యాభ్యాసం వసతి గృహం కొనసాగించాలని ఎస్ ఎఫ్ ఐ డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీకాంత్ తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ముందు గతంలో గిరిజన విద్యార్థులకు బెస్ట్ అవలేబుల్ సీట్ల కింద కొన్ని ప్రైవేట్ పాఠశాలలు సెంట్ జాన్స్ సెంట్ అంతోని పాఠశాలలో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద గిరిజన విద్యార్థుల ఎంపిక చేసి ఆయా స్కూల్లో భర్తీ చేశారని రజనీకాంత్ తిరుపతి తెలిపారు. కానీ ఇప్పుడు ఆ స్కూల్ యాజమాన్యాలు మాకు వచ్చే 30000 రూపాయలు



సరిపోతే లేవు కాబట్టి గిరిజన విద్యార్థులకు మేము స్కూళ్ల లో చేర్చుకోబోమని స్కూల్ యాజమాన్యాలు కలెక్టర్ మరియు గిరిజన సంక్షేమ అధికారికి రాత పూర్వకంగా రాశారని గిరిజన అధికారులు తెలిపారు అని వారు అన్నారు. మధ్యనే గిరిజన విద్యార్థులకు ఆ స్కూల్లో లో పోకుండా వేరే స్కూల్లో చేర్చాలని కలెక్టర్ ఆదేశించారని గిరిజన సంక్షేమ అధికారి తెలియజేయడం వల్ల విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వారు అన్నారు. కలెక్టర్ స్థానిక మంత్రి తక్షణమే స్పందించి గతంలో ఉన్న స్కూలు విద్యాభ్యాసము వసతిగృహము కొనసాగే విధంగా చూడాలని వారు కోరారు. గతంలో విద్యార్థులను చేర్చుకొని ఇప్పుడు వద్దని చెబుతున్న సెయింట్ ఆంటోనీ సెయింట్ జాన్స్ స్కూల్ ల పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులకు ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లలో 25% ఉచిత విద్యాభ్యాసం కల్పిస్తామని హామీ చెప్పి నేడు ఆ భర్తీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు విమర్శించారు. అవసరమైతే ప్రభుత్వము స్పందించి మెరుగైన విద్యాభ్యాసం వసతిగృహం కొరకు మంచి స్కూల్ లను ఎంపిక చేయాలని వారు కోరారు. తక్షణమే గిరిజన విద్యార్థుల న్యాయమైన సమస్యను పరిష్కరించకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో మరింత ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు తెలిపారు. ఈ క్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్ పటేల్. లంబాడి ఐక్యవేదిక రాజన్న సిరిసిల్ల అధ్యక్షుడు నరేష్ నాయక్. డివైఎఫ్ఐ నాయకులు అజయ్, వినోద్, సురేష్, రఘు, శ్రీనివాస్, కీర్తన పాల్గొన్నారు.

# రసవత్తరంగా సాగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**హుస్నాబాద్ జూన్ 27 (ప్రజామంటలు):** గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గత సర్వసభ్య సమావేశాల్లో లేవనెత్తిన సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజా ప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాము జవాబుదారీగా ఉంటామని కనీసం ఈ సమావేశంలో నైనా తమ గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎంపీపీ లకావత్ మానస అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి సిద్దిపేట




జిల్లా జెడ్పి చైర్ పర్సన్ రాయి రెడ్డి రాజి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హుస్నాబాద్ సర్వసభ్య సమావేశం మొదటగా వ్యవసాయ శాఖ తో ప్రారంభించారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ముందస్తు ఎరువుల పంపిణీ కార్యక్రమం చేపట్టామని భాస్వరం కలిగించే ఎరువులను పంపిణీ చేసినట్లుగా వారు తెలిపారు. నకిలీ విత్తనాలు చలామణి అవుతున్నాయని రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. హుస్నాబాద్ మండలంలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ ఎప్పుడు జరుగుతుందని కొత్తగా వివాహం చేసుకున్న వారికి రేషన్ కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికే వివాహం చేసుకొని వారి పిల్లల పేర్లు రేషన్ కార్డ్లో నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందా..? అని, కొత్త పింఛన్లు (వృద్ధాప్య, వితంతు, వికలాంగుల) ఎప్పుడు ఇస్తారు అని పందిళ్ల సర్పంచ్ తోడేటి రమేష్ ప్రశ్నించారు.అనంతరం హుస్నాబాద్ ఎమ్మార్వో మహేష్ మాట్లాడుతూ.... వాట్సప్ లలో వచ్చేటువంటి రేషన్ కార్డు సంబంధిత వార్తలను నమ్మవద్దని, కొత్త రేషన్ కార్డుల పంపిణీ ఇంకా రాలేదని జిల్లా అధికారులను తెలుసుకొని వివరణ ఇస్తానని తెలిపారు. కొత్త పింఛన్లకు సంబంధించి దరఖాస్తులను త్వరలో స్వీకరిస్తామని, మండలంలో ఉన్న అర్హులందరికీ పింఛన్లు వర్తించేలా చర్యలు చేపడతామని వివరణ ఇచ్చారు. మన ఊరు మనబడి కార్యక్రమం కింద ఎంపికైన అటువంటి పాఠశాలల వివరాలను తెలపవలసిందిగా విద్యాశాఖ అధికారిని పోతారం (ఎస్) గ్రామ సర్పంచ్ బత్తిని సాయిలు ప్రశ్నించారు.ఎంఈఓ తగిరెడ్డి దేశి రెడ్డి వివరణ ఇస్తూ మన ఊరు మనబడి కార్యక్రమం కింద హుస్నాబాద్ మండలంలో 9 పాఠశాలలు ఎంపికైనట్లు తెలిపారు. హుస్నాబాద్ మండలంలో కుచన్ పల్లి, ఆరేపల్లి, హుస్నాబాద్ ఎంపిపిఎస్, మిర్జాపూర్, మహ్మదాపూర్ ఎంపిపిఎస్, పోతారం (ఎస్), హుస్నాబాద్ జడ్.పి.హెచ్ఎస్ (బాలికలు), జడ్.పి.హెచ్.ఎస్. హుస్నాబాద్, మహ్మదాపూర్ %గ్లూ% పాఠశాలలు ఎంపిక అయినట్లు తెలిపారు ఈ పాఠశాలలకు సంబంధించిన ఎలక్ట్రిషన్ మరియు కిచెన్ షేడ్, డైనింగ్ హాల్, మేజర్ మైనర్ రిపేర్లు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపడతామని ఇందుకుగాను సర్పంచ్ సహకారం కావాలని కోరారు. అక్షరాభ్యాసం తల్లిపాల వారోత్సవాలు సంబంధించిన వివరాలను తెలపాలని వంగ రామయ్య పల్లి సర్పంచ్ వంగ విజయలక్ష్మి ప్రశ్నించారు. సమగ్ర శిశు అభివృద్ధి అధికారి ఎస్. జయ మాట్లాడుతూ.... అక్షరాభ్యాసం మరియు తల్లి పాల వారోత్సవాలు ప్రతి గ్రామంలో నిర్వహించినట్లు తెలిపారు ఇంతలో ఎంపీపీ మానస కలగజేసుకుని అక్షరాభ్యాసం, తల్లిపాల వారోత్సవాలు, శ్రీమంతం కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను గాని ఫోటోలు గాని చూపించాల్సిందిగా తెలిపారు. ఇందుకుగాను ఐసిడిఎస్ అధికారిని తటపటాయించారు. గ్రామాల్లో నిర్వహించడం వంటి అక్షరాభ్యాసం ,తల్లిపాల వారోత్సవాలు, శ్రీమంతం కార్యక్రమాలకు సంబంధించి హుస్నాబాద్ ఎంపీపీ గా నన్ను ఇందుకు పిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామ కార్యక్రమాల్లో నిర్వహించడం వంటి కార్యక్రమాలకు సంబంధించి గ్రామ సర్పంచులకు సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అయితే తెలంగాణ రాష్ట్ర పథకాలు ప్రజల్లోకి వెళ్ళేది ఎలాగని ప్రశ్నించారు. ఇక ముందు గ్రామాల్లో నిర్వహించే ఇటు వంటి కార్యక్రమాలకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ విధంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో , ప్రజా ప్రతినిధులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రశ్నల వర్షం కురిపించారు. చివరగా సిద్దిపేట్ జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ రాయి రెడ్డి రాజా రెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో క్యాన్సర్ వ్యాధికి సంబంధించి రేడియాలజీ విభాగం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగు చేసే విధంగా హుస్నాబాద్ మండలంలో ఉన్న రైతులను అశ్వరావుపేట కి తీసుకువెళ్లి ప్రాజెక్ట్ వర్క్ చేపిస్తాను అని తెలిపారు. అనంతరం హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస మాట్లాడుతూ అధికారులు ప్రజా ప్రతినిధులు కలిసి కట్టుగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గ్రామాల వారీగా రివ్యూ నిర్వహించి సమస్యల గూర్చి తెలుసుకోవాలని అధికారులకు తెలియజేశారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ మండల పరిషత్ వైస్ ఎంపీపీ నిర్మల దేవ సాని, ఎంపీడీవో అనిత, ఎమ్మార్వో మహేష్, ఎంఈఓ తగిరెడ్డి దేశిరెడ్డి, ఎక్సైజ్ ఎస్సై దామోదర్,కో ఆప్షన్ మెంబర్ ఎస్ డి సలీం, వివిధ శాఖల మండల అధిపతులు మరియు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని పథ్‌ను రద్దు చేయాలి : బొమ్మ శ్రీరాం చక్రవర్తి

**హుస్నాబాద్ జూన్ 27 (ప్రజామంటలు):** హుస్నాబాద్ పట్టణం స్థానిక అంబేద్కర్ చౌరస్తా లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్చార్జి బొమ్మ శ్రీరాం చక్రవర్తి అధ్యక్షతన సత్యాగ్రహ దీక్ష కార్యక్రమం




ఉదయం 10:00 గంటలనుండి మధ్యాహ్నం 1: 00 వరకు దీక్షా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశ భద్రత కోసం ఆర్మీ లో చేరాలనుకునే దేశ భక్తి గల యువత యొక్క ఆశలను నిర్వీర్యం చేస్తున్నారని, అగ్నిపథ్ అమలైతే నాలుగేళ్ల తర్వాత 75 శాతం మందినిఇంటికి పంపించి కేవలం 25 శాతం మందిని రెగ్యులరైజ్ చేయడం సరికాదని అన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని దేహదారుఢ్య పరీక్షలు పూర్తిచేసుకుని కరోనా నేపథ్యంలో వాయిదాపడిన రాత పరీక్షల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో అకస్మాత్తుగా ఈ పథకం తెచ్చి వారిని ఆగ్రహావేశాలకు గురి చేయొద్దని బీజేపీ ప్రభుత్వం పై మండిపడ్డారు. తక్షణమే ఈ పథకాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే ఆర్మీ రిక్రూట్మెంట్ చేపట్టాలని కోరారు. అగ్నిపథ్ పథకం ప్రమాదకరమైనదని, దేశ భద్రత ను కాంట్రాక్టు ఇస్తారా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఆర్మీ ఉద్యోగస్తులను వంచించడమే కాకుండా దేశ భద్రతపై బీజేపీకి తపన లేదని దుయ్యబట్టారు. దేశంలో పెరిగిపోయిన నిరుద్యోగ సమస్య తీవ్రతకు ఈ ప్రభుత్వమే అన్నారు. నిరుద్యోగ యువత లో ప్రభుత్వంపై ఉన్న ఆగ్రహమే ఈ ఆందోళనలకు నిదర్శనమని అన్నారు. కేంద్రం ఇప్పటికైనా కళ్లు తెరిచి అగ్నిపథ్ ను రద్దు చేయాలన్నారు. ఎలాంటి చర్యలు లేకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం వల్లే ఇలాంటి దుష్పరిణామాలు సంభవిస్తున్నాయని తెలిపారు. దేశంలో జరుగుచున్న అల్లర్లకు కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. జై జవాన్ జై కిసాన్ అని నినదించిన ఈ దేశంలో నల్ల చట్టాలతో రైతులను మోస పుచ్చుకున్న కేంద్రం ఇప్పుడు జవాన్లను నిర్వేదంలో కి నెడుతూ ఉన్నదని, వన్ ర్యాంక్ వన్ పెన్షన్ అని చెప్పి నో ర్యాంకుబినో పెన్షన్ స్థాయికి ఆర్మీ ని దిగజార్చారని తెలిపారు.

బిజెపి సర్కారు దేశ భద్రతను సైతం కాంట్రాక్టుకు అప్పగించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి బొమ్మ శ్రీరాం చక్రవర్తి తో పాటు జిల్లా అధికార ప్రతినిధి లింగమూర్తి జిల్లా కార్యదర్శులు హసన్ , చిత్తారి రవీందర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోమటి సత్యనారాయణ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుగులోతు రాజు పట్టణ అధ్యక్షులు అక్కు శ్రీనివాస్ అక్కన్నపేట్ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు సింగిల్ విండో డైరెక్టర్లు మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కార్యదర్శులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.




## నేడే మాజీ ప్రధాని పీవీ 101వ జయంతి వేడుకలు

**భీమదేవరపల్లి జూన్ 27 (ప్రజామంటలు):** మాజీ ప్రధాని పీవీ స్వస్థలం వంగర గ్రామంలో మంగళవారం ఉదయం పీవీ నరసింహారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయ కర్త పి.వి. మదన్ మోహన్ తెలిపారు. పి.వి.కుమారుడు పివి ప్రభాకర్ రావు సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ వేడుకలలో హుస్నాబాద్ శాసన సభ్యులు సతీష్ కుమార్, హనుమకొండ జిల్లా పరిషత్తు చేర్మన్ డా.సుధీర్ కుమార్, భీమదేవరపల్లి జడ్పీటిసి వంగ రవి, యంపిపి అనిత, ఎంపిడిఒ భాస్కర్, తహశీల్దార్ ఉమాదేవి, స్థానిక యంపిటిసి కౌసల్య, సర్పంచ్ రజిత, ప్రజా ప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఉదయం జరిగే కార్యక్రమంలో వంగర పి.వి. విజ్ఞాన భూమి కూడలిలో కాంస్య విగ్రహానికి పూలమాలలు సమర్పించి, సభా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పి.వి. మ్యూజియంలో జరిగే పుష్పాంజలి కార్యక్రమంలో ప్రజలు పాల్గొంటారని మదన్ మోహన్ వివరించారు.

# పట్టుదలతో కష్టపడి చదివితే విజయం మీదే

**ఎస్పీ సింధు శర్మ ఐపీఎస్**

**జగిత్యాల 27 (ప్రజామంటలు):** ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని, పక్కా ప్రణాళికతో,మారిన పరిస్థితులు కు అనుగుణంగా ప్రిపరేషన్ ప్రారంభిస్తే తప్పకుండా ఉద్యోగం సాధించవచ్చని జిల్లా ఎస్పీ శ్రీమతి సింధు శర్మ ఐపీఎస్ అన్నారు. సోమవారం ఎస్.కె.ఎన్.ఆర్. డిగ్రీ కళాశాల మైదానంలో లో నిరుద్యోగ యువతీ, యువకుల కొరకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రి -కోచింగ్ అవుట్ డోర్ కోచింగ్ ను జిల్లా అదనపు ఎస్పీతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... ఈ 85 రోజుల శిక్షణ పూర్తయిందంటే మీరు మొదటి



ఎక్కినట్టే అని మీకు ఒక బలమైన సంకల్పం ఏర్పడిందన్నారు. ప్రీ -కోచింగ్ ను మీరందరూ సరైన విదంగా ఉపయోగించుకొని ఉద్యోగం సాధిస్తారనే నమ్మకం మాకు ఉందని .. కాబట్టి మీరందరూ ఆత్మవిశ్వాసం తో కష్టపడి చదవాలని సూచించారు. ఈ యొక్క ప్రి -కోచింగ్ వల్ల మీకు పోలీస్ ఉద్యోగల పట్ల ఒక అవగాహన కలిపించాగాలిగమని అన్నరు. పోలీస్ సెలక్షన్ ప్రాసెస్ గురించి మరియు ఎగ్జామ్ పేపర్ ను గురించి మరియు చదవాల్సిన బుక్స్ గురించి నిపుణులైన వారిచే కోచింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. పోలీస్ సెలక్షన్ ప్రాసెస్ అనేది ప్రిలిమినరీ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, అండ్ ఫైనల్ ఎగ్జామ్ మూడు దశలో ఉంటుందని ఇందులో నిర్దిష్ట ప్రణాళికతో, సరైన అవగాహనతో ముందుకు వెళితేనే ఉద్యోగం సాధించవచ్చని అన్నారు. పోలీస్ సెలక్షన్ ప్రాసెస్, ఎగ్జామ్స్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ గురిచి ఎలాంటి సందేహాలు ఉన్న నిర్భయంగా మా యొక్క అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రస్తుత రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగాలకు చాలా కాంపిటీషన్ ఉందని కావున సమయాన్ని అందరూ సరైన విధంగా ఉపయోగించుకుంటూ మారిన పరిస్థితులకు అనుగుణంగా ప్రిపరేషన్ చేసుకోవాలని సూచించారు.కొద్దిరోజుల పాటు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సోషల్ మీడియాను, సెల్ ఫోన్ ను ఎంత వరకు అవసరమో అంతే మాత్రమే ఉపయోగించుకోవాలని సూచించారు. అభ్యర్థుల కోరిక మేరకు ప్రతి వారం లో ఒక రోజు ప్రాక్టీస్ ఎగ్జామ్స్ ను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా డబ్బులకు గవర్నమెంట్ ఉద్యోగాలు ఇస్తామని చెప్పితే నమ్మవద్దని అలా ఎవరైన ఉద్యోగాలు ఇస్తామని చెపితే స్థానిక పోలీస్ వారికీ సమాచరం అందించాలని సూచించారు. అనంతరం అవుట్ డోర్ కోచింగ్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన యువతీ యువకులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రూపేష్ ఐపిఎస్, డిఎస్పి లు ప్రకాష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు వామనమూర్తి, నవీన్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ లు కృష్ణ గౌడ్, వినోద్ రెడ్డి, మరియు డిస్టిక్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రికి బహిరంగ లేఖ రాసిన వడ్డెర బస్తీ వాసులు

## ప్రభుత్వ భూమిని కబ్జా దారుల నుంచి కాపాడండి : మంత్రి తలసాని కి వేడుకోలు

**సికింద్రాబాద్ జూన్ 27 (ప్రజామంటలు):** మేడ్చల్ జిల్లా బాలనగర్ మండలం బేగంపేట గ్రామంలోని వార్డు నెంబర్ 1, బ్లాక్ 8 లోని ప్రభుత్వ భూమిని కబ్జా దారుల నుంచి కాపాడాలని కోరుతూ స్థానిక వడ్డెర అభివృద్ధి సంఘ నాయకులు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ కు బహిరంగ లేఖ రాశారు. ఈమేరకు వారు ఎన్డీఎమ్ఏ మాజీ వైస్ చైర్మన్ , మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డికి అందచేయగా, దానిని ఆయన మీడియాకు విడుదల చేశారు.

బహిరంగ లేఖ సారాంశం ఇలా ఉంది...

విషయం: సర్వే నం. 194/1, బేగంపేట్ గ్రామం, బాలానగర్ మండల్ మేడ్చల్ జిల్లా, వార్డ్ 1, బ్లాక్ 8 లో ఉన్న మా (వడ్డెర బస్తి) స్థలం సర్వే చేయించి ప్రభుత్వ భూమిని భూ కబ్జాదారుల నుండి రక్షించండి.

సర్వే నెం 194/1 లోని మా వడ్డెర బస్తీ వార్డు 1, బ్లాక్ 8లో ఉందని మీకు తెలుసు. అధికారిక రెవెన్యూ రికార్డు ప్రకారం మొత్తం విస్తీర్ణం 3 ఎకరాల 10 గుంటలు. గతంలో 1993%--%-94లో 2 ఎకరాల విస్తీర్ణంలో గృహనిర్మాణ పథకం నిర్మించబడింది మరియు మిగిలిన భూమి రాతి క్వారీగా ఉంది, దానిని మేము జీవనోపాధికి ఉపయోగించాము. మీరు సనత్‌నగర్ ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రి అయ్యాక 2015లో ఒక ఎన్‌డిఎల్ కంపెనీ మా ఖాళీ భూమిని అకస్మాత్తుగా ఆక్రమించింది. మా భూమిలో 1 ఎకరం 10 గుంటల విస్తీర్ణంతో సహా దాదాపు 4 ఎకరాల భూమిని చుట్టుముట్టి నీలి రేకులు వేసి అక్రమంగా ఆక్రమించుకున్నారు. దయచేసి మీరు ఫిబ్రవరి 22, 2016న మా బస్తీని సందర్శించారని మరియు ఆక్రమణలను తొలగించమని మీతో పాటు ఉన్న అధికారులను ఆదేశించారని మీ జ్ఞాపకాన్ని గుర్తు చేసుకోండి. మేము సంతోషించాము మరియు ఆ తర్వాత మా భూమి మాకు తిరిగి వస్తుందని ఆశించాము. దురదృష్టవశాత్తు, ఇప్పటివరకు ఏమీ జరగలేదు. వార్డ్ 1 బ్లాక్ 10లో సర్వే నంబర్ 194/1లో సుమారు 4 ఎకరాల భూమిని ఎన్‌డిఎల్



కంపెనీ కొనుగోలు చేసింది. వాస్తవానికి వార్డు 1 బ్లాక్ 8లో ఉన్న మా భూమిని తాము ఆక్రమించుకున్నామని, 1వ బ్లాక్ 10లో కొనుగోలు చేసిన భూమిని కాదని జీహెచ్ఎంసీ, సర్వే, రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశాం. సరైన సర్వే చేయాలని డిమాండ్ చేసి 5 ఏళ్లు గడుస్తున్నా ఆ ప్రక్రియ పూర్తి కాలేదు.

ఈ అక్రమాలపై పలుమార్లు మీడియాలో వెలుగు చూసినా అధికారులు మా డిమాండ్‌పై స్పందించలేదు. ఈ నేపథ్యంలో ఆక్రమణదారులకు మీ మద్దతు వల్లే అధికారులు వ్యవహరించడం లేదనేది ఇప్పుడు ప్రజల అభిప్రాయం. అంతే కాదు మరింత శక్తివంతమైన వ్యక్తులు ఘర్ ఆక్రమణదారులను కాపాడుతున్నారని కూడా మాట్లాడుతున్నారు. ఎస్ఆర్ నగర్‌లోని హౌసింగ్ బోర్డు భూమిలో సుమారు 380 చదరపు గజాల చిన్న విస్తీర్ణంలో మీ పార్టీ నాయకులు అక్రమంగా ఆక్రమించుకున్న కేసులో హౌసింగ్ బోర్డు ద్వారా స్టేటస్ కో కోర్టు ఆర్డర్‌ను మీరు పొందారని ఇటీవల వార్తలు చూశాము. ఇప్పుడు మా భూమి మాత్రమే కాకుండా, వాస్తవానికి ప్రభుత్వానికి చెందిన మిగిలిన భూమిని కూడా భూ కబ్జాదారు ఎన్‌డిఎల్ కంపెనీ నుండి రక్షించి, నిజమైన యజమానులకు పునరుద్ధరించాలని మేము మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము. 17.03.2021 నాటి మా లేఖ ద్వారా రీ-సర్వే నిర్వహించడానికి నియమించబడిన సర్వే కమిటీ నివేదికపై మేము మా అభ్యంతరాలను లేవనెత్తామని మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నాము. ఆ తర్వాత, తదుపరి పురోగతి లేనప్పుడు మేము 18.10.2021 తేదీతో కమీషనర్, సర్వే సెటిల్‌మెంట్ మరియు ల్యాండ్ రికార్డ్స్‌కు మరో లేఖను పంపాము. దురదృష్టవశాత్తు, సై నెం. 194/1లో మా విస్తీర్ణం 3 ఎకరాల 10 గుంటలను చూపించాలన్న మా డిమాండ్‌కు ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు.

ఇదంతా ఉద్దేశపూర్వకంగానే విషయాలను కప్పిపుచ్చి, భూకబ్జాదారులు నిర్మాణాలను కొనసాగించడానికి మరియు అక్కడ అపార్ట్‌మెంట్ల కొనుగోలుదారులపై మోసానికి పాల్పడే ప్రయత్నం జరుగుతోందని నిర్ధారణకు దారి తీస్తుంది. ప్రభుత్వానికి సంభందించిన మా 1 ఎకరం 10 గుంటల భూమితో పాటు కబ్జాదారులు ఆక్రమించిన మిగితా భూమి ని కాపాడేందుకు మీరు ఎలాంటి చర్యలు తీసుకోకుంటే, మీ ప్రమేయమే కాకుండా, రాష్ట్ర కాబినెట్ లో ఉన్న ముఖ్యుల ప్రమేయం కూడా ఉన్నదని ప్రజల్లో ఉన్న అనుమానాలు ధృవీకరింపబడుతాయి.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com